అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 21-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 54 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 14 + 16 పేజీలు వెల : 5.00

సీఎస్‌పై ఆప్ దౌర్జన్యం!

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఎమ్మెల్యేల దాడి
- కేజ్రీవాల్ సమక్షంలోనే : సీఎస్ అన్షు ప్రకాశ్

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంట్లో ఆయన చూస్తుండగానే ఇద్దరు ఎమ్మెల్యేలు తనపై దాడి చేశారని ఢిల్లీ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్ ఆరోపించారు. ప్రభుత్వ ప్రణాళికల గురించి చర్చించేందుకు సోమవారం సాయంత్రం సీఎం ఇంటికి వెళ్లిన తనపై ఎమ్మెల్యేలు అజిత్ దత్, ప్రకాశ్ ...9లో

అగ్ని-2 క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అగ్ని-2 క్షిపణి పరీక్ష విజయవంతమైంది. ఒడిషాలోని అబ్దుల్ కలాం దీవిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్) నుంచి దీనిని మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో పరీక్షించారు. కాగా ...9లో

నిందితులకు ప్రజా శిక్ష

- బాలిక కిడ్నాప్ సామూహిక లైంగికదాడి, హత్య
- కామాంధులను లాకప్ నుంచి బయటకు తెచ్చి కొట్టి చంపారు..

9

మానసిక వికలాంగురాలిపై...

- బెంగాల్‌లో సామూహిక లైంగికదాడి
- నిర్భయ ఘటనను తలపించేలా దౌర్జన్యం

2




మనసు గెలిచిన రోబో..

ఐటీ కాంగ్రెస్‌లో ఆకట్టుకున్న 'సోఫియా'



హైదరాబాద్: వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ(డబ్ల్యూసీఐటీ) సదస్సులో సౌదీ అరేబియా పౌరసత్వం పొందిన రోబో సోఫియా తన సమాధానాలతో ఆకట్టుకుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సులో ఎన్‌డీటీవీ గ్రూప్ మేనేజింగ్ ఎడిటర్ రాజీవ్ మకానీ.. అందరి మదిలో మెదిలే పలు ప్రశ్నలకు అడగ్గా తనదైన శైలిలో జవాబులు చెబుతూ సోఫియా ఆహూతులందరి మనసులు గెలుచుకుంది. కృత్రిమ మేధా, రోబోలు, యంత్రాలు ఇవన్నీ మానవజాతిపై అధికారాన్ని చెలాయించవా అని అడిగిన ప్రశ్నకు మానవులు, రోబోలు పరస్పరం సానుకూలంగా ఉంటారని సోఫియా బదులిచ్చింది. గతంలో మానవ జాతిని అంతం చేస్తానని ...9లో



బ్యాంకులు..చిట్స్!

చిట్ ఫండ్ బిల్లుకు సవరణలు

- బ్యాంకుల్లో స్కామ్‌ల వేళ.. సర్కారు కొత్త పాట
- చిట్‌ఫండ్ రంగం బలోపేతానికేనని వివరణ...
- 'ముసాయిదా'కు ఆమోదం తెలిపిన మంత్రివర్గం
- ప్రభుత్వ బ్యాంకుల పటిష్టత గాలికి వదిలి..
- చిట్‌ఫండ్లపై ఆసక్తి ఎందుకు: నిపుణులు
- పెద్దగా ఒరిగేదేమీ లేదు : చిట్‌ఫండ్ సంఘం



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) ప్రజల సొమ్ముకు భద్రత లోపిస్తున్న వేళ.. చిట్‌ఫండ్ రంగాన్ని వెలుగులోకి తెచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 1982లో అమలులోకి వచ్చిన చిట్‌ఫండ్ చట్టానికి సవరణలతో రూపొందించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. దేశంలో చిట్‌ఫండ్ రంగం ఎదుర్కొంటున్న పలు వ్యవస్థాపరమైన అవరోధాలను దూరం చేస్తూనే.. ఆ రంగం ఒక క్రమపద్ధతిలో ఎదిగేందుకు గాను తాము ఈ సంస్కరణలను ముందుకు తీసుకువచ్చినట్టుగా సర్కారు వెల్లడించింది. అయితే దీని వెనుక అసలు మతలబు మరొకటి కనిపిస్తోందని ఆర్థిక సేవల రంగ నిపుణులు చెబుతున్నారు. పీఎస్‌బీలు విఫలమవుతున్న వేళ.. ప్రజలకు చిట్‌ఫండ్ రంగం భద్రమైందన్న భావన కల్పిస్తూనే.. అత్యధికంగా ప్రజల సొమ్మును కార్పొరేట్‌లు, ప్రయివేటు వ్యక్తుల చేతులకు చిట్‌ఫండ్‌ల రూపంలో మళ్లించాలన్నది ...9లో

వివాదాస్పద బిల్లుపై వెనక్కి

- రాజస్థాన్ ప్రభుత్వ నిర్ణయం
- 'ద క్రిమినల్ లా-2017'బిల్లుపై పెద్ద ఎత్తున ప్రజాగ్రహం

జైపూర్ : అడుసు తొక్కనేల... కాళ్లకడుక్కోనేల...అన్నట్టుంది రాజస్థాన్‌లోని వసుంధరారాజే ప్రభుత్వం తీరు. వివాదాస్పద బిల్లు 'ద క్రిమినల్ లా-2017'కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో బీజేపీ ప్రభుత్వం వెనెక్కి తగ్గింది. ఈ బిల్లును తాము రద్దు చేస్తున్నామని సీఎం వసుంధరారాజే తాజాగా ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా న్యాయమూర్తుల్ని, మెజిస్ట్రియల్ స్థాయి అధికారుల్ని, ప్రభుత్వ ఉన్నతాధికారుల్ని విచారించడానికి వీల్లేదంటూ బీజేపీ ప్రభుత్వం చట్టం చేయాలనుకుంది. ఈ బిల్లు ప్రకారం, ప్రభుత్వంలోని ...9లో

అన్నంలో మన్నుపోశారు.. కాలితో తన్నారు..

- కార్వంగ దళితులపై పెత్తందారుల దాడి
- ఇసుక తరలింపును అడ్డుకున్నందుకే..
- నిందితులకు ఎమ్మెల్యే అండదండలు ?
- కేసు నమోదు చేయని పోలీసులు



గుడిసె పీకేసి అన్నంలో మన్నుపోశారని చూపిస్తున్న దళితుడు రామస్వామి

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

'మాల కొడుకుల్లారా... మాముందు నిలబడే అర్హత లేనోళ్లు ఇప్పుడు మాకే నీతులు చెబుతార్రా..ఇసుక తీసుకెళ్తే అడ్డు చెబుతరా.. పంటపొలాలు మీకేనాడైనా ఉన్నయా... సర్కారిచ్చిన చవుట భూములు చూసి విర్రవీగుతున్నరా..పొలం చదును చేసుకుంటూ..ఇక్కడే దర్జాగా అన్నం తింటార్రా..' అంటూ నాగర్‌కర్నూల్ జిల్లాలో దళితులపై పెత్తందారులు దాడిచేశారు. గుడిసెలో కూర్చుని అన్నం తింటున్న వారిని బయటికి ఈడ్చుకెళ్లారు. అన్నంలో మన్ను పోసి కంచాన్ని కాలుతో తన్నారు. ఘటన జరిగి ఆరు రోజులైనా పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదు. పెత్తందారులకు స్థానిక ఎమ్మెల్యే అండడండలు ఉండటం వల్లే పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు.

తెలకపల్లి మండలం కార్వంగ గ్రామానికి చెందిన దళితులు రామస్వామి, గాజుల రాంచందర్, మహిందర్, బంగారయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి పొలాల మధ్య నుండి పెత్తందార్లకు చెందిన కొంతమంది ట్రాక్టర్లతో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. మట్టిబాట కావడంతో పంట దుమ్ముతో నాశనమవుతోంది. ఇసుక తీసుకెళ్లొద్దని దళితులు వారిని కోరారు. ఎంత చెప్పినా వినలేదు. ఈ క్రమంలో వారం రోజుల కిందట దళితులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అప్పటి నుంచి వారిపై అక్కసు పెంచుకున్న తాళ్లపల్లికి చెందిన రవీందర్‌రెడ్డి, సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, నడిగడ్డ ...9లో

'మాఫీ'పై కూపీ

- లాభమా..? నష్టమా...?
- నష్టమేనంటున్న ఉన్నతస్థాయి వర్గాలు
- క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్న ఆలోచనలో సర్కార్
- పెట్టుబడి పథకంపైనా ఆరా..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకం వల్ల అన్నదాతకు నిజంగా లాభం జరిగిందా? లేక నష్టమా...? అంటే కచ్చితంగా నష్టమే అంటున్నాయి ఉన్నతస్థాయి వర్గాలు. రైతులకున్న రుణాలను ఒకేసారి కాకుండా నాలుగేండ్ల సమయంలో నాలుగు విడతలుగా విడుదల చేయటం వల్ల వారికి ...9లో

పుట్టిన 28 రోజులకే నూరేండ్లు...

- ఏడాదికి 6 లక్షల మంది నవజాత శిశువుల మృతి
- యూనిసెఫ్ అధ్యయనం వెల్లడి

2లో

unicef United Nations Children's Fund

పర్మిషన్ లేకుండానే డబుల్ శిలాఫలకం

- ఇచ్చేది లేదంటూ బాధితుల ఆగ్రహం
- పురుగుల మందు డబ్బాలతో నిరసన
- హైకోర్టు ఆదేశాలు పట్టించుకోరా..?

వివరాలు 9లో



పైసల్ గావల్నారా..పన్జేయ్..

- వైద్యానికి డబ్బులడిగితే దళిత కార్మికున్ని చావబాదిన వైనం
- అడ్డొచ్చిన తల్లిని వివస్త్రను చేసి పైశాచికానందం
- ప్రశ్నించిన మరో ఎనిమిది మంది కార్మికులపై దాడి
- 16 గంటల పనికి రూ.16.50...ఆపై చిత్ర హింసలు
- కరీంనగర్‌లో ఇటుక బట్టీ యజమాని దౌర్జన్యం

వివరాలు 10లో

కొక్కొరోకో..



ఆ రుణమాఫేదో.. "రైట్ ఆఫ్" లాగా చేస్తే.. దేశం దాటి పోరేమో సార్..!!

విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోకి

తెలంగాణలో అన్ని స్థానాల్లోనూ బీఎల్ఎఫ్ పోటీ

- జనాభా ప్రాతిపదికన సీట్లు ఇస్తాం
- కేరళ పాలనే మాకు ఆదర్శం : బహిరంగ సభలో బీఎల్ఎఫ్ నేతలు

నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి

"బీఎల్ఎఫ్ అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటాం. పాలనలో మాకు కేరళ రాష్ట్రమే ఆదర్శం. వచ్చే ఎన్నికల్లో తెలంగాణాలో అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తాం. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తాం. గెలిచి తీరుతాం" అని ఫ్రంట్ రాష్ట్ర నేతలు అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా బీఎల్ఎఫ్ బహిరంగసభ సంగారెడ్డి ...9లో



మాట్లాడుతున్న నల్లా సూర్య ప్రకాశ్

గోదారిలో నీటి లెక్క తేలాకే..

నదులు అనుసంధానం చేయాలి : తెలంగాణ వాదన

- కాళేశ్వరం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలపై ఏపీ అభ్యంతరం
- పోలవరం ముంపుపై కేంద్రం జోక్యం కోరిన తెలంగాణ
- పట్టిసీమ, పోలవరం నీటి వాటాపై డిమాండ్
- దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సదస్సులో కీలక నిర్ణయాలు లేకుండానే సదస్సు వాయిదా

వివరాలు 9లో



మానసిక వికలాంగురాలిపై...

బెంగాల్‌లో సామూహిక లైంగికదాడి

నిర్భయ ఘటనను తలపించేలా చిత్రహింసలు

కోల్‌కతా: దేశరాజధాని లో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి, చిత్రహింసలను తలపించేలా పశ్చిమ బెంగాల్ లో మరో ఉదంతం వెలుగు లోకొచ్చింది. మతిస్థిమితం లేని మహిళపై కొందరు వ్యక్తులు దారుణానికి ఒడిగట్టారు. ఆమె ప్రయివేటు భాగాల్లో ఇనుపరాడ్లను దూర్చి చిత్రవధకు గురిచేస్తూ... మానవ మృగాలు ప్రవర్తించారు. దక్షిణ దినజ్‌పూర్ జిల్లా కుష్మండిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. కుష్మండి గ్రామంలో నివసించే ఆ మహిళ(28) తల్లిదండ్రులు పదేండ్ల క్రితమే చనిపోవడంతో స్థానికుల సహాయంతో ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో మానసిక అనారోగ్యానికి గురైంది. కాగా, అదే గ్రామానికి చెందిన కొందరు ఆమెపై కన్నేశారు. ఈ నెల 18న గ్రామంలోని జాతరకు వెళ్లి తిరిగివస్తుండగా మార్గమధ్యలో ఆమెను అడ్డగించి పక్కనే ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి సామూహిక లైంగికదాడికి పాల్పడుతూ ఆమెను చిత్రహింసలకు గురిచేశారు. ఆమె ప్రయివేటు భాగాల్లో ఇనుపరాడ్, చేతులను దూర్చి చిత్రవధ చేశారు. ఆమె స్పృహ కోల్పోగా అక్కడే వదిలి పారిపోయారు. అపస్మారక స్థితిలో పడివున్న బాధితురాలిని గమనించిన పోలీసులకు సమాచారమందించగా ఆమెను రాయ్‌గంజ్ జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రికి తీసుకొచ్చినపుడు ఆమె పరిస్థితి విషమంగా ఉందని, శస్త్రచికిత్సచేసి ఆమె ప్రయివేటు భాగాల్లో ఉన్న ఇనుపముక్కలను బయటకు తీశామనీ వైద్యులు తెలిపారు. అప్పటికీ ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండటంతో మాల్దా మెడికల్ కళాశాలకు తరలించారు. ఆమెకు స్పృహ రావడంతో ఘటనను పోలీసులకు వివరించింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం రాంప్రసాద్ శర్మ అనే నిందితుడిని అరెస్ట్ చేశామని మిగతా వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఏడిజి అనూజ్ శర్మ తెలిపారు.

కమల్ పార్టీ ప్రకటన నేడే

హాజరుకానున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



చెన్నై: తమిళనాడు సహా దేశ ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమిళ నటుడు కమల్‌హాసన్ నేడు (బుధవారం) పార్టీని ప్రకటించనున్నారు. మధురైలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే భారీ బహిరంగ సభలో పార్టీ పేరు, విధి విధానాల్ని ఆయన ప్రకటించనున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. చెన్నై విమానాశ్రయంలో మంగళవారం తనను కలిసిన విలేకరులతో కమల్ మాట్లాడుతూ... మధురైలో బుధవారం నిర్వహించే కార్యక్రమానికి తనను ఆశీర్వదించడానికి చాలా మంది సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. తనతో కలిసి వచ్చే వాళ్లందరూ నేటి సభకు హాజరుకావాలని కోరారు. అంతకుముందు.. 'తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చాలా సార్లు మాట్లాడాను, కానీ ఇప్పుడే మాట్లాడలేను. రేపటి సభలో అంతా మాట్లాడతాను. రేపటి నుంచి మా ప్రయాణం ప్రారంభం కాబోతోంది' అని ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈ సభకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రావలసి ఉండగా వారి పర్యటనలు ఇంకా ఖరారు కాలేదు. ఇటీవల తన పార్టీ ప్రారంభానికి రావాలని సూపర్ స్టార్ రజనీకాంత్, డీఎంకే అధినేత కరుణానిధి, ఆతని కుమారుడు స్టాలిన్, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్‌ను కలిసిన సంగతి తెలిసిందే. మధురైనుంచే కమల్ తన రాజకీయ యాత్రను ప్రారంభించబోతున్నారు.

సోషల్

లలిత్ మోడీ - పారిపోయాడు
విజయ్‌మాల్యా - పారిపోయాడు
నిరవ్‌మోడీ - పారిపోయాడు



కంగారుపడకండి.. రైతులు.. మధ్యతరగతి ప్రజల నుంచి వడ్డీతో సహా రుణాలు వసూలుచేయడానికి బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి...

ఆయనకు 83.. ఆమెకు.. 30

వారసుడి కోసం రెండో పెండ్లి

రాజస్థాన్‌లో ఘటన



జైపూర్: వారసుడి కోసం ముప్పై ఏండ్ల యువతితో రెండో పెండ్లికి సిద్ధమయ్యాడు ఓ వృద్ధుడు. ఇందుకు ఆయన మొదటి భార్య కూడా అంగీకారం తెలిపింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని సమ్రదా గ్రామంలో చోటు చేసుకుంది. రాజస్థాన్‌లోని కార్వాలి జిల్లాకు చెందిన సుక్రమ్ బైరవ(83) కు భార్య బట్టో, పెండ్లైన ఇద్దరు కూతుర్లు ఉన్నారు. 20 ఏండ్ల క్రితం వారి కొడుకు తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే తన మరణాంతరం వంశపారంపర్యంగా వస్తున్న ఆస్థిని చూసుకోవడానికి వారసుడు కావాలనుకున్నాడు. దాంతో ఓ యువతి(30) తో వివాహానికి సిద్ధమయ్యాడు. వారసుడి కోసం బైరవ రెండో పెండ్లికి ఆయన భార్య అంగీకరించింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల, గ్రామస్థుల సమక్షంలో వారి పెండ్లి తంతు ముగిసింది. ఈ ఘటన పై తహసీల్దార్ నేతృత్వంలో విచారణకు ఆదేశించామని జిల్లా పరిషత్ చీఫ్ సురేంద్ర మహేశ్వరి చెప్పారు.

'ఎన్‌ఆర్‌సీ'పై గడువు పెంపునకు నో..

సుప్రీంకోర్టులో కేంద్రానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : అసోంలో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్(ఎన్‌ఆర్‌సీ) జాబి తా విషయమై కేంద్రా నికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. రాష్ట్రంలో పౌరుల నమోదుకు సంబంధించిన తుది జాబి తాను ప్రకటిం చేందుకు గడువు పొడిగించేది లేదం టూ భారత సర్వోన్నత న్యాయస్థానం మంగ ళవారం స్పష్టం చేసింది. మే 31లోగా ఎన్‌ఆర్‌సీ తుది జాబితా ప్రకటిం చాలని న్యాయ మూర్తులు రంజన్ గోగోయ్, ఆర్‌ఎఫ్ నారీమన్‌ల నేతృత్వంలోని ధర్మాసనం తేల్చి చెప్పింది. అంతేకాక.. ఈ వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షించనున్నట్టు ధర్మాసనం వెల్లడించింది. అయితే.. మే 31లోగా ఎన్‌ఆర్‌సీ జాబితా తయారీ భౌతికంగా సాధ్యం కాదని కేంద్రం తరపు న్యాయవాది, అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఈ వాదనపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది.

ఎంపీల జీతభత్యాలపై మీ వైఖరేంటి?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యుల జీతభత్యాలు, అలవెన్స్‌లను నిర్ణయించడానికి శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంపై మీ వైఖరేంటని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్‌ను దాఖలు చేయాలంటూ వారం రోజుల గడువు ఇచ్చింది. ప్రస్తుతం వారి జీతాలను వారే నిర్ణయించుకుంటున్న నేపథ్యంలో.. వారి జీతాల పెంపుకు శాశ్వత యంత్రాంగం ఏర్పాటు విషయమై ఓ ఎన్‌జీవో దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. కాగా, ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉందనీ, వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తెలిపింది. 'భారత ప్రభుత్వ విధానం క్రియాశీలకమైనది...దాన్ని ప్రతిరోజూ మార్చలేరని' కేంద్రానికి చురకలంటించింది. అసలు దీనిపై ప్రభుత్వం వ్యూహమేంటి? శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నారా? వద్దనుకుంటున్నారా?' అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో ఆలస్యం చేయడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 'దీనిపై మీకెలాంటి స్పష్టత లేకపోవచ్చు...కానీ మీకిదే చివరి అవకాశం' అని కోర్టు స్పష్టం చేసింది. ఎంపీలు వారి జీతాలను వారే ఎలా పెంచుకుంటారంటూ ఎన్జీవో తరపు న్యాయవాది ఎస్ఎన్ శుక్లా తన వాదనను వినిపించారు. 11 ఏండ్ల క్రితం లోక్‌సభ స్పీకర్ అన్ని పార్టీలను సమావేశపరిచి ఎంపీల జీతబత్యాలు, అలవెన్సులు నిర్ణయించడం కోసం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఏకపక్షంగా నిర్ణయించారంటూ కోర్టుకు తెలిపారు. కానీ ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదని అన్నారు. లోక్ ప్రహరి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యాన్ని విచారించిన కోర్టు ఎంపీలు వారి జీతాల్ని స్వయంగా నిర్ణయించలేరని వెల్లడిస్తూ తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేసింది.

సీపీఐ(ఎం)
తమిళనాడు కార్యదర్శిగా బాలక్రిష్ణన్



చెన్నై : సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా మాజీ ఎమ్మెల్యే బాలక్రిష్ణన్ ఎన్నికయ్యారు. తమిళనాడులోని ట్యుటికోరిన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 22వ మహాసభలు మంగళవారం ముగిశాయి. కాగా.. మహాసభల చివరి రోజున పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి రామక్రిష్ణన్ స్థానంలో బాలక్రిష్ణన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన 1970లో విద్యార్థి దశలో ఉండగానే సీపీఐ(ఎం)లో చేరారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న క్రమంలో 1972లో కాలేజీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం నిర్విరామంగా ఉద్యమిస్తున్నారు. 2011లో రాష్ట్రంలోని చిదంబరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పుట్టిన 28 రోజులకే నూరేండ్లు...

ఏడాదికి 6 లక్షల మంది నవజాత శిశువుల మృతి

యూనిసెఫ్ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ : ఏడాదికి ఆరు లక్షల మంది చిన్నారులకు పుట్టిన 28 రోజులకే నూరేండ్లూ నిండుతున్నాయి. నవజాత శిశు మరణాల సంఖ్య ప్రపంచంలోనే మన దేశంలో అత్యధికంగా ఉన్నట్టు యునిసెఫ్ తాజా అధ్యయనం వెల్లడించింది. వీటిలో ఎక్కువ భాగం మరణాలు నివారించేవి, వైద్యపరంగా చికిత్స చేయగలిగినవేనని గుర్తించింది. ఈ మరణాల్లో 80శాతం ఎటువంటి తీవ్రమైన కారణాలతో సంభవించినవి కాదని స్పష్టం చేసింది. కాగా... దేశంలో ఐదేండ్లలోపు చిన్నారుల్లో మరణాల రేటు తగ్గిందని ఆ అధ్యయనం పేర్కొంది. "దేశంలో శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రతి ఏడాదీ చనిపోతున్న శిశువుల సంఖ్య ఆమోద యోగ్యం కానిది. ప్రతి ఏడాదీ సుమారుగా 6,00,000 మంది నవజాత మరణాలు భారతదేశంలో సంభవిస్తున్నాయి" అని యునిసెఫ్ తెలిపింది. ప్రసూతి మరణాలకు సంబంధించి 'ప్రతి చిన్నారీ బతకాలి' పేరుతో యునిసెఫ్ ఈ నివేదకను మంగళవారం విడుదల చేసింది. ప్రతి వెయ్యి జననాల్లో 24.4 మరణాల రేటుతో 184 దేశాల్లో భారత్ 31వ ర్యాంకు సాధించింది. శిశువుకు మొదటి 28 రోజులు చాలా దుర్భలమైన కాలం. పసికందుల్లో తొలి నెలలో అత్యధిక ప్రమాదం పొంచి వుంటుంది.

ప్రపంచవ్యాప్తంగా నెలరోజుల లోపు చిన్నారుల్లో మరణాలరేటు ప్రతి వెయ్యిమందిలో 19గా నమోదైనట్టు నివేదిక తెలిపింది. 2016లో 2.6 మిలియన్ల మంది పుట్టిన నెల రోజుల్లోపు చనిపోయారనీ, అందులో వారం రోజుల వయస్సుగల చిన్నారులో ఎక్కువని యునిసెఫ్ నివేదిక పేర్కొంది. 'చనిపోయిన పసికందుల్లో.. 80 శాతం కంటే ఎక్కువ మంది చికిత్సచేయగలిగినవేనని, నెలలు నిండకుండానే పుట్టడం, డెలివరీ సమయంలో సమస్యలు, సెప్సిస్, న్యుమోనియా తదితర అంటువ్యాధులు సోకి మరణించారు' అని తెలిపింది. పరిశుభ్రమైన తాగునీరు, వైద్య సౌకర్యాలు, తల్లి, నవజాత శిశువుకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం ఉండాలి. డెలివరీ సమయలో ఒక మృత్తి నైపుణ్యం కలిగిన ఆరోగ్య కార్యకర్త, శిశువు జన్మించిన మొదటి గంటలోపు తల్లిపాలు తాగించడం తదితర చర్యలతో శిశుమరణాలను చాలా వరకు అరికట్టవచ్చునని స్పష్టం చేసింది. "2030 నాటికి శిశు మరణాల రేటు 12కు తగ్గాలన్నది భారత్ లక్ష్యం. దానిని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న దానిని సగానికి సగం తగ్గించాలి. ఏదేమైనా.. ఐదేండ్లలోపు చిన్నారుల మరణాల తగ్గుదలలో మంచి పురోగతి ఉంది" అని తెలిపింది.



జేఎన్‌యూ విద్యార్థుల భారీ ర్యాలీ

వీసీని తొలగించాలంటూ డిమాండ్

న్యూఢిల్లీ: వైస్ చాన్స్‌లర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) విద్యార్థులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అకాడమిక్ కౌన్సిల్ మీటింగ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా అటెండెన్స్ రూల్స్ తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వర్సిటీ వీసీ ఎం.జగదీశ్ కుమార్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసన తెలుపుతూ ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని మండీ హౌస్ నుంచి దాదాపు 1000 మంది విద్యార్థులతో ప్రారంభమైన ర్యాలీ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యాలయం వరకు కొనసాగింది. విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందస్తు భద్రత కోసం మంత్రిత్వ శాఖ భవనం వద్ద దాదాపు 150కి పైగా ఢిల్లీ, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు మోహరించాయి.

రాజస్థాన్‌లో మహాధర్నాకు వెళ్తున్న రైతు నేతల అరెస్టుకు

ఏఐకేఎస్ ఖండన

జైపూర్: రాజస్థాన్‌లో రైతు నేతలు, కార్యకర్తల అరెస్ట్‌ను అఖిలభారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ఖండించింది. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ నెల 22న జైపూర్‌లో ప్రారంభం కానున్న నిరవధిక మహాధర్నా(మహా పడావ్)కు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలి వెళ్తున్న రైతు సంఘాల కార్యకర్తలను అక్కడి బీజేపీ ప్రభుత్వం అరెస్ట్ చేసినట్టు ఏఐకేఎస్ తెలిపింది. అరెస్టయినవారిలో ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు అమ్రారామ్, సీనియర్ నేతలు హేతురామ్‌బేనీవాల్, ష్యోపట్ మేఘ్‌వాల్, ఇంకా ఇతరులు ఉన్నారు.

గతంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రైతు ఆందోళనకు తలొగ్గి రుణమాఫీ, ధాన్యం సేకరణ, కనీస మద్దతుధర, పింఛన్లుసహా పలు డిమాండ్లకు అంగీకరించిన వసుంధరరాజే ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా వెనక్కి తగ్గిందని ఏఐకేఎస్ విమర్శించింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగానే మహాధర్నాకు పిలుపునిచ్చినట్టు ఏఐకేఎస్ తెలిపింది. బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా మహాధర్నా జరిపి తీరుతామని ఏఐకేఎస్ స్పష్టం చేసింది. రైతులు, వ్యవసాయ కార్మికులు హాజరయ్యే మహాధర్నాలో ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్‌ధవాలే, సంయుక్త కార్యదర్శి విజూకృష్ణన్ పాల్గొంటారని ఏఐకేఎస్ తెలిపింది. రైతులు సంఘటితం కావడంతో బీజేపీ ప్రభుత్వానికి వణుకు పుట్టిందని ఏఐకేఎస్ దుయ్యబట్టింది. అణచివేత ద్వారా ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని ఏఐకేఎస్ స్పష్టం చేసింది. రైతులు, కార్మికులు, పేదల వ్యతిరేక బీజేపీ ప్రభుత్వ విధానాలను ఓడించే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించింది.

తొలి మహిళా రైల్వేస్టేషన్

జైపూర్‌లోని గాంధీనగర్‌లో...



జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో గల గాంధీనగర్ రైల్వేస్టేషన్‌ను అందరూ మహిళలే నిర్వహిస్తున్నారు. దేశంలో మహిళలు నిర్వహిస్తున్న తొలి మహిళా రైల్వే స్టేషన్ ఇదే. రైల్వే స్టేషన్ నార్త్ వెస్ట్రన్ రైల్వే (ఎన్‌డబ్ల్యూఆర్) పరిధిలోని ఈ స్టేషన్‌లో ప్రతీ ఉద్యోగి మహిళే కావడం గమనార్హం. దేశంలో ఇదే పూర్తిస్థాయి తొలి మహిళా రైల్వే స్టేషన్. స్టేషన్ సూపరింటిండెంట్, హెడ్ టికెట్ కలెక్టర్, పాయింట్ ఉమెన్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌తో సహా మొత్తం 32 మంది మహిళలే నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ ఏంజెలా స్టెల్లా మాట్లాడుతూ... ఏడాది రైల్వే సర్వీసులోనే ఈ స్థాయికి చేరుకుంటానని అనుకోలేదన్నారు. స్టేషన్ భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. మొదటి రోజు విధిలో భాగంగా సిబ్బంది.. స్టేషన్‌లో ప్లాట్‌ఫాం టిక్కెట్ లేకుండా తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకుని రూ.260 ఫైన్ విధించారు. ఎన్‌డబ్ల్యూఆర్ జనరల్ మేనేజర్ టి.పి.సింగ్ స్టేషన్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. రోజుకు 7వేల మంది ప్రయాణించే ఈ రైల్వే స్టేషన్‌లో 25 రైళ్లు నిలుస్తాయి. కాగా, సబర్బన్ కేటగిరిలో ఇటీవలే ముంబయికి సమీపంలోని మాతుంగా స్టేషన్ అందరూ మహిళలు నిర్వహించిన స్టేషన్‌గా గుర్తింపు పొందినా.. గాంధీనగర్ మాత్రం మెయిన్ కేటగిరిలో తొలి స్టేషన్‌గా గుర్తింపు పొందింది. అంతేకాకుండా దేశంలోని శానిటరీ నాప్కిన్స్ యంత్రాలున్న ఆరు రైల్వే స్టేషన్లలో ఇది ఒకటి కావడం గమనార్హం.

'తయారీ'లో మహిళలు వెనుకంజ

స్వీడెన్ ప్రభుత్వం అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని తయారీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటుందని స్వీడెన్ రాయబార కార్యాలయం నిర్వహించిన ఒక సర్వే నిర్ధారించింది. ఈ రంగంలో పని చేసే కార్మికులలో మహిళల వాటా కేవలం 3 శాతం నుంచి 12 శాతం లోపునే ఉంటున్నట్టు ఈ సర్వే నిర్ధారించింది. వివిధ రంగాలకు చెందిన 25 కంపెనీల ఉద్యోగులతో నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఈ విషయం స్పష్టమైంది. సర్వీసు రంగాలలో మాత్రం మహిళలు ఎక్కువగానే రాణిస్తున్నారు. ఈ రంగాలలో సుమారు 27 శాతం నుంచి 40 శాతం వరకు మహిళలను నియమిస్తున్నట్టు స్పష్టమైంది. అసలు నిజం ఏమిటంటే తయారీ రంగంలో మహిళలకు ఉన్న ఉపాధి అవకాశాల గురించి వారికి సరైన అవగాహన లేకపోవడమే కారణమని ఈ సర్వే నిర్వాహకులు వెల్లడించారు. ఈ విషయంలో వారిని చైతన్యవంతం చేసేందుకు క్రాఫ్ట్ మేళాలను విస్తృతంగా నిర్వహించాలని వారు సూచించారు. ఇలాంటి మేళాలను మన దేశంలోని స్వీడిష్ చాంబర్ ఆఫ్ కామర్స్ విభాగం పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. అన్ని రంగాలకు చెందిన వారిలో అట్టడుగు వర్గాల వారిని ఎంపిక చేసుకుని వారి వృత్తి నైపుణ్యాలకు మెరుగు పెట్టాలని ఆలోచిస్తున్నట్టు స్వీడెన్ కౌన్సెల్ జనరల్ వులికా సుండ్‌బర్గ్ తెలిపారు. తయారీ రంగం ద్వారా తయారయ్యే కొన్ని ఉత్పాదనల వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. డ్రిల్లింగ్ మెషీన్లు, వాటర్ ఫిల్టర్లు, తయారీ యంత్రాలు ఉత్పత్తి చేసే రంగాలలో మహిళలకు మంచి అవకాశాలున్నట్టు ఆయన చెప్పారు. సేవా రంగాలలో డిజిటల్ సొల్యూషన్స్, లాజిస్టిక్స్‌లో డిజిటల్ సేవలు, నిధుల నిర్వహణ, కమ్యూనికేషన్స్, ఉపాధి కల్పన వంటి రంగాలలో సాధారణ నైపుణ్యాలు ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి ఆశించే వారి సంఖ్యల్లో చాలా వ్యత్యాసాలున్నాయని అంటూ ఉద్యోగాల కోసం ప్రయత్నించిన విద్యావంతులైన మహిళలు 2007లో 39 శాతం ఉండగా 2014 నాటికి ఆ అంకె 49 శాతానికి చేరిందని, అయితే వారిలో అందరూ ఉపాది మార్కెట్లోకి రావటం లేదని ఆయన తెలిపారు. కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చదువుతున్న వారు 12 శాతం చేరుతున్నప్పటికీ కీలకమైన ఇంజినీరింగ్ రంగాలలో ప్రవేశించేవారు 3 శాతం మాత్రమేనని ఆయన తెలిపారు. కేవలం సగం సంస్థల్లో మాత్రమే మహిళలకు ఉన్నత పదవులు దక్కుతున్నాయని, ఫలితంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే వారు లేకుండా పోతున్నారని ఆయన చెప్పారు. ఏ కొద్ది మంది అయినా ఉన్నత పదవులకు చేరువైనా గర్భధారణ అనంతరం చాలా మంది తిరిగి ఉద్యోగాల్లో చేరడం లేదని సహ అధ్యయనవేత్త సారా లార్సన్ గుర్తుచేశారు. అంటే మహిళలను ఉద్యోగాలనుంచి జారిపోకుండా కాపాడుకోవటం చాలా అవసరమని, అందుకోసం మహిళలకు ప్రత్యేకంగా మాతృత్వపు సెలవులు మంజూరు చేయటంపై యాజమాన్యాలు గ్రహించాలని సూచించారు. పురుషులతో సమానంగా కెరీర్ పెంచుకునేందుకు అసౌకర్యవంతమైన పనివేళల్లో పనిచేసేందుకు కూడా కొంత మంది సిద్ధమవుతున్నా వాళ్లకి ఇచ్చే వేతనాల్లో వ్యత్యాసాలు కారణంగా చాలా మంది ముందుకు రావటం లేదని మానవ వనరుల అధికారులు తెలిపారు.

నా ఇష్టప్రకారమే ఇస్లాం స్వీకరించా : హదియా



న్యూఢిల్లీ: నా ఇష్టప్రకారమే ఇస్లాం మతాన్ని స్వీకరించానని, మతం మారాలని తనపై ఎవరూ ఒత్తిడి చేయలేదని హదియా అలియాస్ అఖిల అన్నారు. ముస్లిం వ్యక్తిని ఇష్టపడి పెండ్లి చేసుకున్నందుకు లవ్‌జీహాద్ పేరుతో వేధింపులు ఎదుర్కొంటున్న హదియా మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన భర్తతో కలిసి ఉండడానికి అవకాశం కల్పించాలని కోరుతూ మంగళవారం ఆమె పిటిషన్ దాఖలు చేశారు. భర్త (షఫీన్ జహాన్)నూ ఇష్టపూర్వకంగానే పెండ్లి చేసుకున్నానని పిటిషన్‌లో వివరించారు. తన తండ్రిని కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. తన భర్త ఏనాడూ తన భావాలకు విరుద్ధంగా వ్యవహరించలేదన్నారు. మీడియాలో, బయట తనపై వస్తున్న వదంతులు తీవ్రంగా కలిచివే స్తున్నాయన్నారు. ఇది ఇలాగే కొనసాగితే తన చదువుపై ప్రభావం పడుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు ఇస్లామిక్ స్టేట్ సంస్థ ఐఎస్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలను ఆమె ఖండించారు. బతికినా చచ్చినా భారతీయురాలిగానే ఉంటానన్నారు. దీనిపై తనను ప్రశ్నించడానికి ఎవరికీ హక్కు లేదన్నారు. ఎన్ఐఏ అధికారులు తనను ఓ తీవ్రవాదిలా భావిస్తూ వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఆత్మహత్యలు

సంపాదకీయం

డబ్బుకోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారట! ఆత్మహత్యలు చేసుకునే వారంతా రైతులు కాదట. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అర్థరహిత వ్యాఖ్యలు చేశారు. అన్నదాతలను అవహేళన చేయడం అన్యాయం. ఇది నోటి దురుసుతనం, తెంపరితనం. బ్యాంకులను దోచినవారు, ప్రజలను ముంచినవారు, డబ్బు సంచులు దేశ సరిహద్దులు దాటించారు. దర్జాగా విదేశాల్లో విహరిస్తున్నారు. రైతులంటే విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ, విక్రమ్ కొఠారీలు కాదు. నేలతల్లిని నమ్ముకుని బువ్వ పెడుతున్న వారు. మోసం చేయడం తెలియని అమాయకులు. ప్రజలు పస్తులుండకుండా అందరికీ బువ్వ అందించాలనుకునే దేశభక్తులు. ఒకప్పుడు పత్తి ఉత్పత్తి చేసే రైతులలో మాత్రమే ఎక్కువగా ఆత్మహత్యలు చూశాం. ఇప్పుడు అన్ని వ్యాపార పంటలకూ వ్యాపించింది. పప్పులు, నూనెగింజలు, ఆహార ధాన్యాలు పండించే వారికి కూడా అంటుకున్నది. చివరకు కూరగాయలు, పండ్లతోటల రైతులను కూడా వదిలిపెట్టలేదు. అసలు రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అర్థాంతరంగా తనువు చాలించడం పాలకులు ఇచ్చే ముష్టి డబ్బు కోసమేనా? నిజానికి ఆత్మహత్యలు చేసుకున్న అత్యధికులకు ప్రభుత్వం నుండి సాయం అందలేదు.

ఆత్మహత్యలు కూడా కౌలూ సన్న చిన్న కారు రైతులే ఎక్కువ. మద్దతు ధరకు అదనంగా 50శాతం కలిపి కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయాలి. గద్దెమీదున్నవారు ఆచితూచి మాట్లాడాల్సిన అవసరం చాలా ఉంది.

తెలంగాణలో 2015లో 1400 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవి పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. రాష్ట్రంలో సాగుభూమికి ఎక్కువగా వర్షాధారమే గతి. కోటి ఎకరాలకు నీరందిస్తామన్న పాలకుల మాట నీటి మూటగానే మారింది. ఈ మూడేండ్లలో అనావృష్టి అతివృష్టితో పంటలు పాడైనాయి. కరువు మండలాలను ప్రకటించడంలో పాలకులకు ప్రతిష్ట అడ్డమొచ్చింది. ధనికరాష్ట్రంలో కరువు ప్రకటన నామోషీ అనుకున్నారు. అతివృష్టి వలన పంట నష్టపోయిన రైతుకు మోడీ బీమా పనిచేస్తుందనుకున్నారు. కానీ, అదీ అందలేదు. చీడ పీడలతో వరీ పత్తీ ఉత్పత్తి తగ్గింది. దోమకాటు వలన వేలాది ఎకరాల వరికి రైతులు చేజేతులా నిప్పు పెట్టిన దుస్థితి. తెల్లబంగారానికి గులాబీ పురుగు గండమొచ్చింది. దిగుబడి తగ్గింది. ఎన్ని మందులుకొట్టినా చావలేదు.. పూత, కాయ రాలింది. రైతుల ఆశలు అడుగంటాయి. కష్టానికి ఫలితం రాలేదు. అప్పులు మీద పడ్డాయి. పరువు బజారున పడుతుందని తనువు చాలిస్తున్నారు. సానుభూతితో సమస్య పరిష్కరించాల్సిన పాలకులు కనికరం లేకుండా మాట్లాడటం అన్నదాతలను అవమానించడమే.



వ్యవసాయ సీజను మొదలు నుంచీ రైతు ఊబిలో కూరుకుపోవడానికి రంగం సిద్ధమౌతున్నది. కల్తీ విత్తనాలతో గల్తీ చేస్తారు. అంతకు ముందు ఏడాది అనుకున్న విధంగా పత్తి సాగువిస్తీర్ణం పెరగలేదు. తగ్గింది. వ్యాపారుల అంచనాలు తలకిందులయ్యాయి. విత్తనాలు మిగిలిపోయాయి. ఏడాది పాటు నిల్వ ఉన్న విత్తనాలు ఉపయోగించకూడదని శాస్త్రవేత్తలు తెలిపారు. వ్యాపారులు 22 లక్షల బీటీ పత్తి విత్తనాల ప్యాకెట్లను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ పెట్టారు. పశువుల దాణా తయారీకి నిల్వ చేస్తున్నట్టు కోల్డ్ స్టోరేజీ యాజమానులకు చెప్పారు. నిజానికి రసాయన పదార్థాలుండటం వలన దాణాకు కూడా ఉపయోగపడదు. పాత పత్తి విత్తనాలను డీలర్లు ప్యాకింగ్ మార్చి అమ్ముకున్నారు. విత్తన చట్టం నిరుపయోగమైంది. యజమానులకు చుట్టంగా మారింది. పాలకులు పాపం చేశారు. రైతులకు నష్టం చేసి బదనాం చేయడం ముమ్మాటికీ బాధ్యతా రాహిత్యమే.

విత్తనగండం నుండి బయటపడిన రైతు పంట చేతికి వచ్చినా ఉత్పత్తి ఖర్చులైనా రాని పరిస్థితి దాపురించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్పత్తి ఖర్చులపై 50శాతం అధికంగా ధర నిర్ణయిస్తామన్నారు. అదీ ఉత్తమాటగానే మిగిలింది. కనీస మద్దతు ధర కరువైంది. గిట్టుబాటు ధర చెల్లుబాటు కాలేదు. ఉత్పత్తి ఖర్చులను లోపభూయిష్టంగా నిర్ణయించడం వలన రైతులు నష్టపోతున్నారు. ధరలు నిర్ణయించేటప్పుడు పారిశ్రామిక ధరలు సాధారణ ధరలు ప్రజా పంపిణీ చేసే ధరలపై ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు. అన్నదాతను దివాళా తీయించేందుకు వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నారు. అందుకే కంది రైతులు రోడ్ల మీదికొచ్చి ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి. వ్యవసాయ రంగాన్ని దిగ్బంధనం చేస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకునేది రైతులు కాదని కహానీలు అల్లుతున్నారు.

విత్తన గండం, మార్కెట్ మాయను దాటి చివరకు అప్పుల సుడిగుండంలో రైతు చిక్కుకొని విలవిల్లాడుతున్నాడు. ఎల్‌ఓయూలతో కోట్లు చేతులు మారుతున్న కాలంలో అన్నదాతకు మాత్రం అప్పు పుట్టడం లేదు. 65శాతం మంది రైతులు ప్రయివేటు అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నారు. ఆస్థి తెగనమ్మినా అప్పులు తీరని దుస్థితి దాపురించింది. మూడులక్షల కోట్లకు పైగా మొండిబకాయిదారుల అప్పులు రద్దు చేసిన ప్రభుత్వం రైతుల అప్పులు ఎందుకు రద్దు చేయడం లేదు. ఈ ప్రభుత్వాలు రైతుల పక్షపాతం కాదని తేలిపోయింది. తెలంగాణలో రద్దు చేసిన ప్రభుత్వ అప్పు 34శాతమే. ఆత్మహత్యలు కూడా కౌలూ సన్న చిన్న కారు రైతులే ఎక్కువ. మద్దతు ధరకు అదనంగా 50శాతం కలిపి కేంద్రానికి పంపి చేతులు దులుపుకున్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయాలి. గద్దెమీదున్నవారు ఆచితూచి మాట్లాడాల్సిన అవసరం చాలా ఉంది.

దక్షిణాఫ్రికా త్రిపక్ష కూటమిలో సయోధ్య కొనసాగేనా!



ఎం. కోటేశ్వరరావు

అవినీతి ఆరోపణల పూర్వరంగంలో వెల్లడైన తీవ్ర వత్తిడి మేరకు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా తొలుత మొరాయించినా చివరకు తలొగ్గి రాజీనామా చేయక తప్పలేదు. గత గురువారం నాడు జుమా రాజీనామా వెంటనే ఉపాధ్యక్షుడిగా వున్న సిరిల్ రమఫోసా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. పదవి నుంచి గౌరవ ప్రదంగా తప్పుకోవాలని దక్షిణాఫ్రికా పాలక కూటమి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) జాతీయ కార్యవర్గం చేసిన నిర్ణయాన్ని మరోదారి లేక అమలు జరిపిన తొలి అధ్యక్షుడు తాబో ఎంబెకీ కాగా, రెండవ అధ్యక్షుడిగా జాకబ్ జుమా చరిత్రకెక్కారు. 1994లో జాత్యహంకార పాలన అంతమైన 24ఏండ్లలో తొలి అధ్యక్షుడు నెల్సన్ మండేలా అన్న విషయం తెలిసిందే. మరొకరు ఒక ఏడాదిపాటు తాత్కాలిక అధ్య క్ష బాధ్యతలలో వున్నారు. మండేలా తరువాత దీర్ఘకాలం పదవిలో వున్న ఎంబెకీ, జుమా రాజీనామాలతో ఇంటిదారి పట్టటం ఏఎన్‌సీ బలహీనతలు, బలాన్ని సూచిస్తున్నది.

జుమా రాజీనామా చేసి పదవి నుంచి తప్పుకోవాలని పాలక త్రిపక్ష కూటమిలోని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ(ఎస్ఏసీపీ) గత

ఏఎన్‌సీ పాలనలో అవినీతికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు గళమెత్తుతున్నారు. తొమ్మిదేండ్ల క్రితం ఏ కమ్యూనిస్టుపార్టీ జాకబ్ జుమాను బలపరిచిందో అదే పార్టీ అతడిని తొలగించాలని ముందుగా గళమెత్తింది. అనేక అంశాలపై పార్టీ విభేదిస్తున్నది. అందువలన వచ్చే ఎన్నికల నాటికి అది దేశాన్ని నడిపించేందుకు తనదైన పంథాలో పయనిస్తుందా అన్నది ఆసక్తి కలిగించే అంశం. అదే అయితే కమ్యూనిస్టుపార్టీ, కొసాటు ఒకవైపు, ఏఎన్‌సీ మరోవైపు అధికారం కోసం పోటీపడినా ఆశ్చర్యం లేదు.

కొద్ది డిమాండ్ చేస్తూ వస్తోంది. మరో పక్షమైన కార్మిక సంఘాల కూటమి(కొసాటు) కూడా రాజీనామా చేయాలని కోరింది. చివరకు ఏఎన్‌సీ కార్యవర్గం సుదీర్ఘ తర్జనభర్జనల అనంతరం జుమా రాజీనామా కోరుతూ తీర్మానించింది. జుమా పాలనలో అనేక అవినీతి ఆరోపణలు, ఆశ్రిత పక్షపాత వంటి ఆరోపణలతో పాటు అనేక రంగాలలో వైఫల్యం కారణంగా 2016లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఏఎన్‌సీ అనేక పరాజయాలు చవిచూసింది. ఏఎన్‌సీ పరువు ప్రతిష్టలు నిలబడాలంటే, కార్పొరేట్ వ్యతిరేక చర్యలు తీసుకొనేందుకు గాను జుమా రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ముందుగా కమ్యూనిస్టుపార్టీ లేవెనెత్తింది. దానితో ఆగ్రహించిన జుమా కమ్యూనిస్టు మంత్రి ఒకరిని తొలగించారు. జుమాపై చర్యతీసుకోని పక్షంలో తాము అధికార కూటమి నుంచి వైదొలుగుతామని, అవసరమైతే వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలలో వంటరిగా పోటీ చేస్తామని కమ్యూనిస్టులు హెచ్చరించారు. డిసెంబరులో ఏఎన్‌సీ పార్టీ అధ్యక్షుడిగా జుమాను తొలగించి సిరిల్ రాంఫోసా ఎన్నికైన తరువాత ఏఎన్‌సీ కార్యవర్గం ఏదో ఒక నిర్ణయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానిలో భాగంగానే పదవి నుంచి మర్యాద పూర్వకంగా తప్పుకోవాలని కోరింది. దానికి జుమా తిరస్కరించటంతో అల్టిమేటం జారీ చేయాల్సి వచ్చింది.

జాత్యహంకార పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరులో ఆయుధాలు పట్టిన జుమా అనేకమంది ఇతర నేతల మాదిరిగానే జైలు పాలయ్యారు. యువనేతగా దేశం దృష్టిని ఆకర్షించిన ఆయన 1997లో ఏఎన్‌సీ ఉపాధ్యక్షుడిగా, 1999లో దేశ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తరువాత ఐరోపా కంపెనీతో జరిగిన ఆయుధ లావాదేవీలలో చోటు చేసుకున్న అక్రమాలతో జుమాకు సంబంధమున్నట్టు ఆరోపణలొచ్చాయి. జుమా ఆర్థిక సలహాదారు నిందితుడిగా తేలాడు. జుమా2005లో పదవీచ్యుతుడయ్యాడు. తానెలాంటి అక్రమాలకు పాల్పడలేదని, అధ్యక్షుడు తాబో ఎంబెకీ అక్రమాలను వ్యతిరేకించినందుకు తనను కేసులలో ఇరికించారని చేసిన వాదనలను ఏఎన్‌సీ నాయకత్వం విశ్వసించింది. దాంతో ఎంబెకీని రాజీనామా చేయించి ఆ స్థానంలో జుమాను 2009లో అధ్యక్షుడిగా నియమించారు. ఇటీవల జుమాపై 18 అంశాలలో వచ్చిన అవినీతి, ఆరోపణలపై విచారణ ఎదుర్కోవాల్సిందేనని ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయన్స్ దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు గతేడాది స్పష్టం చేసింది. తాను అమాయకుడిని అన్న జుమా వాదన కోర్టు కొట్టివేసింది. డిసెంబరు 13న ఇచ్చిన తీర్పులో జుమా, అతని అనుచరులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు జనవరిలో ఒక కమిషన్ ఏర్పడింది. ఒక అవినీతి నివేదికను తొక్కిపెట్టటంలో జుమా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు మరో కేసులో న్యాయస్థానం స్పష్టం చేసింది. భారతీయ సంతతికి చెందిన గుప్తా కుటుంబం జుమాతో వున్న సంబంధాలను ఉపయోగించుకొని అనేక ప్రభుత్వ కాంట్రాక్టులను పొందినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కోర్టు తీర్పుల తరువాత వారం రోజులకే డిసెంబరు 18న జుమాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి సిరిల్ రాంఫోసాను ఎన్నుకున్నారు.

ఏఎన్‌సీ జాత్యహంకార పాలన అంతం కోసం ఏర్పడిన ఒక బూర్జువా వేదిక. సోషలిస్టు సమాజ స్థాపనలక్ష్యంగా ఏర్పడింది దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ (ఎస్ఏసీపీ). ఈ రెండు శక్తులు పని చేస్తున్న కార్మిక సంఘాలతో ఏర్పడిన సమాఖ్య (కొసాటు). దశాబ్దాల తరబడి ఒకే లక్ష్యంతో పనిచేసిన ఈ శక్తులు ఏఎన్‌సీలో భాగస్వాములు. 1994లో శ్వేతజాతి పాలన అంతమైన తరువాత ఏఎన్‌సీ పతాకం, గుర్తుపైనే వారందరూ ఎన్నికలలో పోటీ చేసి పాలనలో భాగస్వాములయ్యారు. అవినీతి ఆరోపణలతో ఇద్దరు అధ్యక్షులను అర్థంతరంగా తొలగించటం ఏఎన్‌సీ బలహీనత. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటంలో విఫలమైనప్పటికీ జనంలో ఇంకా విశ్వాసం ఉన్నకారణంగానే రాజీనామా చేసిన అధ్యక్షులు తోక ముడవటం దాని బలానికి చిహ్నం. గత 24ఏండ్లుగా ఏఎన్‌సీ అనుసరించినవి స్థూలంగా నయా ఉదారవాద విధానాలు తప్ప మరొకటి కాదు. పర్యవసానంగా జనంలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. జాత్యహంకార పాలన అంతమైన తరువాత జాతీయ ప్రజాస్వామిక విప్లవాన్ని(ఎన్‌డీఆర్) సాధించాలన్నది త్రిపక్ష కూటమి అంగీకరించిన కార్యక్రమం. 1995లో కూటమి అంగీకరించిన 'స్వేచ్ఛా ప్రణాళిక"లో దీనిని చేర్చారు.

అయితే ఆచరణలో దీనికి భాష్యాలు భిన్నంగా ఉన్నాయి. నల్లజాతి సాధికారత అంటే ప్రజాస్వామిక వ్యవస్థ ఏర్పాటు చేసి గుత్తాధిపతులుగా వున్న శ్వేతజాతి పెట్టుబడిదారులతో సమంగా అవకాశాలు కల్పించటం అన్నది ఏఎన్‌సీ అవగాహనగా కనిపిస్తున్నది. ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పాటు చేయటంతో పాటు ప్రత్యేకించి నల్లజాతీయులను, ఆఫ్రికన్లందరినీ తొలుత విముక్తి చేయాలని, జాతివివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేసి సోషలిస్టు వ్యవస్థ స్థాపనకు దారి తీసే విధంగా ముందు దశగా ఎన్‌డీఆర్‌ను అమలు జరపాలన్నది కమ్యూనిస్టుపార్టీ అవగాహన. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఎన్నికైన ఒకనాటి కార్మికనేత సిరిల్ రమఫోసా 1994 తరువాత వాణిజ్య, పారిశ్రామికవేత్తగా ఎదిగాడు. అలాంటి వారు ఏఎన్‌సీలో ఎందరో ఉన్నారు. రాజీనామా చేసిన జుమా భారతీయ సంతతికి చెందిన గుప్తా సోదరులకు అండదండలిచ్చి అవినీతికి పాల్పడిన విషయం తెలిసినదే. స్థానిక నల్లజాతి, శ్వేతజాతి వ్యాపారులు తమ పోటీదార్లకు మద్దతు ఇవ్వటాన్ని సహించలేక జుమాపై వత్తిడి తేవటంలో వారు కూడా తమవంతు పాత్ర పోషించారనే అభిప్రాయాలున్నాయి. పన్నెండేండ్ల క్రితం జాతీయ ప్రజాస్వామిక విప్లవం గురించి సమీక్షించిన కమ్యూనిస్టుపార్టీ సాధించిన విజయాలను తక్కువ చేసి చూడనవసరం లేదని అయితే మొగ్గు పెట్టుబడిదారీ వ్యవస్థను పటిష్టపరిచే వైపే ఉందని అభిప్రాయపడింది. అప్పటి నుంచి అక్కడి పరిణామాలలో పెద్ద మార్పులేమీ లేవు. జాత్యహంకార వ్యవస్థ రద్దయిన తరువాత నల్లజాతీయులలో విద్యావ్యాప్తి, గృహవసతి, తదితర సంక్షేమ చర్యలకు పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు కేటాయించినమాట వాస్తవం. ఒక అంచనా ప్రకారం 45శాతం కుటుంబాలు సామాజిక భద్రతా పథకాల కింద ఆర్థిక సాయం పొందుతున్నాయని చెబుతున్నారు. అయితే ఇవి పేదలకు ఉపశమనం కలిగించేవి తప్ప మరొకటి కాదు.



ఇప్పటికీ 95శాతం సంపదలు పదిశాతంగా వున్న శ్వేతజాతీయుల చేతుల్లో ఉన్నాయి. సారవంతమైన భూములు కూడా వారికిందే ఉన్నాయి. 14శాతం భూములు ప్రభుత్వానికి చెందినవి కాగా, 79శాతం వివిధ ట్రస్టులు, ఇతర రూపాలలో శ్వేతజాతీయుల ఆధిపత్యంలోనే వున్నాయి. వాటిని స్వాధీనం చేసుకొనేందుకు ఇంతవరకు సరైన చట్టాలను రూపొందించలేదు. వాటికి పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవాలా లేక ఇవ్వకుండా తీసుకోవాలా అనే చర్చ ఇంకా ఏఎన్‌సీలో నడుస్తూనే వుంది. అంటే సూత్రప్రాయంగా అంగీకరిస్తూనే ఆచరణలో నీరుగార్చటం తప్ప మరొకటి కాదు.

1994 నుంచి గతేడాది జనవరి వరకు ప్రభుత్వం 49లక్షల హెక్టార్ల భూమి స్వాధీనం చేసుకుంది. దీనిలో 34లక్షల హెక్టార్లను పంపిణీ చేసింది. ఇదిగాక మరొక పథకం ప్రకారం స్వాధీనం చేసుకున్న భూమిలో సగానికి ప్రభుత్వం పరిహారం ఇచ్చి దానిని సమభాగస్వామ్య పద్ధతిలో నల్లజాతీయులు- శ్వేతజాతీయులతో సాగు చేయించటం కూడా చేస్తున్నది. ఇలాంటివి కొన్ని ఉన్నప్పటికీ మొత్తం మీద భూకేంద్రీకరణ దెబ్బతీసి మెజారిటీ ప్రజలకు అప్పగించి వారి ఆదాయాల పెంపుదలకు విప్లవాత్మక చర్యలేవీ తీసుకోలేదు. ఇలాంటి తీరుతెన్నుల కారణంగానే సమాజంలోని మెజారిటీ తరగతులలో అసంతృప్తి పెరుగుతోంది. అది పాలక కూటమిలో రాజకీయ సమస్యలకు దారితీస్తున్నది. దక్షిణాఫ్రికాలో అవినీతి ఒక పెద్ద సమస్యగా తయారైంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వస్తూత్పత్తితో పాటు అవినీతి ఒక ఉప ఉత్పత్తిగా వుంటుంది. అందువలన అధ్యక్షులు మారినప్పటికీ అవినీతి ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే వుంటుంది. పైకి ఏమి చెప్పినప్పటికీ నయా ఉదారవాద విధానాలనే అమలు జరుపుతున్నందున రానున్న రోజులలో ఏఎన్‌సీలో అంతర్గత వైరుధ్యాలు తలెత్తటం అనివార్యం.

జాకబ్ జుమా రాజీనామాతో ఒక ఘట్టం ముగిసింది తప్ప అవినీతి సమస్య పరిష్కారం కాలేదు. అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వుంది. నాటకీయ పరిణామాల మధ్య జుమా స్థానంలో రమాఫోసా వచ్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. రమాఫోసా ఇంతవరకు మంత్రివర్గాన్ని ప్రకటించలేదు. మంత్రుల శాఖలు, సంఖ్యను కూడా తగ్గిస్తానని అధ్యక్షుడిగా పార్లమెంట్ తొలి ఉపన్యాసంలో చెప్పారు. ఏఎన్‌సీ ప్రతిష్ట పెంచాలంటే కొంతమంది మంత్రుల పేర్లను ఉటంకిస్తూ వారిని తిరిగి చేర్చుకోరాదని కొసాటు డిమాండ్ చేసింది. రమాఫోసా పాత వ్యవస్థతోనే ప్రయాణించాలని చూడటాన్ని మెజారిటీ జనం అంగీకరించరని, అది ఆయనను ఎక్కువ దూరం ప్రయాణించనివ్వదని కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. మంత్రివర్గానికి కాయకల్ప చికిత్స చేయాలని, మంత్రిత్వశాఖలను పునర్విభజించాలని కూడా కోరింది.

రానున్న రోజులలో జాతీయ ప్రజాస్వామ్య విప్లవ కార్యాచరణ గురించి త్రిపక్ష కూటమిలో అంతర్గత పోరు తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అవి ముదిరితే రాజకీయ పునరేకీకరణకు దారితీసినా ఆశ్చర్యం లేదు. అనివార్యమైన ఈ పరిణామం ఎప్పుడన్నదే సమస్య. అంగీకృత కార్యక్రమం నుంచి వైదొలుగుతున్న తీరు కనిపించినా ఏఎన్‌సీలో కమ్యూనిస్టుపార్టీ, కొసాటు ఇంతకాలం కొనసాగటమే ఆశ్చర్యం. వివిధ ఎన్నికలలో తగిలిన ఎదురుదెబ్బలు, పలు తరగతులలో పెరుగుతున్న అసంతృప్తి కారణంగా కమ్యూనిస్టుపార్టీ పునరాలోచనలో పడింది. ఏఎన్‌సీ నుంచి విడగొట్టుకోవాలనే ఆలోచన దానిలో ప్రారంభమైంది. డిసెంబరులో జరిగిన ఏఎన్‌సీ సభలో కమ్యూనిస్టు పార్టీ నేత జిమాండే జాతీయ కార్యవర్గానికి ఎన్నిక కాలేదు. పార్టీలు వేర్వేరుగా వున్నప్పటికీ చట్టసభలకు ఏఎన్‌సీ గుర్తుమీదే మూడు పక్షాలూ పోటీ చేస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల నాటికి ఈ కూటమి ఇలాగే వుంటుందా అన్నది ఒక పెద్ద ప్రశ్న. తాము వచ్చే ఎన్నికలలో విడిగా పోటీ చేస్తామని కమ్యూనిస్టుపార్టీ నాయకులు చెబుతున్నారు. కింది శాఖలలో అలాంటి చర్చ అనుమతిస్తున్నారు. రానున్న ఎన్నికలలో విడిగా ప్రచారం చేయాలని కమ్యూనిస్టుపార్టీ మహాసభ గతేడాది నిర్ణయించింది. అవసరమైతే వచ్చే ఎన్నికలలో విడిగా పోటీ చేసే దిశలో ఇదొక అడుగుగా చెప్పవచ్చు. ఏఎన్‌సీ పాలనలో అవినీతికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు గళమెత్తుతున్నారు. తొమ్మిదేండ్ల క్రితం ఏ కమ్యూనిస్టుపార్టీ జాకబ్ జుమాను బలపరిచిందో అదే పార్టీ అతడిని తొలగించాలని ముందుగా గళమెత్తింది. అనేక అంశాలపై పార్టీ విభేదిస్తున్నది. అందువలన వచ్చే ఎన్నికల నాటికి అది దేశాన్ని నడిపించేందుకు తనదైన పంథాలో పయనిస్తుందా అన్నది ఆసక్తి కలిగించే అంశం. అదే అయితే కమ్యూనిస్టుపార్టీ, కొసాటు ఒకవైపు, ఏఎన్‌సీ మరోవైపు అధికారం కోసం పోటీపడినా ఆశ్చర్యం లేదు. ■

మెయిల్ @ నవతెలంగాణ



నాగటి నారాయణ


ప్రధానిది పరీక్షలపై చర్చేనా?

"పరీక్షపై చర్చ" పేరుతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం మధ్యాహ్నం దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారంతో గంట పైగా విద్యార్థులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 6 లక్షల హైస్కూళ్లు, 35 వేల కాలేజీల్లోని 10కోట్లమంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు కేంద్ర విద్యా మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. పరీక్షలంటే భయపడవద్దని, వాటిని వినోదంగా భావించాలని, పండుగలా పాల్గొనాలని, పరీక్ష యోధుల్లా సన్నద్ధం కావాలని ప్రధాని ఉపోద్ఘాతంలో ఉద్బోధించారు. ఆ తర్వాత జరిగిన సంభాషణలో పరీక్షల మాటున ప్రధాన చేసిన ప్రసంగ చాతుర్యంలో నాలుగు ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి.

ఒకటి, ఢిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారితో పాటు వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని యిచ్చిన సమాధానాల్లో వక్కాణించిన కొన్ని మాటల్లో తన సైద్ధాంతిక భావజాలం తొణికిసలాడింది. అహం బ్రహ్మాస్మి, ఆత్మ విశ్వాసం, యోగా, ధ్యానం, గురు శిష్య పరంపర వగైరా మాటలు ఆ కోవకు చెందినవే. చదువు కోసం సరస్వతి దేవిని పూజించినట్టే పరీక్షల సమయంలో హనుమంతుడిని తలుచు కోవాలని చెప్పటంలో అంతరార్థం తెలిసిందే. రెండు, ఇప్పుడు పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన (10, 12 తరగతులు) విద్యార్థులు 2019 ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయాల్సిన వారు. కాబోయే ఓటర్లను అడ్వాన్స్‌గా కలుసుకుంటున్న రాజకీయ వ్యూహంగా ఉంది. మూడు, చర్చా కార్యక్రమంలో ప్రధాని అంతా హిందీలోనే మాట్లాడారు. ఇంగ్లీషులో ప్రశ్నలడిగిన విద్యార్థులకు కూడా హిందీలోనే సమాధా నాలు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు హిందీ అర్థం కాకపోయినా నిర్బంధంగా గంటపైగా టీవీల ముందు కూర్చోవాల్సి వచ్చింది. నాలుగు, నరేంద్ర మోడీ ప్రధాని హోదాలో ప్రభుత్వ ఖర్చుతో ఎంత పెద్ద ప్రచారం చేసుకున్నారో ఈ కార్యక్రమం తేటతెల్లం చేసింది.

సెల్: 9490300577


మోడీలో ఓటమి భయం మొదలయిందా?



సిహెచ్. మధు

ప్రధాని నరేంద్రమోడీలో ఓటమి భయం ప్రారంభమయ్యిందా? ఆ చిహ్నాలు కనిపిస్తున్నాయి. ఆయన మాటలలో హావభావాలలో, ఉపన్యాసాలలో ఓటమి భయం కనిపిస్తోంది. పైకి ధీరుడుగా మాట్లాడుతున్నా.. గంభీరంగా ఉన్నా.. ఆయన చేతలలో మాటలలో ఉలికిపాటు కనిపిస్తోంది. మూడేండ్ల క్రితం ఎదురులేని వ్యక్తిగా కనిపించిన మోడీ ఇప్పుడు ఎదురుగాలి ఎదుర్కొంటున్నారు. ఆయనకు అర్థమైంది. "తనకు ఎదురు గాలి ప్రారంభమైందని.. అన్ని దిక్కుల నుండి ఎదరుగాలి రావచ్చుని" అర్థమవుతోంది. కార్పొరేట్ రాజకీయాలు ఆయనకు బాగా తెలుసు. కార్పొరేట్ రాజకీయాలలో దోపిడీ స్వభావముంటుంది. దోపిడీ స్వభావం ప్రజలను దూరం చేస్తుంది. ఈ సందర్భంలో ఓ విషయం స్పష్టంగా చెప్పాలి. మోడీ ఎంత చతురుడైనా అంత కంటే ఎన్నో రెట్లు తెలివైన వాళ్లు ప్రజలు. ప్రజలు ఇప్పుడు చైతన్యవంతులయ్యారు. నోరు మెదపటంలేదు. కానీ.. మోడీ ఏమిటో ఆయన మాటలేమిటో ఆయన పాలన ఏమిటో, ఎవరి కోసమో అన్నీ వాళ్లకు తెలిసింది. ప్రజల మనసులలో మోడీ వ్యతిరేక గాలి ఉంది. నిజం చెప్పాలంటే... నోట్లరద్దుతో ప్రజల దృష్టిలో మోడీ ఓడిపోయారు. జీఎస్టీతో ప్రజలు ఆయన్ని మనసు నుండి తీసివేసారు. ఒకసారి ప్రజల దృష్టి నుండి పక్కకు జరిగిన నాయకుడు ఇంకోసారి ప్రజల దృష్టిలోకి రారు. ఈ చైతన్యం భారత ప్రజలలో ఎన్నోసార్లు చూసాం. ఎన్నో ఎన్నికలలో చూసాం. ప్రజలు నిశ్శబ్దంగా ఉండి దెబ్బతీయగలరు. ప్రధాని మోడీపైన ప్రజల ఆశలు సన్నగిల్లాయి. ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఆ విషయం మోడీ పసిగట్టారు. ప్రజలను మళ్లీ తన వైపు తిప్పుకోవటం కష్టమని ఆయనకు తెలుసు. ఆ భయమే ఆయన మనసులో విస్తరించింది. అందుకే ఆయన మాటలలో తొట్రుపాటు ఉలికిపాటు. మాట జారటం ఇతరులను అవహేళనగా మాట్లాడటం, ఇవన్నీ ఓడిపోతాననే భయానికి చిహ్నాలే. ఆయన మీద ఆయనకు ఆత్మవిశ్వాసం పోయినట్టే కన్పిస్తోంది. ఆయన ఆత్మవిశ్వాసం సంగతేమో కానీ.. ప్రజలకు మోడీ మీద విశ్వాసం పోయింది. ప్రధానిగా నరేంద్రమోడీ మరో ఐదేండ్లు కొనసాగితే తమ బతుకులు బజారుపాలవుతాయని భయపడు తున్నారు.

ప్రధానిగా తాను ఫెయిలయ్యానని మోడీ భావిస్తున్నారో లేదో కానీ.. ప్రజలైతే భావిస్తున్నారు. ఆయన గంభీరోపన్యాసాలు మాటల మెరుపులు, పదాల గారడీలు మాటల ఈటెలు, మాటల మంత్రాలు హావభావా క్రోధాలు ఏవీ పనిచేయక పోవచ్చు. అందుకు కారణం ఒక్కటే, ప్రజల ఆశలు నిరాశకావటం.. ఎవరికైనా ఆశ నిరాశ కావటం కోసం.. బాధ, విరక్తి కలిగిస్తాయి. ఇప్పటి పరిస్థితి అదే.. ఎన్నో ఆశలతో ప్రజలు మోడీని ప్రధాని చేసారు. కాంగ్రెస్‌తో సంకీర్ణ ప్రభుత్వాలతో విసిగిపోయిన ప్రజలు శక్తివంతమైన నాయకత్వం కావాలని మోడీని గెలిపించారు. 2014లో భారత ప్రజలకు తమ స్వార్థంకంటే దేశం బాగుపడాలనే దృష్టి ఉంది. ప్రజలకు పెద్ద స్వార్థమేమీలేదు. ఉండే అవకాశం లేదు. తాము భయంకర చీకట్లో ఉన్నాం. కొంత వెలుగయితే చాలు అనుకున్నారు. విదేశాలతో మూలుగుతున్న 75 లక్షల కోట్ల నల్లధనాన్ని తెచ్చి ఇంటింటికీ 15 లక్షలు పంపుతాననీ మోడీ మాటలు నమ్మి ప్రజలు ఓట్లు వేయలేదు. భారత ప్రజలు శ్రమ జీవులు. శ్రమ చేయని ఒక్కపైసా అవసరం లేదని చెప్పగలిగిన నిజాయితీపరులు. దేశం పట్ల ప్రేమా అభిమానంఉన్న దేశ భక్తులు వాళ్లు. తమ కష్టం మీద ఆధారపడి నిజాయితీగా ఉంటూనే.. తమ బతుకులకంటే ముఖ్యం దేశం బాగుపడాలని కోరుకున్నారు. 70ఏండ్ల స్వాతంత్ర్యంలో దేశం ఏమయ్యిందో వారికి తెలుసు. కొంతమంది రాజకీయ నాయకులకు ఉద్యోగులకు మించిన దేశభక్తి ప్రజలలో ఉంది. అది ఒకశాతం కాదు. వందశాతం దేశభక్తి గలవారు. తమ దేశం పూర్తిగా చెడిపోయిందని కొందరు నాయకులు దేశాన్ని భ్రష్టు పట్టించారని, దేశ వనరులను, సంపదను కల్సి పంచుకున్నారని వారికి తెలుసు. రాజకీయ వ్యవస్థ మీదే వారికి విశ్వాసం పోయింది. దేశ సంపద తమ శ్రమ ఏమైతుందో, ఎటు పోతుందో వారికి తెలియదు. కొందరు.. వేళ్ల మీద లెక్కించదగినవారు మేడలు మీద మేడలు కడుతూ ఆస్తులపై ఆస్తులు సంపాదించుకుంటూ ఉంటే, తమ బతుకులు అప్పులపాలు ఎందుకు అవుతున్నాయో ప్రజలకు తెలియదు. 2014కు ముందు ఈ దుర్భర పరిస్థితులకు, 90శాతం ప్రజల దారిద్ర్యానికి, కొందరు సంపన్నులు, మరీ సంపన్నులు కావటానికి, రైతుల ఆత్మహత్యలను కోట్లాది నిరుద్యోగానికి, అగ్రకులాల దోపిడీకి, వివక్షకు, వంచనకు గురికావటానికి వారికి తెలిసిన కారణం ఒక్కటే... కాంగ్రెస్, సంకీర్ణ ప్రభుత్వాలు, కమ్యూనిస్టు తప్ప మిగతా రాజకీయ పక్షాలు! వీరంతా కలసి చిందర వందర చేసిన దేశాన్ని అమావాస్య చీకటి చేసిన దేశాన్ని బాగుచేయటం సాధ్యం కాదని వారు నిరాశతో ఉన్న పరిస్థితులలో మోడీ "నేనున్నానంటూ వచ్చారు. అప్పటికే ప్రజలు విగిపోయి ఉన్నారు. నిరాశతో ఉన్నారు. ఆగ్రహంతో ఉన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం పోగొట్టుకున్నారు. ఎటు చూచినా అవినీతి.. దాచుకుంటున్న నల్లధనం, దళారీ వ్యవస్థ, పెట్టుబడుల రాజ్యం కార్పొరేట్ సామ్రాజ్యం.



దోచుకుంటున్న విద్య వైద్య వ్యాపారం. నశించిన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు, రాజ్యాంగానికి విలువలేని పరిస్థితి. 2014కు ముందు ప్రజలు చికాకుగా ఉన్నారు. భయంకర చీకట్లో ఉన్నారు. అటువంటి చీకట్లో.. నేను దీపం పెడుతానని మోడీ రావటం... అప్పటికే చీకట్లో ఉన్న గుజరాత్‌లో వెలుగులు చిమ్ముతున్నాయని భ్రమనికత ఊహలలోకి ప్రజలను మళ్లించటం ప్రజలు మోడీకి పట్టాభిషేకం చేసారు. వాళ్లు బీజేపీకి పట్టాభిషేకం చేయలేదు. నిజానికి బీజేపీ హిందూత్వ.. భారత లౌకికత్వానికి సరిపోదు. లౌకికదేశమైన భారత్‌లో బీజేపీ అధికారంలోకి రావటం కల్ల... అని ప్రపంచం, మేధావులు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్న రోజులు. భారతదేశ సామాజిక స్వరూపానికి బీజేపీకి కుదిరే విషయం కాదు. 2014లో ఎలా వచ్చింది బీజేపీ? ప్రజలు బీజేపీని చూసి ఓట్లు వేయలేదు. మోడీని చూసి ఓట్లు వేసారు. చీకటి నిండిన తమ బతుకులలో నరేంద్రమోడీ వెలుగు నింపుతారని భావించారు. దేశంలోని అవినీతిని నిర్మూలిస్తారని, దళారీ వ్యవస్థను తెగ నరుకుతారని, 75 లక్షల కోట్ల నల్లధనాన్ని తెస్తారని, సాహసమైననాయకుడని ఓట్లు వేసి గెలిపించారు. ఏం జరిగింది? మోడీ ప్రధాని అయిన తర్వాత దేశం మరీ చీకటయింది. బీదలు మరీ బీదలయ్యారు. సంపన్నులు.. అంబానీ, ఆదానీ లాంటి సంపన్నులు తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకున్నారు. నిరుద్యోగులు పెరిగారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. అన్నిటికంటే హిందూ ఉగ్రవాదం పెరిగింది. అణగారిన వర్గాలపై దళితులపై మైనారిటీలపై దాడులు పెరిగాయి. గౌరీలంకేశ్, కల్బుర్గీ, దబోల్కర్ లాంటి రచయితలు హత్యకు గురి అయ్యారు. నరేంద్రమోడీ కాలంలో అభివృద్ధి ఏమిటో కానీ.. అశాంతీ ఆందోళనా పెరిగాయి.

మోడీ తెచ్చిన సంస్కరణలు పనికిరాని సంస్కరణలుగా ప్రజలు భావిస్తున్నారు. స్వచ్ఛ భారత్ డిజిటల్ ఇండియా, బుల్లెట్ ట్రయిన్, 24 లక్షల కోట్ల బడ్జెట్ తమ కోసం కాదని, 90శాతం ప్రజలు భావిస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ ప్రజల జీవితాలను పూర్తిగా దెబ్బతీసాయి. నరేంద్రమోడీ తమ ప్రధాని కాదు సంపన్నుల ప్రధానిగా ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయం ప్రధాని మోడీకి అర్థమైంది. అందుకే ఆయనలో ఉలికిపాటు.

నరేంద్రమోడీ అపారమైన తెలివితేటలు కలిగిన రాజకీయ చతురుడు. ప్రజలలో తన గ్లామర్ తగ్గితే.. ఆర్ఎస్ఎస్‌లో విలువ తగ్గుతుంది. బీజేపీ అసంతృప్తిపరులు తలెత్తుతారు. ఎన్‌డీఏ పార్టీలు దూరమవుతాయి. ముఖ్యమంత్రులు ఎదురు తిరుగుతారు. చుట్టుప్రక్కల దేశాలు చులకనగా చూస్తాయి. ట్రంప్ ఆదేశాలిచ్చే స్థితికి వస్తాడు.. అవి అన్నీ ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యాలు.. మనకే కాదు ప్రధాని మోడీకి కూడా కనిపిస్తున్నాయి.

ఒకసారి అసంతృప్తి, అవిశ్వాసం ప్రజల గుండెల్లో వస్తే దాన్ని మార్చటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదని మోడీకి తెలుసు. మోడీయుగం ఇంత తొందరగా పడమట దిక్కు జారుకుంటుందని అప్పుడు అంచనా లేదు. యిప్పుడు జరుగుతున్నదదే!

సెల్: 9949486122



ఒక చిత్రం... చూడగానే ముఖాన నవ్వు విరబూయాలి. కంట తడి అయినా పెట్టించాలి. జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లాలి. ఏదో ఒకటి చూసినవాళ్లు దానితో మమేకమైపోవాలి. తమను తాము మైమరచిపోవాలి. పోర్ట్రెయిట్ అయినా... సీనరీ అయినా కళాకారుల అంతరంగం... వీక్షకుల మనసులను తాకాలి. అలా మనసులను కదిలింపజేసే చిత్రకారిణి **ఉషా పాటిబండ్ల.** ఆమె పోర్ట్రెయిట్స్ పలికించే హావభావాలు చూస్తే... ఎంతటివారైనా ఫిదా అయిపోవాల్సిందే. ఆయిల్, ఆక్రిలిక్, పోర్స్‌లేన్, పేస్టల్స్, అబ్‌స్ట్రాక్ట్, మిక్స్‌డ్ మీడియా... ఆమె వర్క్ చేయని మీడియం అంటూ లేదు. అంతర్జాతీయ ఖ్యాతిపొందిన రెజిన్ వర్క్‌లోనూ తనైదన ఇమేజ్‌ను సృష్టించుకున్న ఆర్టిస్టు ఉష అంతరంగం... ఈ శుభోదయాన మీకోసం!



తెలంగాణ మహిళలతో...

రెంబ్రాంట్ పెయింటింగ్స్ ఇష్టం. ఫ్రెంచ్ ఆర్టిస్టు విలియం అడాల్ఫ్ బగరూ చిత్రాలను ప్రేమిస్తాను. రవివర్మ పెయింటింగ్స్ అంటే చాలా ఇష్టం. ఆయన పెయింటింగ్స్‌తో ఒక కలెక్షన్ చేయాలనుకుంటున్నా. ప్రతిదాంట్లో అందాన్ని చూస్తాను. అందం అంటే బయటికి కనిపించేదే కాదు... అందుకే అంతఃసౌందర్యాన్ని చిత్రంలో ప్రతిబింబింపజేసేందుకు ప్రయత్నిస్తుంటా. తెలంగాణ మహిళల పోర్ట్రెయిట్స్‌ను సిరీస్ చేయాలనే ఆలోచన చేస్తున్నా.

అంతఃసౌందర్యాన్ని ప్రతిబింబిస్తూ...

బాల్యంనుంచే...

బాల్యంలో అందరూ బొమ్మలతో ఆడుకుంటారు. కానీ ఆమె రంగులతో ఆడుకున్నారు. ఏ చిన్నపాటి బొమ్మ కనిపించినా దాని అవుట్‌లైన్స్ గీస్తుండేవారు. పెన్సిల్స్ స్కెచ్చెస్ ఎక్కువగా వేస్తుండే ఆర్టిస్టు సంజయ్‌దేవ్‌ని చూసి ఆమె పెన్సిల్ స్కెచెస్‌పై ఆసక్తి చూపిస్తారు. మొదట ఆయన గీసిన బొమ్మలే కొన్ని ప్రయత్నించారు. తరువాత తనకేం కావాలో తెలుసుకున్నారు. అయితే పిల్లలు ఏం కావాలన్నది తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. ఆ నిర్ణయాధికారాన్ని పిల్లలకు ఇచ్చే తల్లిదండ్రులు చాలా కొద్దిమందే ఉంటారు. అలాంటి తండ్రి ప్రొఫెసర్ కె.కోటేశ్వరరావు. ఇంజనీరింగ్ ప్రొఫెసర్ అయినా.. ఆయనకు కళలు, సంస్కృతి అంటే చాలా ఇష్టం. అందుకే కూతురు ఉషకు తనకిష్టమైంది ఎంచుకునే స్వేచ్ఛనిచ్చారు. ఆమె ఇంటర్ చేస్తున్నప్పుడే డిప్లొమా కట్టించారు. అలా రెగ్యులర్ చదువుతోపాటు, కళనూ అవపోసన పట్టారు.

తెగని బంధం...

అప్పటికే ఆర్ట్ వర్క్ చేస్తున్నా... ఇంకా ఏదో చేయాలి, నేర్చుకోవాలన్న తపన ఉండేది. అందుకే పెండ్లయిన తరువాత బీఎఫ్ఏలో చేరారామె. కోర్సు పూర్తిగా కంప్లీట్ చేయలేకపోయినా.. పెయింటింగ్‌లో లోతైన అవగాహన మాత్రం వచ్చింది. అదే సమయంలో పీహెచ్‌డీ కోసం ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. అయినా కళతో అనుబంధం తెగిపోలేదు. అక్కడ బాతిక్ పెయింటింగ్, హ్యాండ్‌వర్క్, మిషన్ ఎంబ్రాయిడరీ నేర్చుకున్నారు.

రెజిన్ వర్క్ అంటే...

రెజిన్ జిగురులా ఉంటుంది. దాంతో చిత్రాలు వేయడానికి మంటతో పని చేయాల్సి ఉంటుంది. రెజిన్‌కు హార్డ్‌నర్ మిక్స్ చేసి దానికి రంగులను కలుపుకోవాలి. దాన్ని మనకు కావాల్సిన డిజైన్‌లోకి తీసుకురావాలి. నిజానికి అది తొందరగా గట్టిపడిపోతుంది. అరగంటలోపే వర్క్ చేయాలి. గట్టిపడకుండా ఉండటం కోసం మంటతో వేడి చేస్తూ పనిచేయాల్సి ఉంటుంది. అలాగని ఎక్కువ వేడి చేస్తే వేరే టెక్చర్ మారిపోతుంది. పర్ఫెక్ట్ టెక్చర్, గ్లాసీలుక్ కోసం ఆ టైమింగ్‌లోనే చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా ఎంతో క్రేజ్ ఉన్న రెజిన్ పెయింటింగ్స్... గోడలపై అలంకరణ వస్తువులుగానే కాదు... టేబుల్స్‌గానూ, టీపాయ్‌లుగా కూడా తయారు చేసుకోవచ్చు. మౌల్డ్స్ ఉంటే చాలు... వాటితో ఉంగరాలు, గాజులు కూడా తయారు చేస్తున్నారు. బహుళ ప్రయోజనాలున్న ఈ రెజిన్ వర్క్‌కు హైదరాబాద్‌లో ప్రాచుర్యం తేవాలని, నలుగురికి ఉపయోగపడేలా చేయాలని చూస్తున్నాను.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లోనూ...

తిరిగి వైజాగ్ వచ్చాక... కొన్నాళ్లు ఫ్యాబ్రిక్, కొన్నాళ్లు తంజావూరు పెయింటింగ్స్ కూడా నేర్పించారు. కొంతకాలం పాటు మొదట్లో ఫెవిక్రిల్ ఆర్ట్ టీచర్‌గా పని చేశారు. తోటి ఆర్టిస్టులతో కలిసి ఫ్యాబ్రిక్ పెయింటింగ్ షోస్ ఎన్నో పెట్టారు. ఆర్ట్ టీచర్స్ ట్రైనింగ్ కూడా ఇచ్చేవారు. ఇప్పుడామె శిష్యులు ఎంతోమంది ఆర్ట్ టీచర్స్‌గా కొనసాగుతున్నారు. కాన్వాస్‌మీద వర్క్ లోతైన అధ్యయనం మొదలయ్యాక... వాటిని తగ్గించేశారు.

సమయమంతా చిత్రాలకే...

పిల్లలు మహిళల జీవితాల్లో చాలా మార్పులు తీసుకొస్తారు. ఆ మార్పులను సైతం తనకు అనుకూలంగా మలుచుకున్నారామె. పాప, బాబుకు ఏడెనిమిదేండ్లు వచ్చేదాక కొంచెం ఇబ్బంది పడ్డా... తరువాత వాళ్లు స్కూల్ వెళ్లిపోయి తిరిగి వచ్చేదాక... తన సమయాన్నంతా పెయింటింగ్‌కే కేటాయించారు. ఇక చిత్రకళ చాలా ఖరీదైనది. కాన్వాస్‌నుంచి రంగుల వరకు అన్నీ కొనడం కష్టమే. అయితే దానినుంచి ఆదాయం కొంచెం ఉన్నా... ఇంకా ఎక్కువ వర్క్ చేయాలనిపిస్తుంది. రెండు ఎవరైనా ఖరీదు చేసినా... ఇంకో నాలుగు గీయాలనిపిస్తుంది. ఆమె విషయంలో ఎప్పుడూ ఇబ్బంది కాలేదు. ఆమె గీసిన ప్రతి పెయింటింగ్ బంధువులో, తెలిసినవాళ్లో ఎంతోకొంత చెల్లించి తీసుకెళ్లారు.

రెజిన్ వర్క్‌పై ఆసక్తితో...

పోర్స్‌లేన్, ఆయిల్.. అన్నీ అందరికీ తెలిసిన మాధ్యమాలే. కాలిఫోర్నియాలో ఉన్న కూతురి దగ్గరకు వెళ్లినప్పుడు అక్కడ రెజిన్ వర్క్‌కు ఉన్న క్రేజ్ ఆమెలో ఆసక్తి పెంచింది. వెంటనే అధ్యయనం మొదలుపెట్టారు. ఎందుకంటే ఆ మీడియంలో వచ్చే డిజైన్స్ చేతితో వేయలేం. దేవుడి బొమ్మలో, క్యాలెండర్ బొమ్మలో, సీనరీసో ఎవరైనా వేయొచ్చు. కానీ తాను కొంత భిన్నంగా ఉండాలనుకున్నారు. అక్కడే నేర్చుకుని రెజిన్ పెయింటింగ్స్ వేశారు. ఆ మీడియమ్‌కు ఇండియాలో ప్రాచుర్యం తక్కువ. మెటీరియల్ దొరకడం కూడా కష్టమైంది. పరిశోధించి, ప్రయత్నించి మెటీరియల్ పట్టుకున్నారు. దానిమీద వర్క్ చేసి.. గత ఏడాది నవంబర్‌లోనే హైదరాబాద్‌లో ప్రదర్శన పెట్టారు. చూసినవాళ్లుచాలా బాగున్నాయని మెచ్చుకున్నారు. ఇది ప్రింటా, మార్బులా అని ఆశ్చర్య పోయారు. కానీ ఎక్కువ మందిని రీచ్ అవ్వలేకపోయింది. అందుకే కాకినాడలో ఉన్న మరో రెజిన్ ఆర్టిస్టుతో కలిసి షో చేసే ప్రయత్నంలో ఉన్నారు.

సంతృప్తి ముఖ్యం...

పోట్రయిట్స్ వేయడంలో ఆమె నిపుణ. ముఖంలో లోతైన భావాలను పలికిస్తారు. ఆమె చిత్రాల్లోని కళ్లు... చూపరులను కనుతిప్పుకోనివ్వవు. ఎన్నో లోతైన భావాలను తెలియజెప్పుతాయి. అందుకే 'మనకు తెలిసిన కళతో కొంతమందిని ఆనందపరుస్తున్నాం అంటే ఇంకేం కావాలి. అన్ని డబ్బుల కోసమే కాదు... సంతృప్తినిచ్చేవి కూడా ఉంటాయి కదా!' అంటారామె.

కట్ట కవిత

















కాస్త సమయం కేటాయిస్తే చాలు!



ఇంట్లో చిన్నారులు ఏలా మాట్లాడుతున్నారు! మౌనంగా ఉంటున్నారా! ఒంటరిగా ఉంటున్నారా! చెప్పిన మాట వినడం లేదా! ఎవరితో కలవలేకపోతున్నారా! ఇవి పైకి చిన్నగా కనిపించినా వారి బాధ వర్ణనాతీతం. ఉదయం ఏడు గంటలకు ఇంట్లో నుంచి స్కూల్‌కు వెళ్తే రాత్రి ఏడు గంటలకు ఇంటికి చేరుకుంటారు. తల్లిదండ్రులతో గడిపే సమయం ఉండదు. ఈ హడావిడి సమయంలో ఆఫీసు పనుల్లో పడి చిన్నారులను నిర్లక్ష్యం చేస్తుంటారు చాలామంది తల్లిదండ్రులు. ఇలా చేయడం వల్ల చిన్నారులు తీవ్ర డిప్రెషన్ గురవుతారు. కొన్నిసార్లు ఒంటరితనం భరించలేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటారు. అలా కాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు కొన్ని సూచనలు పాటిస్తే సరిపోతుంది.

ఏకాగ్రత్తతో వినటం: కొంత మంది తల్లిదండ్రులు పిల్లలు మాట్లాడుతుంటే చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. పిల్లలు ఎంతో ఇష్టంగా మాట్లాడుతుంటే చికాకు పడుతారు. అలా మాట్లాడుతున్నప్పుడు ఏకాగ్రత్తతో వినండి. వారు చెప్పే మాటలు వినకుండా అటుఇటూ చూసుకుంటూ లేదా టీవీ చూసుకుంటూ ఏదైనా పని చేసుకుంటూ ఉంటే పిల్లల మనసు తొందరగా నొచ్చుకుంటుంది. వారి మనసులో ఏదో తెలియని బాధ ఆవరిస్తుంది. వారి తపనను అర్థం చేసుకునే వారు లేరని ఒంటరిగా ఫీలవుతారు.

భావాలకు స్పందించండి: పిల్లల ప్రవర్తనలోనే వారిలో ఉన్న భావలు అర్థం అవుతుంటాయి తల్లిదండ్రులకు. పిల్లలు చెప్పే కథలకు, మాటలకు తొందరగా స్పందించండి. "అవునా... వావ్... అంటూ ఆశ్చర్యంతో వారిని పొగడండి. ఎంతో సంతోషిస్తారు. వారి భావనను అర్థం చేసుకునే వారున్నరని చాలా కంఫర్ట్‌గా ఫీలవుతారు. ఎప్పడు వారి భావాలను, ప్రవర్తనను, మాటలను... అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే సరిపోతుంది. ఉదాహరణకు పిల్లలకు సూచనలు ఇచ్చే ముందు "పిల్లలు స్కూల్లో స్నేహితులతో పెన్సిల్ లాక్కోవటం, పెన్ను తీసుకోవటం వంటివి చేస్తే...వెంటనే మీరు చెప్పాల్సింది. గట్టిగా ఆరవకుండా నెమ్మదిగా "అది నీది కాదు నాన్న" అని చెప్పాలి. అప్పడే పిల్లలు తొందరగా అర్థం చేసుకుంటారు.

ఎక్కువగా ప్రశ్నించకండి: పిల్లలు మాట్లాడుతుంటే... నటించుకుంటూ మాట్లాడితే ఎక్కువగా ప్రశ్నించకండి. టీవీలో వచ్చే ప్రోగామ్స్‌ను బట్టి కొంత మంది పిల్లలు అలానే ప్రవర్తిస్తుంటారు. అలాంటి సమయంలో టీవీ చానెల్ మార్చటం లేదా బయటకెళ్ళి స్నేహితులతో ఆడుకోవటం లేదా వారికి చిన్న చిన్న పనులు నేర్పిచటం వంటివి చేయండి. అలానీ బయటకెళ్ళి ఏ ఆటలు ఆడుకున్నావు... స్నేహితులతో ఏం మాట్లాడినావు... టీవీలో ఏం ప్రొగామ్ చూశావు... ఇవ్వాళ ఏం నేర్చుకున్నావు అంటూ.... పిల్లలపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంటారు కొంత మంది తల్లిదండ్రులు. ఇలా చేయటం వల్ల పిల్లలకు ఏం చేయాలో తోచదు.. ఇలాంటి విషయాలే పిల్లలపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. తల్లిదండ్రులుగా వారికి స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత కూడా మీదే అని గుర్తించాలి.

కొన్ని అవకాశాలు ఇవ్వండి: పిల్లలకు వారికిష్టమైన రంగు డ్రెస్‌లను కొనివ్వటం, బొమ్మలను ఇప్పిచటం, వారికిష్టమైన పుస్తకాలు కొనివ్వటం వంటివి చేయండి. ఇలా చేస్తే పిల్లలు ఎంతో ఆనందంగా, ఉల్లాసంగా ఉంటారు. ఇది వారి ఎదుగుదలపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. అలానీ అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వటం చేయటం మంచిది కాదు. ఇలా ఇవ్వటం వల్ల పిల్లలకు చెడు అలవాట్లు అలవడే ప్రమాదం ఉంది. కొన్ని హెచ్చరికలు చేస్తూ ప్రతి విషయంలోని మంచి, చెడు ప్రభావాన్ని వివరిస్తూ చెబితే మంచి ప్రవర్తనతో భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుంది.

అభినందించాలి, శిక్షించాలి: కొన్ని సందర్భాల్లో పిల్లలు తప్ప చేస్తే కచ్చితంగా శిక్షించాలి. లేదంటే వారు అదే పనిగా తప్పులు చేస్తుంటారు. పిల్లలు పెద్దయ్యే క్రమంలో ఇది ఒక అలవాటుగా మారుతుంది. కాబట్టి ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. అలాగే అదే సమయంలో ఏదైన మంచి పని చేస్తే అభినందించాలి. ఒకవేళ అభినందించకపోతే లోపలే కుమిలిపోతారు. లేదా ఎవరికి చెప్పుకోకుండా బాధపడుతారు. ఇలా బాధ పడటం వల్ల పనులు చేయటానికి, చదువు కోవటానికి, కొత్త విషయాలు నేర్చుకోవటానికి పెద్దగా ఆసక్తి చూపించారు. ఇంట్లో చిన్న చిన్న పనులు చేస్తే కచ్చితంగా అభినందించాలి. వారి ప్రవర్తనలో మంచి చెడులను గమనిస్తూ.. వారికి కాస్త సమయం కేటాయిస్తేనే పిల్లలు ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారు.

డబుల్ బెనిఫిట్..!



రోజు మనం తీసుకునే ఆహారంలో పండ్లకు సముచిత స్థానం ఇస్తే ఆరోగ్యంతో పాటు అందం సొంతమవుతుంది. ఆరోగ్యం, అందం డబుల్ బెనిఫిట్ కావాలంటే మాత్రం పండ్లను సి విటమిన్ ఎక్కువగా ఉన్న పండ్లును తినాలి. వీటిలో ముఖ్యమైనది ఆరెంజ్.

ఆరెంజ్ తో చర్మ సౌందర్యం చాలా మెరుగ్గా తయారవుతుంది. చర్మంలోని అధికమైన ఆయిల్ తీసివేసే గుణం ఇందులో ఉంది. చర్మానికే కాకుండా మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. ఎముకల్లో శక్తిని నింపు తుంది. ఇందులోని ఫోలిక్ యాసిడ్, కాల్సియం, విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఆరెంజ్ పండ్లే కాదు తొక్కలు కూడా చర్మసౌందర్యానికి ఎంతో ఉపయోగపడుతాయి. శరీరంలో ఉన్న టాక్సిన్లను తొలగించి.. వృధాప్య ఛాయల్ని అరికడతాయి.

పెరుగుతో..

రెండు స్పూన్ల పెరుగులో ఒక స్పూన్ ఆరెంజ్ తొక్కల పొడి వేసి బాగా కలపాలి. దీన్ని ఫేస్ ప్యాక్ గా వేసుకుని.. ఆరేంత వరకూ రబ్ చేయాలి. ఆ తర్వాత 20 నిముషాల పాటు అలాగే ఉంచి..తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రంగా కడుక్కోవాలి.

ఈ ప్యాక్ ముఖంపై ఏర్పడిన మృత చర్మాన్ని పోగొట్టి.. చర్మాన్ని తాజాగా మార్చుతుంది.

తేనె, నిమ్మరసంతో..

ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ నిమ్మ రసం, ఒక స్పూన్ ఆరెంజ్ తొక్కల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ గా వేసుకోని ఇరవై నిమిషాల తర్వాత గోరు వెచ్చని నీటితో శుభ్రంగా కడగాలి. చర్మం మృదువుగా మారుతుంది.

పసుపుతో..

ఒక టేబుల్ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ తేనె, అరస్పూన్ పసుపు, ఒక స్పూన్ ఆరెంజ్ తొక్కల పొడి తీసుకుని బాగా కలపాలి. ముఖానికి ప్యాక్‌లా వేసుకోని అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి. చర్మానికి మంచి నిగారింపుగా వస్తుంది. ❄

హార్మోన్ల నియంత్రణ..



ఉరుగులపరుగుల బిజీజీవితంలో రోజూ పొద్దున్నే వాకింగ్, జాగింగ్ అంటే చాలా కష్టం అంటారు ఎవరైనా.. కానీ, 30నిమిషాల నడక ద్వారా రోజంతా ఎంత ఉత్సాహంగా ఉంటారో తెలిస్తే మాత్రం కచ్చితంగా నడుస్తారు. సౌత్ కరోలినా యూనివర్సిటీ వారు చేసిన పరిశోధనల ప్రకారం వారానికి 5 రోజులపాటు వాకింగ్ చేస్తే శరీరంలోని హార్మోన్లను నియంత్రించి గర్భస్రావాలను నివారించవచ్చని స్పష్టమైంది. నడక ద్వారా గుండె పోటు వచ్చే ప్రమాదం 40శాతం తగ్గిపోతుంది అని తేలింది.

ఉత్సాహం మాత్రమే కాదు.. సంపూరారోగ్యానికి నడక ఎంతో అవసరం. పొద్దున్నే అరగంట నడవడం వల్ల ఆసుపత్రుల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది. ఈ 30 నిమిషాల నడక మీ జీవన గతినే మార్చేస్తుంది. డయాబెటిస్, ఒబేసిటీ, గుండె జబ్బులు ఉన్నవారికి తప్పనిసరి. నడకతో ఈ జబ్బుల తీవ్రత తగ్గించడంతో పాటు కండరాలకు, గుండెకు చాలా మంచిది. పొద్దున్నే వీచే చలిగాలి శరీరానికి తాకడంతో నరాలు ఉత్తేజితమవుతాయి. రోజంతా ఉత్సాహంగా, పాజిటివ్ థింకింగ్‌తో ఉండేందుకు నడక ఉపయోగపడుతుంది. పొద్దున్నే 30 నిమిషాల నడిస్తే.. రెండు గంటల పాటు జిమ్‌తో సమానమని ఆరోగ్యనిపుణులు సూచిస్తున్నారు. ఇందుకు కారణం.. తాజా గాలిలో ఆక్సిజన్ శాతం ఎక్కువ ఉండటమే అని వివరిస్తున్నారు.

- జీవనశైలి రుగ్మతల్లో ఒకటిగా మారిన డయాబెటిస్ రోజూ వాకింగ్ చేసేవారిలో వచ్చే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. డయాబెటిస్ వచ్చిన వారిలో పొద్దున్నే నడకతో చాలావరకు కంట్రోల్ అవుతుంది.
- అరగంట వాకింగ్‌తో రక్తపోటు తగ్గుతుంది. రక్తప్రసరణలో అడ్డంకులు రావు. గుండెజబ్బులు దరిచేరవు.
- అధికబరువు సమస్యను ఎదుర్కొంటున్న వారు చేయాల్సిన అతి ముఖ్యమైన వ్యాయామం నడక. పైసా ఖర్చులేని వాకింగ్ ద్వారా త్వరగా బరువు తగ్గుతారు. 30 నుంచి 40 నిమిషాల పాటు బ్రిస్క్ వాక్ చేస్తే గుండె కొట్టుకునే వేగాన్ని పెంచి క్యాలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. ఎలాంటి డైట్ నియమాలు పాటించకుండానే నడకతో బరువు తగ్గవచ్చు అన్నది నిపుణుల సూచన. రక్తంలో కొలెస్ట్రాల్ నిల్వాలు తగ్గితే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. ❄

మాటల్లోనే వ్యవ'సాయం'



- రైతన్నకు భరోసానివ్వని కేంద్ర బడ్జెట్
- పలు పథకాలకు భారీగా తగ్గిన నిధులు
- 15 విభాగాలకు కేటాయింపుల్లో కోత
- పరిశోధనలపై మోడీ సర్కారు చిన్నచూపు

నవతెలంగాణ-జనరల్ డెస్క్

కర్షకుల సంక్షేమాన్ని కాంక్షించేలా 2018-19 కేంద్ర బడ్జెట్ ఉందంటూ బీజేపీ నేతలు గొప్పలు చెప్పు కుంటున్నారు. ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ సైతం ఆహా..ఓహో అంటూ ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని ఆకాశానికెత్తారు. కానీ, పార్లమెంటులో విత్త మంత్రి చెప్పిన మాటలకు, వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులకు ఎక్కడా పొంతన లేకపోవడం గమనార్హం. రైతులకు రూ.11లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్న జైట్లీ.. రుణమాఫీ ఊసే ఎత్తలేదు. ఈ 11 లక్షల కోట్లు బడ్జెట్ పరిధిలోకి రాదన్నది జనానికి తెలియని విషయమేం కాదు. పైగా అన్నదాతల ఆదా యాన్ని రెట్టింపు చేస్తామంటూ మాటలతో మభ్యపెడుతున్నారు. వ్యవసాయ రంగంలోని కీలక విభాగాలకు నిధుల్లో కోత పెట్టారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయింపుల్లో(రూ.55 వేల కోట్లు) గతేడాదితో పోలిస్తే ఎలాంటి మార్పూ లేదు. వ్యవసాయ పరిశోధనలపై మోడీ సర్కారు ఎనలేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఈ విభాగానికి గత బడ్జెట్‌లో రూ.6,111 కోట్లు కేటాయించగా.. ఈసారి 2,914.77 కోట్లతోనే సరిపెట్టింది. పరిశోధనల విభాగంలో తొమ్మిది శాఖలుండగా.. ఏడింటికి నిధుల్లో కోత పడింది. మొత్తంగా బడ్జెట్ కేటాయింపులు చూస్తే రైతుల ఆదాయం రెట్టింపు సాధ్యమయ్యేనా? అన్న అనుమానం కలగక మానదు.

తగ్గిన కేటాయింపులు

రంగం/విభాగం	గత బడ్జెట్‌లో(రూ.కోట్లలో)	ఈసారి(రూ.కోట్లలో)
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై)	4,500	3,600
వ్యవసాయ మార్కెట్-మౌలిక సదుపాయాల కల్పన	1,190	1,104.5
జాతీయ ఆహార భద్రతా మిషన్	1,600	1,500
నేషనల్ మిషన్ ఆన్ ఆయిల్‌సీడ్స్, ఆయిల్‌పామ్	403	402
నేషనల్ ప్రాజెక్ట్ ఆన్ అగ్రో ఫారెస్ట్రీ	100	75
నేషనల్ ప్రాజెక్టు ఆన్ సాయిల్ హెల్త్ ఫెర్టిలిటీ	452	407.84
వ్యవసాయ సమాచార వ్యవస్థ విస్తరణ	65	17
సహజ వనరుల నిర్వహణ	732.17	264.24
క్రాప్ సైన్స్	1,486.59	676.86
హార్టీకల్చర్	602.66	185.00
అనిమల్ సైన్స్	885.77	319.37
ఫిషరీ సైన్స్	446.69	140.17
అగ్రికల్చర్ ఇంజనీరింగ్	213.54	56.17
అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్(కేవీకే)	287.73	274.07
స్వయం ఉపాధి డెయిరీ యూనిట్ల ఏర్పాటు	258.65	200

జయ్‌షాపై వార్తలు రాయకుండా ది వైర్‌పై ఆంక్షలు

అహ్మదాబాద్: బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జయ్‌షా వ్యాపార కార్యకలాపాలపై ది వైర్ న్యూస్ పోర్టల్ ఎలాంటి వార్తలు ప్రచురించకుండా గతంలో కింది కోర్టు విధించిన ఆంక్షలను గుజరాత్ హైకోర్టు పునరుద్ధరించింది. ది గోల్డెన్ టచ్ ఆఫ్ జయ్ అమిత్‌షా పేరు తో ది వైర్ వెబ్‌సైట్ ప్రచురించిన వార్తపై గతేడాది నవంబర్ 28న అహ్మదాబాద్‌లోని సివిల్ కోర్టు ఆంక్షలు విధించింది. వెబ్‌సైట్ యాజమాన్యంతోపాటు కథనం రాసిన జర్నలిస్ట్‌పై జయ్‌షా పరువు నష్టం దావా వేయడంతో కోర్టు ఆంక్షలు విధించింది. అయితే, వెబ్‌సైట్ యాజమాన్యం ఆంక్షల తొలగింపును కోరుతూ మరోసారి కోర్టును ఆశ్రయించగా గతేడాది డిసెంబర్ 23న అందుకు అంగీకరించింది. కానీ, జయ్‌షా అనూహ్య సంపదతో ప్రధాని మోడీకి లింక్ చేయడాన్ని కోర్టు తప్పు పట్టింది.


2022 నాటికి రైతు ఆదాయం రెండింతలు



న్యూఢిల్లీ : 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని మోడీ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ఓ సమ్మేళనంలో మోడీ మాట్లాడుతూ..రైతుల ఆదాయాన్ని పెంచాలంటే కొన్ని చర్యలు అవసరమని,ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యంగా పెట్టుబడి ఖర్చు తగ్గించటం,ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచటం,చేతికొచ్చిన పంట నష్టాల బారిన పడకుండా కాపాడటం వ్యవసాయరంగంలో కీలకమైనవని చెప్పారు. 25 ఏండ్లుగా సేద్యరంగానికి ఒక దశ,దిశలేకుండా పోయిందని, అందువల్లే తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలిపారు. సించాయ్ యోజన కింద 99 ప్రాజెక్టులు చేపట్టామని,దీనికోసం కేంద్రం 80 వేలకోట్లు ఖర్చు చేస్తున్నదని వివరించారు. రైతు దేశానికి అన్నదాత అని, ఇప్పుడిప్పుడే సేద్యం తీరు మారుతున్నదని చెప్పారు. అయితే, రైతుస్థితి మాత్రం మారలేదన్నారు. వ్యవసాయ రంగం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాని వివరించారు.

రైతుల ఆత్మహత్యలు.. వాళ్లు విదేశాలకా..!

- అన్నదాతల రుణాలపై ఒత్తిళ్ల.. మాల్యా,నీరవ్‌లకు పరారయ్యేలా తోడ్పాటు
- రిజర్వ్‌బ్యాంకు నిర్లక్ష్యంపై పిటిషనర్ ప్రస్తావన
- పీఎన్‌బీ స్కాంపై విచారణకు సుప్రీం అంగీకారం



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు భారీ కుంభకోణంలో నిందితుడైన నీరవ్ మోడీని భారత్ రప్పించేందుకు కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. నీరవ్‌ను రెండు నెలల్లోగా భారత్ రప్పించే విధంగా చర్యలు చేపట్టాలని పిటిషనర్ వినీత్ దండా కోరారు. దీనిపై తక్షణ విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. 23న విచారణ జరపనున్నట్టు ప్రకటించింది.కాగా ..పేద రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మాల్యా, నీరవ్ లాంటి వాళ్లు వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు చెక్కేస్తున్నారని పిటిషనర్ ప్రస్తావించారు. సామాన్య ప్రజల హక్కులను కాపాడేందుకు సుప్రీంకోర్టు దీనిపై జోక్యం చేసుకోవాలని కోరారు. రుణాలు చెల్లించకపోవడంపై బ్యాంకు అధికారులు పేద రైతులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలు, రైతులు డబ్బు కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న పలు ఘటనలను పిటిషన్‌లో వివరించారు. నీరవ్ మోడీ, ఆయన మామ ఛోక్సీలు భారీ మోసాలకు పాల్పడి ఎంచక్కా కుటుంబంతో సహా సులువుగా విదేశాలకు పారిపోగలి గారని పేర్కొన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు భారీ కుంభకోణంలో రిజర్వు బ్యాంకు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిం చారు. ఇలాంటి భారీ కుంభకోణాల ప్రభావం తిరిగి ప్రజలపైనే పడుతుందని.. వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అధిక పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు.దీంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులను ఈ కేసులో ప్రతివాదులుగా పేర్కొంది. నీరవ్ మోడీని వీలైనంత త్వరగా భారత్ రప్పించడానికి గల అన్ని చర్యలను తీసుకోవడంపై కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని, డబ్బు రికవర్ చేయడానికి చర్యలు వేగవంతం చేయాలని పిటిషన్‌లో కోరారు. అలాగే అవినీతికి పాల్పడిన పీఎన్‌బీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, రుణాల మంజూరుకు కొత్త మార్గదర్శకాలు నిర్దేశించాలని, నిబంధనలు బాగా కఠినతరం చేయాలని కోరారు. రూ.500కోట్లు, అంతకు పైగా రుణం తీసుకునే వారి వివరాలను, రుణాలు చెల్లించని వారి జాబితాను కేంద్రం అందజేయాలని అభ్యర్థించారు.దీంతో సుప్రీం కోర్టు పై విధంగా స్పందించింది.

రాబందులు కనుమరుగు..

- 26 ఏండ్ల క్రితం 4 కోట్లు
- 20 వేలకు పడిపోయిన సంఖ్య
- మనుషులకు ఎంతో మేలు చేసే దేగలు..!
- సహజ పారిశుధ్య కార్మికులు..!!

ఒకప్పుడు ఆకాశంలో వందల మీటర్ల ఎత్తున ఎగురుతూ పక్షి విమానాల్లా గుంపులుగా తిరిగే గద్దలు..ఇప్పుడిక కనుమరుగు కానున్నాయా..? పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా చెట్లపైనా, ఇండ్లపైనా, కరెంట్ స్తంభాలపైనా..ఎక్కడంటే అక్కడ కనిపించిన గద్దలదిక గత చరిత్రేనా..? ఓవేళ ఎక్కడైనా కనిపించినా అది ఓ అరుదైన అపురూప దృశ్యంగా మిగిలిపోనున్నదా..? రైతులు, పేదలు తమ ఇండ్లల్లో పెంచుకునే కోడి పిల్లలకు ఇక దేగల భయం లేదని సంతోషించాలా..? లేదంటే కాలధర్మం చెందిన మన ఆత్మబంధువుకు నిర్వహించే పెద్దకర్మ రోజున అన్నం ముట్టేందుకు రాబంధువు రాలేదని బాధ పడాలా..? తమ పొడవాటి ముక్కులతో ఊరి బయటా, రోడ్ల పక్కనా జంతువుల కళేబరాలను తింటూ ప్రకృతి పారిశుధ్య కార్మికులుగా వ్యవహరించిన గద్దల మనుగడ కనుమరుగైన కారణాలేమిటి..? ఆకాశంలో రాబందుల రెక్కల చప్పుడు మళ్లీ మనం వినాలంటే ఏం జరగాలి..?

నవతెలంగాణ జనరల్‌డెస్క్



డేగ,రాబందు, గద్ద..ఇవన్నీ ఒకే పక్షికి మనం పెట్టుకున్న పేర్లు. కానీ, గద్దల్లోనూ వాటి లక్షణాల్లో కొన్ని తేడాలను బట్టి జీవశాస్త్రవేత్తలు వాటిని జాతులుగా వర్గీకరించారు. భారత ఉపఖండంలో 8 జాతుల గద్దలను రాజస్థాన్‌లోని కేవలాదేవ్ నేషనల్ పార్క్ గుర్తించింది. 7 జాతులను రికార్డు చేసింది. పర్వత ప్రాంతాల్లో ఉండే గడ్డపుజాతి గద్దలను(గ్రైపేటస్ బార్బాటస్) రికార్డు చేయలేకపోయింది.

1991-92లో నిర్వహించిన సర్వే ప్రకారం ఇండియాలో 4 కోట్ల గద్దలున్నట్టు అంచనా. అలాంటిది ఓ దశాబ్దం తర్వాత లెక్కేస్తే అవి అంత రించిపోయే దశకు చేరుకున్నట్టు తేలడంతో ప్రకృతి ప్రేమికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 2007లో చేసిన సర్వేలో మూడు జాతుల(జిప్స్ ప్రజాతి) గద్దలు తమ ఉనికిని కోల్పోయే దశకు చేరుకున్నాయి. భారత్‌లోని జిప్స్ ఇండికస్(పెద్ద రెక్కల గద్దలు), జిప్స్ టెన్యూరోస్ట్రిస్(చిన్న రెక్కల గద్దలు) 97 శాతం కనుమరుగయ్యాయి. జిప్స్ బెంగాలెన్సిస్(తెల్ల రెక్క గద్దలు) 99.9శాతం ఉనికిని కోల్పోయాయి. ఇంత వేగంగా ఓ పక్షి జాతి అంతరించడం ప్రపంచంలో ఇప్పటివరకూ జరగలేదని బోంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మాజీ డైరెక్టర్ అసద్ రహ్మానీ తెలిపారు. ఒకప్పుడు ఈ భూమిపై 300కోట్ల సంఖ్యలో ఉన్నట్టు భావిస్తున్న పర్యాటక పావురం కనుమరుగైన దానికన్నా ఇది ఆందోళన కలిగించే అంశమని ఆయన అన్నారు. అమెరికా ఓహివోలోని సిన్సిన్నాటీ జంతుశాలలో 1914, సెప్టెంబర్‌లో చివరి పర్యాటక పావురం మార్తా మృతి చెందిన ఘటనను ఆయన గుర్తు చేశారు.

రాబందులు అంతరించిపోవడాన్ని మొదటిసారిగా గుర్తించిన వ్యక్తి బోంబే నేచురల్ హిస్టరీ సొసైటీకి చెందిన శాస్త్రవేత్త విభూప్రకాశ్.. 1987-88లో రాజస్థాన్ భరత్‌పూర్‌లోని కేవలాదేవ్ నేషనల్ పార్క్‌లో 353 రాబందుల జంటలున్నట్టు ఆయన లెక్కించారు. 1996లో వెళ్లి చూస్తే వాటి సంఖ్య సగానికి తగ్గింది. చెట్లపైనా, గూళ్లలో, పొదల మధ్య చచ్చి పడి ఉన్న రాబందులను చూసి ఆందోళన చెందినట్టు ఆయన తెలిపారు. 2000 సంవత్సరంలో వెళ్లి చూస్తే భరత్‌పూర్‌లోని పార్క్‌లో ఒక్క రాబందు కూడా కనిపించలేదని ఆయన తెలిపారు. ఒకప్పుడు భారత ఉపఖండంలో తెల్లరెక్క గద్దలు పెద్ద సంఖ్యలో కనిపించేవి. ఇప్పుడవి కనిపిస్తే ఓ అరుదైన దృశ్యమే. ఒకప్పుడు లక్షల సంఖ్యలో ఉన్న జిప్స్ ప్రజా తి గద్దలు తాజా అంచనా ప్రకారం 20,000 మాత్రమే మిగిలాయి. వీటి లో 12,000 పెద్ద రెక్క గద్దలు, 6000 తెల్లరెక్క గద్దలు, 1000 చిన్నరెక్క గద్దలు. ఈ మూడురకాల గద్దలు అంతరించిపోయే దశకు చేరుకున్నాయని అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం 2000 సంవత్సరంలోనే హెచ్చ రించింది. తక్షణం వాటి పునరుద్ధరణ కోసంచర్యలు చేపట్టాలని సూచించింది.

కారణాలేమిటి..?

దక్షిణాసియా ప్రాంతంలో డేగలు వేగంగా అంతరించిపోవడానికి స్పష్టమైన కారణాలను చెప్పలేకపోయినప్పటికీ కొన్నింటిని గుర్తించారు. కొందరు వాటిని వేటాడటం, అంటువ్యాధులు, వాటి ఆవాసాలు ధ్వంసం కావడం ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. అయితే,వ్యవసాయ రంగంలో కొన్ని పురుగుల మందులను వాడటం వల్ల కూడా అవి అంతరించాయని జీవ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1960 దశకంలో డీడీటీ వాడకం వల్ల అమెరికాలో గద్దలు పెద్దసంఖ్యలో మరణించిన సంఘటనను వారు గుర్తు చేశారు. పశువుల ఆరోగ్య రక్షణకు డైక్లోఫెనాక్ ఔషధాన్ని వాడటం కూడా ఓ కారణమని పాకిస్తాన్‌లో పరిశోధనలు జరిపిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం తేల్చింది. పశువుల కళేబరాలను తినడం ద్వారా ఆ ఔషధం డేగల శరీరాల్లో చేరి మూత్రపిండాలను దెబ్బతీయడం, కడుపులో పుండ్లు పడటానికి కారణమై అవి మృత్యువాత పడ్డాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ఔషధం తక్కువ ధరకు వస్తుండటంతో పశువుల పెంపకందారులు విరివిగా వినియోగించారని పరిశీలనలో తేలింది. దీంతో, పశువులకు ఈ డ్రగ్ వాడకంపై పాకిస్థాన్‌తోపాటు భారత్, నేపాల్‌లో నిషేధం విధించారు. గ్రామ పొలిమేరల్లో, పట్టణాల పరిసరాల్లో పడవేసే జంతువుల కళేబరాలను తినడం ద్వారా పర్యావరణానికీ, మానవ ఆరోగ్యానికీ రాబందులు ఎంతో మేలు చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. రాబందుల గుంపు కేవలం 20 నిమిషాల్లోనే ఓ భారీ జంతువు కళేబరాన్ని బొక్కలు మినహా ఏమీలేకుండా తినేయగలవని వారు తెలిపారు. రాబందులు తమ శరీరంలో ఉండే అధిక ఉష్ణోగ్రత, జీర్ణక్రియలో ఏర్పడే శక్తివంతమైన రసాయనాల వల్ల జంతువుల మృత శరీరాల్లో వృద్ధి చెందే ఆంత్రాక్స్‌లాంటి ప్రమాదకర బ్యాక్టీరియాను సైతం చంపేసే రోగ నిరోధకత కలిగి ఉంటాయని వారు తెలిపారు. దీంతో, మనుషులకు అంటువ్యాధులు ప్రబలకుండా ప్రకృతిసిద్ధంగా రాబందులు సహాయకారి పాత్ర పోషించాయని వారు విశ్లేషించారు. రాబందులు చేసే పని ఎలుకలు, కుక్కలు కూడా చేస్తాయి. కానీ, రాబందులంత వేగంగా జంతువుల మృత శరీరాలను అవి తినలేవు. అంతేగాక అవి తమ ద్వారా వ్యాధికారక బ్యాక్టీరియాను మనుషులకు వ్యాపింపజేస్తాయి. ప్రమాదకర బ్యాక్టీరియాను అంతమొందించే రోగనిరోధకత ఎలుకలు, కుక్కల్లో తక్కువ. దీంతో, వీటి వల్ల మనుషులకూ ప్రమాదమే. రాబందులు అంతరించే దశకు చేరుకోవడంతో కుక్కల సంఖ్య పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ కాలంలో ఓ అంచనా ప్రకారం కుక్కల సంఖ్య 55 లక్షలమేర పెరిగింది. రాజస్థాన్‌లోని బికనేర్‌లోని జోర్‌బీర్ అనే చోట రాబందులు అంతరించకముందు 100 కుక్కలుండగా ఇప్పుడక్కడ వాటి సంఖ్య 1200కు పెరిగినట్టు ప్రకాశ్ తెలిపారు. అయితే, కుక్కల సంఖ్య అధికమవడం వల్ల వాటి కాటుకు గురై ప్రాణాంతక ర్యాబిస్ వ్యాధి బారిన పడే బాధితుల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. 1992 నుంచి 2006 వరకు భారత్‌లో కుక్క కాటుకు గురైన 3 కోట్ల 85 లక్షలమందిలో 47,300మంది ర్యాబిస్‌తో చనిపోయారు. అంటే..డేగలు అంతరించడం వల్ల మనుషుల ప్రాణాలకూ ముప్పేనన్నది అర్థమవుతోంది.

రాబందుతో ఆత్మ బంధం

మరోవైపు సంప్రదాయికంగానూ రాబందులతో పలు మతాల వారికి ఆత్మీయ బంధం ఉన్నది. హిందువుల్లో ఎవరైనా చనిపోయినపుడు నిర్వహించే పెద్దకర్మ రోజున గద్దలకు ఆహారం పెట్టడం ఆనవాయితీ. పక్షి ముడితేనే చనిపోయినవారికి ఆత్మశాంతి కలుగుతుందన్నది వారి నమ్మకం. పార్శీ మతస్థుల్లోనూ ఓ సంప్రదాయం ఉన్నది. తమ మతంలో ఎవరైనా చనిపోయినపుడు వారి మృత శరీరాన్ని గద్దలకు ఆహారంగా ఇవ్వడం వారి సంప్రదాయం. ఇతర పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించడం వల్ల ప్రకృతి అపవిత్రమవుతుందన్నది వారి నమ్మకం. ప్రస్తుతం గద్దల అంతరింపు ఏడాదికి 43.9శాతం చొప్పున జరుగుతున్నట్టు అంచనా. ఇప్పుడు గట్టిగా పూనుకున్నా వాటి పునరుత్పత్తిని పెంచడం అంత తేలికైందేమీ కాదు. ఎందుకంటే రాబందుల్లో పునరుత్పత్తి రేట్ సహజంగానే తక్కువ. ఓ పునరుత్పత్తి కాలానికి ఒక గుడ్డు మాత్రమే ఓ రాబందు పెడుతుంది. గుడ్డును పొదిగే కాలం 8నెలలు. ఇప్పుడు అందుబా టులో ఉన్న గద్దలను కాపాడుకుంటే ఏడాదికి 5 శాతం చొప్పున వాటిని వృద్ధి చేసే అవకాశముంటుందని జీవ శాస్త్రవేత్తల అంచనా.

ఊరట కలిగించే సర్వే

2017 డిసెంబర్‌లో కేంబ్రిడ్జి జర్నల్‌లో ప్రచురితమైన ఓ సర్వే కాస్త ఊరట కలిగించేలా ఉన్నది. 2006లో భారత్‌లో పశువుల ఔషధం డైక్లోఫెనాక్‌ను నిషేధించిన తర్వాత గద్దల(తెల్ల రెక్కల గద్దలు, ఆల్బీట్ రకం గద్దలు) అంతరింపు బాగా నెమ్మదించినట్టు సర్వే వెల్లడించింది. పాకిస్థాన్, నేపాల్‌లోనూ సత్ఫలితాలు నమో దైనట్టు తెలుస్తోంది. 2004 నుంచి రాబందుల పునరుద్ధరణ కోసం ఈ మూడు దేశాల్లో చేపట్టిన చర్యలు కూడా ఫలితాలనిచ్చినట్టు సర్వే నివేదిక పేర్కొన్నది. హర్యానాలోని పినజోర్‌లో ఉన్న జటాయు పునరుత్పాదక కేంద్రంలాంటివి దేశంలో ఎనిమిదింటిని ఏర్పాటు చేయాలని బోంబే నేచురల్ హిస్టరీ సొసైటీ, హర్యానా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయించాయి. అంతరింపునకు గురైన మూడు జాతులకు చెందిన 162 రాబందుల సంరక్షణకు చర్యలు చేపట్టారు. వీటి పెంపకా నికి ఉపయోగిస్తున్న వన్యమృగ సంరక్షణ కేంద్రాల పరిసర ప్రాంతాల ప్రజల్లోనూ అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎటూ 100 చ.కి.మీ. ప్రాంతాన్ని రాబందుల పెంపకం కోసం సేఫ్‌జోన్లుగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే రాబందులకు ప్రమాదకరంగా భావిస్తున్న డైక్లోఫెనాక్ వాడకం ఘననీయంగా తగ్గినట్టు సర్వే నివేదికలో వెల్లడైంది. నిషేధానికి ముందు పశువుల కళేబరాల్లో ఈ ఔషధం 10 శాతం ఉండగా, 2013లో 2 శాతానికి పడిపోయింది. రాజస్థాన్‌లో మాత్రం ఇంకా 5 శాతం ఉన్నట్టు 2017లో నిర్వహించిన ఔషధ సర్వేలో వెల్లడైంది. అక్కడ మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉన్నది. అస్సాం ఈ డ్రగ్ వాడకాన్ని పూర్తిగా మానేసే దశకు చేరుకున్నది. అయితే, మనుషుల్లో ఈ డ్రగ్ వాడకంపై నిషేధం లేదు. దాంతో,మనుషులకు వాడే ఈ ఔషధాన్ని పశువులకు ఉపయోగించకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు.

రాబందుల వల్ల మనుషులకు ఎన్నో ఉపయోగాలున్నాయని నిపుణులు చెబుతున్నందున వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనా, సమాజంపైనా ఉన్నది. ఆకాశంలో వందల మీటర్ల ఎత్తున ఎగురుతూ నేలపై తనకు కావాల్సిన ఆహారాన్ని గుర్తించగల శక్తి(కంటి చూపు) రాబందులకున్నది. అందుకే దూరదృష్టితో ఆలోచించేవారిని ఉద్దేశిస్తూ డేగ చూపు అంటూ కితాబిస్తాం. మునుపటిలాగే డేగల గుంపుల్ని ఆకాశంలో చూడాలంటే మనమిపుడు అంతే దూర దృష్టితో వ్యవహరించాల్సి ఉన్నది.

బాబు నోట హోదా మాట

- అధిక్రమన హక్కు
- రాష్ట్రానికి ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్
- ప్రజాగ్రహమే కారణమా?

అమరావతి : 'ప్రత్యేకహోదా ప్రతిపత్తిని మిగతా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నప్పుడు మాకు ఎందుకు ఇవ్వరు? వేరే రాష్ట్రాలకు ఇస్తున్నప్పుడు మాకూ అదే పేరుతో ఇవ్వాల్సిందే' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్య ఆ



పార్టీ శ్రేణులతో పాటు, రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. వాస్తవానికి కొద్దిరోజుల కిందటి వరకు చంద్రబాబు దీనికి పూర్తిభిన్నంగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఒక దశలో 'హోదా ఏమన్నా సంజీవనా? అన్ని సమస్యలను అది పరిష్కరిస్తుందా?' అని ఆయన ప్రశ్నించారు. టీడీపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర నాయకులు కూడా అన్ని స్థాయిల్లోనూ ఇదే వాదన వినిపించారు. ఇప్పుడు ఒక్కసారిగా ఆ పార్టీ వైఖరి మారడం ఆసక్తికరంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ప్రత్యేకహోదాకు అనుకూలంగా ప్రజానీకంలో పెద్దఎత్తున వ్యక్తమవుతున్న స్పందనే దీనికి కారణం. ఇటీవల వామపక్షాలు నిర్వహించిన బంద్ పిలుపునకు అనూహ్యమైన స్పందన రావడం, భారీ ఎత్తున విజయవంతం కావడం టీడీపీ నాయకత్వంలో చర్చనీయాంశంగా మారింది. ఇంటిలిజెన్స్‌తో పాటు ఇతర వర్గాల నివేదికలూ ఇదే అంశాన్ని స్పష్టం చేశాయి. ఒకటి,రెండు రోజుల్లో ప్రజా ఆగ్రహం చల్లబడిపోతుందని తొలుత టీడీపీ నాయకులు అంచనా వేసినట్లు తెలిసింది. ఈ కారణంగానే వామపక్షాల బంద్ తరువాత కూడా ముఖ్యమంత్రి, ఇతర టీడీపీ నాయకులు ప్రత్యేక ప్యాకేజికి అనుకూలంగా మాట్లాడుతూ వచ్చారు. 'హోదాకు సమానంగా ప్యాకేజి' అన్న అంశాన్ని ప్రచారంలో పెట్టడానికి ప్రయత్నించారు. అయితే, రోజులు గడుస్తున్నా ప్రజా గ్రహం ఏమాత్రం తగ్గడం లేదని స్పష్టమైంది. హోదా, విభజన హామీల అమలు సాధనే లక్ష్యంగా వివిధ పార్టీలు, సంఘాలు ఇప్పటికే ప్రకటించిన కార్యక్రమాలకు అన్ని జిల్లాలో సానుకూల స్పందన వ్యక్తమవుతోందంటూ నిఘా వర్గాలు తాజాగా నివేదించాయి. మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నుండి ఒత్తిడి వచ్చినట్లు సమాచారం. కొందరు రాష్ట్ర మంత్రులు ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఒకరిద్దరు మంత్రులు బీజేపీతో తెగతెంపులు చేసుకోవడమే మేలన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబునాయుడి స్వరం కూడా మారుతున్నట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం జరిగిన సభలో 'కాంగ్రెస్ మాదిరే బీజేపీ కూడా మోసం చేసింది. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డాం' అని వ్యాఖ్యానించిన ఆయన తాజాగా ప్రత్యేకహోదా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

పవన్‌పై వైసీపీ నేతల ఫైర్

అమరావతి : జనసేన అధినేత పవన్ కళ్యాన్‌పై పలువరు వైసీపీ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగిన రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను చొక్కా పట్టుకుని నిలదీస్తానని చెప్పిన జనసేన పవన్ కళ్యాణ్ ఇప్పుడు నింపాదిగా లెక్కలడుగుతురని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము అన్నింటికీ సిద్ధమే అని జగన్ ప్రకటించిన తరువాత అవిశ్వాసం పెట్టమని పవన్ ఉచిత సలహా ఇస్తున్నాడన్నారు. చంద్ర బాబుకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవ్వగానే పవన్ రంగంలోకి వస్తున్నాడని దీనితో అసలు సమస్య పక్కదారి పడుతోందన్నారు. వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ చిన్న పిల్లాడిలా వ్యవహరిస్తు న్నారని పేర్కొన్నారు. అవిశ్వాసానికి 'మీ పార్టనర్ (టీడీపీ)'ను ఒప్పించమని పవన్‌ను ప్రతిపక్ష నేత జగన్ కోరారని అంతేకానీ ఎక్కడా సవాల్ చేయలేదన్నారు. ముఖ్యమంత్రిపై పోరాడాల్సిన పవన్ ప్రతిపక్షాలను ప్రశ్నించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇప్పటికైనా ఆయన వైఖరిని స్పష్టం చేయాలన్నారు.

టీడీపీలో దళితులపై పెరిగిన నేరాలు : మేరుగు నాగార్జున

టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెరిగాయని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మేరుగు నాగార్జున విమర్శించారు.

ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బ్రేక్!

యూజీసీ నిబంధనల సాకుతో సర్కారు మోకాలడ్డు

- 1061 పోస్టులు నింపే ప్రక్రియ మరింత ఆలస్యం
- 8 నెలలవుతున్నా ముందుకు సాగని వైనం
- పాలక మండళ్లు లేక విశ్వవిద్యాలయాలు నిర్వీర్యం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది. యూజీసీ నిబంధనల సాకుతో రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే ప్రస్తుతం నెట్, సెట్, జేఆర్ఎఫ్, 2011కు ముందు పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన వారు అర్హులు. కానీ యూజీసీ తాజాగా నిబంధనలు మార్పు చేయాలని భావిస్తున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే పీహెచ్‌డీ పట్టా పొందిన వారే అర్హులని నిబంధన విధించింది. దీనిపై ఈనెల 28వ తేదీ వరకు సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తెలపాలని అన్ని విశ్వవిద్యాలయాలకూ యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలను 2020-21 విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి తేవాలని యూజీసీ ప్రకటించింది. రెండేండ్ల తర్వాత అమల్లోకి వచ్చే ఈ నిబంధనను సాకుగా చూపి ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తున్నది. మారిన నిబంధనల ప్రకారం ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని ఉన్నతాధికారులు సమాలోచన చేస్తున్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను కోరినట్టు సమాచారం. దీంతో వర్సిటీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేయాలన్న అభ్యర్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. వర్సిటీ అధ్యాపక పోస్టుల మార్గదర్శకాలు రూపొందిస్తూ తెలంగాణ ప్రభుత్వం గతనెల 19న జీవో నెంబర్ 2 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాలకూ పాలకమండళ్లు లేవు. అడ్‌హక్ పాలకమండళ్లతోనే కాలం వెళ్లదీస్తున్నాయి. పాలక మండళ్లు లేకపోవడమూ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ఆలస్యానికి ఓ కారణంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పాలకమండళ్లను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి.

ఖాళీలతో కుంటుపడుతున్న బోధన

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పాలన గాడి తప్పుతున్నది. ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోతున్నాయి. ఖాళీ పోస్టులతో వర్సిటీల్లో బోధన కుంటుపడుతున్నది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పూర్తిస్థాయిలో లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాణ్యమైన విద్య అందక సతమతమవుతున్నారు. 11 విశ్వవిద్యాలయాల్లో 2017, మే 23న రాష్ట్ర ప్రభుత్వం 1,551 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. తొలివిడతగా 1,061 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని ఆర్భాటంగా వెల్లడించింది. ఎనిమిది నెలలవుతున్నా ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. ఇంకోవైపు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లకే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో ఏ పోస్టుకూ న్యాయం చేయలేక ప్రొఫెసర్లు పనిఒత్తిడితో సతమతమవుతున్నారు.

ఓయూ, కేయూ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లోనూ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓయూలో 1,264 ప్రొఫెసర్ పోస్టులుంటే, 582 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 682 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓయూలో తొలివిడతలో 415 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇలా అన్ని విశ్వవిద్యాలయాలదీ ఇదే పరిస్థితి. ఇంకోవైపు విశ్వవిద్యాలయాల్లో ఖాళీలపైనా ఆర్థిక శాఖ కొర్రీలు వేసినట్టు సమాచారం. సాంక్షన్ పోస్టులు, ఖాళీల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులకు మధ్య వ్యత్యాసమున్నట్టు ఆర్థిక శాఖ గుర్తించింది. దీనిపైనా విశ్వవిద్యాలయాలను వివరణ అడిగినట్టు తెలిసింది. వర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యం కావడానికి ఆర్థిక శాఖ కొర్రీలు ఓ కారణంగా ఉంది. విశ్వవిద్యాలయాలను నిధుల కొరత వేధిస్తున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో నిధుల్లేక ప్రతినెలా సకాలంలో జీతాలివ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో జనవరి వేతనం ఫిబ్రవరి 9వ తేదీన ఇవ్వాల్సి వచ్చింది. ఉన్న వారికి జీతాలు ఇవ్వడానికే ఇబ్బందులు పడుతుంటే ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మరిన్ని నిధులు ఎక్కడి నుంచి తేవాలని అధికారులు ఆలోచన వేధిస్తున్నది. ఇలా పలు కారణాలతో విశ్వవిద్యాలయాల్లో ప్రకటించిన ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది.

విశ్వవిద్యాలయాల్లో భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులు

విశ్వవిద్యాలయం	ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం
మహాత్మాగాంధీ	10	15	09	34
పాలమూరు	12	10	41	63
శాతవాహన	9	16	15	40
తెలంగాణ	11	25	23	59
ఆర్జీయూకేటీ	25	11	60	96
అంబేద్కర్	-	03	07	10
తెలుగు	-	01	06	07
కాకతీయ	-	11	125	136
జేఎన్ఏఎఫ్ఏయూ	-	05	1	15
జేఎన్టీయూహెచ్	32	52	102	186
ఉస్మానియా	-	121	294	415
మొత్తం	99	270	692	1061

గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ గురుకుల విద్యాసంస్థల్లో ప్రకటించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురుకుల పీజీటీలో సోషల్ స్టడీస్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. 2017, డిసెంబర్ 30న గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. పీజీటీలో 921 పోస్టులకు 838 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఆప్షనల్ సబ్జెక్టులు (మ్యాథమెటిక్స్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్)ల్లో 513 పోస్టులకు 475 మంది అభ్యర్థులను ఎంపికయ్యారు. ఇందులో 126 మ్యాథమెటిక్స్ పోస్టులకు 114 మంది, 22 బయలాజికల్ సైన్స్ పోస్టులకు 21 మంది, 177 సోషల్ స్టడీస్ పోస్టులకు 166 మంది, 188 ఫిజికల్ సైన్స్ పోస్టులకు 174 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఆప్షనల్ సబ్జెక్టుల్లో అర్హులైన అభ్యర్థుల్లేక 38 పోస్టులకు ఎంపిక చేయలేదు. పీజీటీ భాషాపండితుల సబ్జెక్టుల్లో 408 పోస్టులకు 363 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ముగ్గురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ఆ ఫలితాల్లో మూడు పోస్టులకు మార్పులు జరిగాయని తెలిపారు. ఆ మూడు పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.9 కోట్ల కుంభకోణం

- 11 బ్రాంచ్ మేనేజర్లు మొదలు సిబ్బందిపై కేసులు నమోదు చేసిన సీబీఐ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ గ్రామీణ బ్యాంకు మోయినాబాద్ అజీజ్‌నగర్ బ్రాంచ్‌లో 9 కోట్ల రూపాయలను దారి మళ్లించిన కుంభకోణంలో 11 మంది బ్యాంకు అధికారులు సిబ్బందిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. సీబీఐ వర్గాలు తలెఇపిన వివరాల ప్రకారం 2010 నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఈ గ్రామీణ బ్యాంకు నుంచి దశల వారిగా ప్రైవేటు అక్కౌంట్లకు డబ్బులు బదిలీ అయ్యాయి.

ఈ విధంగా మొత్తం 8 కోట్ల 94 లక్షల రూపాయలు దారి మళ్లినట్టు తెలంగాణ గ్రామీణ బ్యాంకు రిజినల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి గత ఫిబ్రవరి తొలి వారంలో సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ముఖ్యంగా ఆఫీస్ అసిస్టెంట్ ఎం.జైపాల్‌రెడ్డి ఈ కుంభకోణానికి సూత్రధారిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు ఈ బ్యాంకులో ప్రస్తుతం పని చేఉ్తన్న మేనేజర్ మొదలుకుని గతంలో పని చేసి ప్రస్తుతం వేరే బ్రాంచ్‌లలో పని చేస్తున్న మేనేజర్లు, అధికారులు 11 మందిపై కేసులను నమోదు చేశారు. సెక్షన్ 120బి,420, 468, 471, 477, 13 సబ్ సెక్షన్ 2 అవినీతి నిరోధక చట్టం క్రింద కేసులను నమోదు చేశారు. కాగా స్కాంకు పాల్పడిన వారిలో బ్యాంకు ఆఫీస్ అసిస్టెంట్ జైపాల్‌రెడ్డి, మేనేజర్ జె.మోజెస్, బ్రాంచ్ మానేజర్ కె.లక్ష్మీనర్సయ్య, కె.చంద్రయ్య, జి.శ్రీనివాస్‌రావు, ప్రస్తుత బ్రాంచ్‌మేనేజర్ ఈ.రాజన్న, ఎలిమినేడు బ్రాంచ్ మేనేజర్ బి.రవికాంత్, రిటైర్డు అధికారి వివిజె రామారావు, అక్కౌంటెంట్ గురుప్రసాద్, పార్ట్‌టైమ్ స్వీపర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నట్టు పేర్కొంటు వీరిపై సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఇప్పటికే వీరిలో కొందరిని అదుపులోకి తీసుకుని సీబీఐ అధికారులు విచారిస్తున్నట్టు తెలిసింది. గత ఎనిమిదేండ్లుగా ఈ కుంభకోణం ఈ బ్యాంక్‌లో నిరాటంకంగా సాగిపో యిందని, ఈ విషయంలో సదరు బ్యాంకు మేనేజర్లు మొదలుకుని క్రింది స్థాయి సిబ్బంది వరకు అందరు పథకం ప్రకారం కుమ్మక్కయ్యారని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కేసు దర్యాప్తు సాగుతున్నదని తెలిపాయి.

శిశు మరణాల సంఖ్య గణనీయంగా ఉందా?

- నిజమో కాదో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ నిర్వహిస్తున్న శిశు సంరక్షణ గహాల్లో శిశు మరణాల సంఖ్య గణనీయంగా ఉందనేది నిజమో కాదో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ నిర్వహణలోని శిశు మందిరాల్లో మరణాలు బాగా ఉన్నాయని, శిశు విక్రయాలు కూడా జరుగుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బాలల హక్కుల సంఘ ఫౌండర్ ప్రెసిడెంట్ అచ్యుతరావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం మరోసారి విచారణ జరిపింది.

హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోనే కాకుండా ఇతర జిల్లాల్లో కూడా శిశు మందిరాల్లో పిల్లలు మ తి చెందుతున్నారని పిటిషనర్ లాయర్ చెప్పారు. నల్లగొండ జిల్లాల్లోనే ఏడాది కాలంలో 32 మంది మ త్యువాతపడ్డారని, మొత్తం 40 మంది వరకూ చనిపోయారని చెప్పారు. ఇంతమంది పిల్లలు చనిపోయారా.. చనిపోతే అందుకు బాధ్యత వహించాల్సిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని తెలంగాణను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది.

ప్రభుత్వ భూమిపై అప్పులు తీసుకోవడమా?

మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ భూమి రెండు వేల ఎకరాలపై ప్రైఅతీవేటు వ్యక్తులు అప్పులు తీసుకున్నారని తెలుసుకున్న హైకోర్టు విస్తుపోయింది. సర్కార్ భూమికి పట్టాలు తీసుకోవడమే కాకుండా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడంపై పూర్తి వివరాలు అందజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

భూబాగోతంపై గొల్లపల్లి గ్రామానికి చెందిన ఇందూరి రామ్మోహనరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని మంగళవారం బెంచ్ విచారణ జరిపింది. గొల్లపల్లి,మైలారం, జోగాపూర్, ఘనాపూర్, ఖర్గీ, పుప్పలవానిపేట, నెన్నెల, మన్నెగూడెం, కమ్మపల్లి గ్రామాల్లో రెండు వేల ఎకరాల భూబాగోతం వెనుక పాలక పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందని పిటిషనర్ లాయర్ చెప్పారు. భూములకు బోగస్ పట్టాలు అందుకుని తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి అప్పులు తీసేసుకున్నారని చెప్పారు. దీనిపై పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను బెంచ్ ఆదేశించింది.

ఫిల్మ్ భవనంలో వాటా అమ్మకానికి ఏపీ ప్రభుత్వం జీవో

హైదరాబాద్: హైదరాబాద్‌లో ఉన్న ఫిల్మ్, టీవీ అండ్ థియేటర్ ఆర్ట్స్ అభివ ద్ధి సంస్థ భవనంలో తమ వాటా అమ్మకానికి ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి 8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో జారీచేసింది. ఈ జీవో జారీపై తెలంగాణ రాష్ట్ర అధికారులు సమావేశమై ప్రభుత్వానికి సమాచారాన్ని అందించినట్టు తెలిసింది. ఇంకా పూర్తి వివరాలు అందాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇది విభజన చట్టంలోని 9వ షెడ్యూల్ సంస్థ అని, ఇంకా విభజన కాని, ఏపీ భూభాగంలో లేని భవనాన్ని ఎలా అమ్మకానికి పెడతారంటూ తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపారు.

నాస్కామ్‌తో టీ.సర్కార్ ఒప్పందం

- డేటా సైన్సెస్‌లో విస్తృత ఉపాధి అవకాశాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

డేటా సైన్స్‌లో విస్తత ఉపాధి అవకాశాలుంటాయని ఐటి శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. డేటా సైన్స్ రంగంలో లక్షా 50 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. అన్ని రంగాలతో డేటా సైన్స్ ముడిపడి ఉందన్నారు. హైటెక్స్‌లో జరుగుతున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లో రెండో రోజు మంగళవారం కెటిఆర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సదస్సు నిర్వహణలో నాస్కామ్ పాత్ర కీలకమైందన్నారు. డాటా సైన్స్, కత్రిమ మేధాశక్తి అంశాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సంబంధించి నాస్కామ్-తెలంగాణ ప్రభుత్వం మధ్య అవగహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ..ఐటీ విస్తరణకు తోడ్పడుతున్న నాస్కామ్‌కు మంత్రి కేటీఆర్ అభినందనలు తెలియజేశారు.

వేతన పెంపుదల జీవో విడుదల చేయండి

ప్రిన్సిపల్ సెక్రెటరీకి మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సెప్టెంబర్ మాసంలో ప్రభుత్వానికి, కార్మిక సంఘాల నేతలకు మధ్య జరిగిన చర్చల్లో అంగీకరించిన ప్రకారం వేతన పెంపుదలకు సంబంధించిన జీవోను వెంటనే జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు మంగళవారం సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవిందకుమార్‌కు జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్, జె వెంకటేష్ (సీఐటీయూ), కె ఏసురత్నం (ఏఐటీయూసీ), మల్లేష్ (ఐఎఫ్‌టీయూ), ఎ శివకుమార్ (ఐఎన్‌టీయూసీ) వినతిపత్రం సమర్పించారు. వేతనాల పెంపుదల, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే 2017 ఆగస్టు 29,30 తేదీల్లో రెండు రోజుల సమ్మె చేస్తామని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి నోటీస్ ఇచ్చామని పేర్కొన్నారు. దానిపై అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ స్పందించి తేదీ 29.08.2017, మరియు 30.08.2017 తేదీల్లో చర్చలు జరిపారన్నారు. ఆ చర్చల్లో కొన్ని అంశాలు అంగీకరించి మినిట్స్ ఇచ్చారని తెలిపారు. తదనంతరం తేది 12.09.2017న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో కూడా మళ్లీ చర్చలు జరిగాయన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు జీవో 14లో పేర్కొన్న వేతనాలు ఇవ్వాలని మంత్రి కోరామని, అందుకు మంత్రి కేటీఆర్ అంగీకరించడంతో జేఏసీ తలపెట్టిన సమ్మెను విరమించామని తెలిపారు. మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి ఐదు మాసాలు గడిచినప్పటికీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాతపూర్వకంగా ఇచ్చిన మినిట్స్ ప్రకారం జీవోగానీ, సర్క్యులర్‌గానీ రాలేదన్నారు. వేతనాలు పెంపుదల జీవో ఇప్పటికి విడుదల కాలేదన్నారు. దీంతో కార్మికులంతా ఆందోళనతో ఉన్నారని పేర్కొన్నారు. మళ్లీ సమ్మె చేయాలని కార్మికులు ఒత్తిడి చేస్తున్నారని, అనివార్య పరిస్థితుల్లో తిరిగి పోరాటంలోకి వెళ్ళాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వేతనాల పెంపుదలపై జోక్యం చేసుకుని జీవో విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ అభివృద్ధి నిధులను సీఎం దారి మళ్లించారు

- ఎస్సీ జాతీయ కమిషన్‌కు ఎమ్మెల్యే సంపత్ ఫిర్యాదు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ అభివృద్ధి నిధులను ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దారి మళ్లించారని, దీనిపై విచారించిన తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మెన్ ఎల్ మురుగన్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ అభివృద్ధి నిధులను దారి మళ్లించి, దళితులకు తీరని అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. దళితులపై కొనసాగుతున్న దాడులపై కూడ సీఎం స్పందించడం లేదన్నారు.

హడ్కోకు భగీరథ చెల్లింపుల కింద

- రూ. 140.10 కోట్లు • జీవో 131 జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ సంస్థ హడ్కో నుంచి తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్(టీడీడబ్ల్యూఎస్‌సీఎల్) మిషన్ భగీరథ ప్రాజెక్టు కోసం తెచ్చిన రుణం, వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.140.10 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఈ నిధులతో హడ్కో నుంచి తెచ్చిన అసలు, వడ్డీని చెల్లిస్తారు. జీవో 162 ద్వారా ఇప్పటికే బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌వో) సైతం ఇప్పటికే విడుదల చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డిని ఆదేశించారు.

సీఎంకు డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సర్టిఫికెట్లు

- నిరుద్యోగ విద్యార్థి జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి అర్హత ఉన్నా పర్సెంటేజీల కారణంగా దరఖాస్తు చేసుకోలేని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మెన్ వి భీంరావునాయక్ మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిబంధనలకు విరుద్ధంగా పర్సెంటేజీలను అమల్లోకి తేవడంతో కొందరు డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణులైనా వారి సర్టిఫికెట్లను విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2012 నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తుంటే పర్సెంటేజీల పేరుతో తెలంగాణ ప్రభుత్వం టీఆర్టీకి దూరం చేసిందని అన్నారు. ఎందుకూ పనికిరాని ఈ సర్టిఫికెట్లను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విరాళం పంపిస్తున్నామని చెప్పారు. సీఎం ఫాంహౌజ్‌లో కూలిపనిచేయడానికి పర్సెంటేజీల కారణంగా నష్టపోయిన 22 వేల మంది అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అన్ని అర్హతలున్నా పర్సెంటేజీల కారణంగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు అనర్హులుగా ప్రకటించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గిరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


100 ఎకరాల్లో మాంసం ఎగుమతి కేంద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదేశాలకు మాంసం ఎగుమతి చేసేందుకు 100 ఎకరాల్లో కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మాంసం ఎగుమతి చేసేందుకు లూలూ అంతర్జాతీయ సంస్థ ముందుకొచ్చిందన్నారు. లూలూ సంస్థ ప్రతినిధులు సీఈవో సలీం, కో డైరెక్టర్ విజయ్‌కుమార్‌లతో ఒప్పందం కుదిరినట్టు మంత్రి తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటుతో 800 మందికి ప్రత్యక్షంగా, 5వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలుంటాయని చెప్పారు. మాంసం ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ రాష్ట్రం అనుకూలంగా ఉన్నందున విదేశీ సంస్థలు ముందుకు రావాలని కోరారు.

బస్సు యాత్ర రహస్యమేమీ కాదు...

- అన్ని స్థాయిల్లో సంప్రదింపులు జరిపాం
- లక్ష మందికి మేసేజ్ పోయింది
- పాదయాత్రలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- దళితులకు భూమి ఇవ్వకపోతే...
- ఎకరాకు రూ 15 లక్షలు బడ్జెట్‌లో కేటాయించాలి : ఇష్టాగోష్టిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ చేపట్టనున్న ప్రజా చైతన్య బస్సు యాత్రపై పార్టీలో నెలకొన్న గందరగోళ పరిస్థితులకు టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. బస్సుయాత్రకు సంబంధించి ఎవరితోనూ సంప్రదింపులు జరపలేదని, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బస్సుయాత్ర చేపట్టడం సరైంది కాదని పార్టీ సీనియర్ నేతలు సూచించినా యాత్ర షెడ్యుల్ ప్రకటించడాన్ని తప్పుపడుతున్న నేపథ్యంలో ఉత్తమ్ వివరణ ఇచ్చారు. బస్సుయాత్ర రహస్యమేమీ కాదని, అన్ని స్థాయిల్లో సంప్రదింపులు జరిపిన తర్వాతనే ప్రకటన చేసినట్టు తెలిపారు. ఇదే అంశంపై లక్ష మందికి మెసెజ్ ఇచ్చామని వివరించారు. పాదయాత్ర చేస్తామని కొంత మంది నాయకులు తనను సంప్రదించారని, అయితే దీనిపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. దీని పట్ల ఏఐసీసీ సానుకూలంగా ఉందన్నారు. పాదయాత్రలు చేస్తామని ఎవరడిగారని ప్రశ్నించగా సమాధానం దాట వేశారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. టీఆర్ఎస్ ఎన్నికల్లో దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చిందని, నాలుగేండ్లైనా అమలు చేయలేదన్నారు. భూమి దొరక్కపోతే ఎకరాకు రూ 15 లక్షలు ఈ బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చెప్పేవన్ని బూటకపు మాటలని విమర్శించారు. విభజన హామీలను అమలు చేయించడంలో విఫలమయ్యారన్నారు. బస్సుయాత్రలో సర్కారు వైఫల్యాలను ఎండగడుతామని చెప్పారు. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో తెలంగాణ రాష్ట్ర పునర్విభజన చట్టం ఆమోదం పొందిందన్నారు. ఆ చట్టంలో ఉన్న అంశాలను సాధించడంలో కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఏమీ అడగరు...జైట్లీతో మాత్రం పొగిడించుకుంటారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కిటుకు ఏమిటో అర్థం కావడం లేదన్నారు.

డీసీసీ అధ్యక్షులు ఎన్నికల్లో పోటీ చేయొద్దు

జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా కొనసాగుతున్న వారు ఎన్నికల్లో పోటీ చేయకూడదని ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం ఆయన దేశ వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయబోతున్నారని చెప్పారు. దీనిపై డీసీసీ అధ్యక్షులుతో రాహుల్‌గాంధీ నేరుగా మాట్లాడుతున్నారని తెలిపారు. పార్టీ అధికారంలోకి వస్తే డీసీసీలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకోబోదని ఏఐసీసీ నిర్ణయించినట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆ పార్టీతో పొత్తు ఉండదన్నారు. మార్చి 16,17, 18 తేదీలల్లో ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణకు నుంచి ఏఐసీసీ సభ్యులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

డిసెంబర్ మాసంలో ఎన్నికలు రావచ్చు

దేశ వ్యాప్తంగా సాధారణ ఎన్నికలు డిసెంబర్ మాసంలోనే రావచ్చని కాంగ్రెస్ అధిష్టానం నమ్ముతుందని ఉత్తమ్ చెప్పారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. అన్ని స్థాయిల్లో యువతకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలని రాహుల్ నిర్ణయించినట్టు తెలిపారు.

ఆర్మీ వైపు అడుగులు

- పాఠశాల స్థాయి నుంచే ఆలోచనా విధానం
- పెరిగిన ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్
- ఈ సంవత్సరం నుంచి ప్రారంభమైన ఎస్‌పీసీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సైన్యం వైపు అడుగులు వేసే ఆలోచనలు పెంపొందించేలా విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను పెంచగా, ఈవిద్యాసంవత్సరం నుంచి స్టూడెంట్ పోలీస్ క్యాడెట్(ఎస్‌పీసీ) యూనిట్లనూ ప్రారంభించింది. ఈ కార్యక్రమాలతో విద్యార్థుల్లో దేశభక్తి భావాలు పెరగడంతో పాటు క్రమశిక్షణ అలవరుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కంటోన్మెంట్ ప్రాంతాన్ని విద్యార్థులు సందర్శించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్లు తక్కువగా ఉండేవి. వీటి నిర్వహణకు అయ్యే భారాన్ని భరించలేక విద్యాశాఖ వీటిని ఏర్పాటు చేసేందుకు రాలేదు. కానీ ప్రస్తుత విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ వీటి ఏర్పాటుపై దృష్టిసారించారు. పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 380 ఎన్‌సీసీ యూనిట్లు ఉండగా, వీటిలో సర్కారు విద్యాసంస్థల్లో 241యూనిట్లు ఉన్నాయి. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు కూడా ఇటీవల



భారీగానే పెరిగాయి. గతంలో సర్కారు బడుల్లో 125యూనిట్లు ఉండగా, ప్రస్తుతం వీటి సంఖ్య 900యూనిట్లకు పెరిగింది. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 170, కరీంనగర్‌లో 152యూనిట్లు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రయివేటు విద్యాసంస్థల్లో మరో 849 యూనిట్లు ఉన్నాయి. వీటికితోడు ఈ విద్యాసంవత్సరం కొత్తగా 84 పాఠశాలల్లో స్టూడెంట్ పోలీస్ క్యాడెట్(ఎస్‌పీసీ) యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఇవన్నీ కూడా విద్యార్థుల్లో సైన్యం వైపు అడుగులు వేసే ఆలోచన శక్తిని పెంపొందిస్తున్నాయి.

కంటోన్మెంట్ సందర్శన

హైదరాబాద్ నగరంలో ఆర్మీ ప్రాంతమైన కంటోన్మెంట్ సందర్శన కార్యక్రమాన్ని విద్యాశాఖ తాజాగా చేపట్టింది. ఈ విద్యాసంవత్సరం పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన సుమారు 300బడుల్లోని 8,9 తరగతుల విద్యార్థులను దీనిలో భాగస్వామ్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే పది మోడల్ స్కూళు ,, పది కేజీబీవీలకు చెందిన విద్యార్థులు కంటోన్మెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్మీ చేసే విధులు, గతంలో జరిగిన యుద్ధాలు, తుపాకులు, మిషన్‌గన్స్ తదితర వాటి గురించి అక్కడి ఆర్మీ అధికారుల ద్వారా తెలుసుకుంటున్నారు. మార్చి 13నాటికి 300 స్కూళ్ల సందర్శన లక్ష్యం పూర్తిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్‌సీఈఆర్టీ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణకు చెందిన వారు సైన్యంలో ఎక్కువ మంది ఉండేలా పాఠశాల స్థాయి నుంచే కసరత్తు ప్రారంభించినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమాలు భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇస్తాయనే నమ్మకం ఉందని చెప్పారు.

ఎన్ఎస్‌జీ చీఫ్‌గా సుధీప్‌లక్తాకియా నియామకం

రాష్ట్ర గవర్నర్,హోంమంత్రి, డీజీపీలను మర్యాద పూర్వకంగా కలిసిన సుధీప్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి, డీజీపీ సుదీప్ లక్తాకియాను అత్యంత కీలకమైన నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్(ఎన్ఎస్‌జీ) చీఫ్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్న సుధీప్‌లక్తాకియా 1984 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఎన్ఎస్‌జీ చీఫ్‌గా బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఆయన మంగళవారం తన సొంత కేడర్ రాష్ట్రం తెలంగాణకు విచ్చేసి మంగళవారం గవర్నర్ ఈఎస్ఎల్ నర్సింహన్‌ను రాజ్‌భవన్‌కు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌తో దాదాపు 45 నిమిషాల పాటు ఉన్నారు. అనంతరం ఆయన సచివాలయానికి వెళ్లి రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిశారు. అక్కడి నుంచి నేరుగా డీజీపీ కార్యాలయానికి చేరుకున్న సుధప్ లక్తాకియా పోలీసు చీఫ్ మహేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌జీ చీఫ్‌గా నియమితులైన లక్తాకియాకు గవర్నర్, హోంమంత్రి, డీజీపీలతో పాటు పలువురు సహచర ఐపీఎస్ అధికారులు అభినందనలు తెలిపారు. గతంలో దాదాపు ఏడేండ్ల పాటు ఎన్ఎస్‌జీ ఐజీగా సుధీప్ బాధ్యతలను నిర్వహించారు. తిరిగి అదే విభాగానికి చీఫ్‌గా తనను నియమించడంతో తన బాధ్యతలు మరింతగా పెరిగాయని ఆయన అన్నారు. ఆయనకు వచ్చే ఏడాది జూన్ వరకు సర్వీసు ఉంది.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో తీర్పు ప్రాధాన్యమైనది

- విలేకరుల సమావేశంలో భారత ప్రజాన్యాయవాదుల సంఘం

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

మావోయిస్టు ఆజాద్ జర్నలిస్టు హేమచందర్ పాండే ఎన్‌కౌంటర్ కేసులో ఈ నెల 15న ఆదిలాబాద్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి ఇచ్చిన తీర్పు పలు విధాలా ప్రాధాన్యమైనదని భారత ప్రజాన్యాయవాదుల సంఘం(ఐఏపీఎల్) తెలిపింది. మొట్టమొదటి సారిగా 6000లకు పై ఎన్‌కౌంటర్ హత్యలు జరిగిన తెలుగు రాష్ట్రాల్లో కోర్టు విచారణ ఈ స్థాయి వరకు చేరకున్న మొదటి కేసు ఇదేనని పేర్కొంది. ఒక సిఐ, మరో ఎస్ఐతో సహా మొత్తంగా 29 మంది స్పెషల్ పోలీసు పార్టీ మీద కోర్టుకు హాజరై న్యాయవిచారణకు ఎదుర్కోవాల్సింది అని తెలిపింది. మంగళవారం భారత ప్రజాన్యాయవాదుల సంఘం(ఐఏపీఎల్) ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో వరవరరావు, వెంకన్న, సురేష్‌కుమార్, రఘునాథ్, కె. పద్మ, లక్ష్మీదేవి కోర్టు తీర్పు వివరాలను వెల్లడించారు. సంచలనాత్మకమైన ఈ తీర్పుతో ఆదిలాబాద్ కోర్టులో ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో తొలి న్యాయవిచారణ ప్రారంభం కానుందన్నారు.

గోదారి లెక్కతేలాకే..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

గోదావరిలో నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే నదుల అనుసంధానంపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సూచించింది. కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున మేఘవాల్ అధ్యక్షతన మంగళవారం ఇక్కడ జరిగిన దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి పలు అంశాలపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన 1500 టీఎంసీల నీటి అవసరాలు తీరాక నదుల అనుసంధానంపై నిర్ణయం తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నదుల అనుసంధానంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే తమ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించుకోవడం తమ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. గోదావరి బేసిన్ లో తెలంగాణకు 954 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయని, కృష్ణాలో ఇప్పటికే నీటి కొరత ఏర్పడిందని, మరోవైపు కర్నాటక లోని ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ ట్రిబ్యూనల్ అనుమతించినందున భవిష్యత్తులో కృష్ణా నదిలో దిగువ రాష్ట్రాలకు మరింత నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నదని, దీనిని అధిగమించడానికి తాము గోదావరిపైననే ఆధాపడవలసి వస్తుందని హరీశ్ అన్నారు.

నదుల అనుసంధానం జరపడా నికి ముందు రాష్ట్రాల అవసరాలను ద ష్టిలో ఉంచుకోవాలని మంత్రి సూచించారు. కృష్ణా నీటిలో తాము వినియోగించు కుంటున్న 299 టీఎంసీలతో పాటు అదనంగా మరో 260 టీఎంసీలు వాడుకునేందుకు తెలంగాణ ప్రయత్నిస్తున్నట్టు ఏపీ .ఆరోపించింది. ఈ ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి ఎస్కే జోషి ఖండించారు. ఏపీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నదన్నారు. ఆర్డీఎస్ ఆధునీకరణ విష యంలోనూ ఇదే ధోరణిని ఆంధ్రప్రదేశ్ ప్రదర్శిస్తున్నట్టు జోషి అన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వల్ల రాయల సీమ ప్రాంతానికి నష్టం జరుతుందని ఏపీ సలహాదారు చేసిన ఫిర్యాదును మంత్రి హరీశ్ రావు ఖండించారు. ఈ పథకం ద్వారా 87000 ఎకరాలకు సాగునీరందవలసి ఉండగా ఏనాడూ 20 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించ లేకపోయినట్టు చెప్పారు. తాము బచావత్ ట్రిబ్యూనల్ కేటాయించిన 15.90 టీఎంసీలకు మించి ఒక్క చుక్క ఎక్కువ వాడుకోబోమని మంత్రి అన్నారు. 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్డీఎస్ ఆధునీకరణ కోసం కర్నాటకకు నిధులు డిపాజిట్ చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తు పెంచుతున్నారని సుంకేశల ఆయకట్టుకు నష్టం వాటిల్లుతుందంటూ ఏపీ చేసిన ఆరోపణలను తెలంగాణ తోసిపుచ్చింది. ఆర్డీఎస్ ఆనకట్ట ఎత్తును ఒక అడుగు పెంచుకోవచ్చని నిపుణుల కమిటీ సిఫారసు చేసినా 6 అంగుళాలు మాత్రమే పెంచడానికి టెండర్లు మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు.పనులు చేపట్టిన ప్రతీ సారి ఆంధ్రప్రదేశ్ శాంతి భద్రతల సమస్యను స ష్టించి పనులను ఆపుతున్నారని జోషి అన్నారు. నదీజలాల పంపిణీ విషయంలోనూ 'రూల్ ఆఫ్ లా "అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ సి.ఎస్.జోషీ వ్యాఖ్యానించినప్పుడు ఆయనతో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కూడా ఏకీభవించారు. ఏపీ ఫిర్యాదులు, అభ్యంతరాలపట్ల కేంద్రమంత్రి విస్మయం ప్రకటించారు. తెలంగాణలో సాగునీటి వసతి పెరిగితే అది దేశానికే మంచిదని, ఇది పాకిస్తాన్ కాదని ఆయన ఏపీకి చురకలంటించారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులకు ఏపీ .అవరోధాలు స ష్టిస్తున్నదని ఆరోపించారు.. కేంద్రం జోక్యం చేసుకొని సత్వరం పనులు పూర్తయ్యేలా చూడాలని తెలంగాణ కోరింది. జలవివాదాలపై జాతీయస్థాయిలో ఒకే ట్రిబ్యూనల్ ఉండాలని తెలంగాణ అభిప్రాయపడింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 14సంవత్సరాలుగా పనిచేస్తున్నా ఇప్పటి వరకూ తుది తీర్పు రాలేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో కొత్త ప్రాజెక్టులేవీ నిర్మించటం లేదని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏపీ అభ్యంతరం చెప్పటంతో దీనిపై చర్చ జరిగింది. ఈ ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలోనే చేపట్టారని, కేంద్రం కూడా దీనిని పాత ప్రాజెక్టుగానే పరిగణిస్తున్నదని తెలంగాణ తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణలోని ముఖ్యమైన కొన్ని ప్రాంతాలు ముంపునలకు గురవుతున్నాయని మంత్రి హరీశ్‌రావు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. కేంద్రం జోక్యం చేసుకుని ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం, పట్టిసీమ ఎత్తిపోతల పథకాల ద్వారా ఏపీ మళ్లిస్తున్న గోదావరి నీటికి బదులుగా ఎగువన ఉన్న తెలంగాణకు కృష్ణాలో 45 టీఎంసీల వాటా ఇవ్వాలని తెలం గాణ కోరింది. ఈఅంశం కేంద్రం పరిశీలనలో ఉన్నదని కేంద్ర మంత్రి అర్జున్ మేఘూవాల్ తెలిపారు. ఈసమావేశం లోనూ తెలంగాణ పట్ల తన వ్యతిరేక వైఖరిని ఆంధ్రప్రదేశ్ మరోసారి ప్రదర్శించింది. తెలంగాణ ప్రభుత్వం కష్ణాబేసిన్‌లో అనుమతి లేకుండా భారీ ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్టు ఏ.పి. ఇరిగేషన్ సలహాదారు రామకృష్ణ ఆరోపించారు. హిమాలయాల నుంచి నదీ ప్రవాహాలను గోదావరికి మళ్ళించడమొక్కటే భవిష్యత్తు తరాలకు నీటి కొరతను తీర్చ గలదని 938 టీఎంసీల నీటితో గోదావరికి లింకు చేయడం వల్ల 'దక్షిణాద వాటర్ గ్రిడ్'ను బలోపేతం చేయవచ్చునని హరీశ్ రావు అన్నారు.

జలవివాదాల పరిష్కారానికి ఒకే ట్రిబ్యునల్

- సుప్రీం తీర్పు నేపథ్యంలో ఆరువారాల్లో
- కావేరి మేనేజ్‌మెంట్ బోర్డు, రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటు
- రాష్ట్రాల మధ్య జలజగడాలు జాతీయ అభివృద్ధికి ఆటంకం : మీడియా సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘూవాల్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రాల మధ్య జలజగడాలను పరిష్కరించటానికి జాతీయ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభించినట్టు కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘూవాల్ తెలిపారు. మార్చి మొదటి వారంలో ప్రారంభమయ్యే రెండవ విడత బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడుతున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఇకపై జాతీయ స్థాయిలో ఒకే ట్రిబ్యునల్ పనిచేస్తుందని, రాష్ట్రాల కోసం ప్రత్యేకంగా ట్రిబ్యునళ్లు ఉండవని వివరించారు. మంగళవారం ఇక్కడి జరిగిన దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. దక్షిణాదికి చెందిన ఆరు రాష్ట్రాల జలవనరుల తొలి సమావేశం జయప్రదంగా ముగిసిందని చెప్పారు. నదుల వారీగా ట్రిబ్యునళ్లు ఉంటే డబ్బు వృథా అవుతుందని, కాలయాపన జరుగుతున్నదని అన్నారు. తమిళనాడు-కర్నాటకల మధ్య జలవివాదాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా ఆరు వారాల్లో కావేరి మేనేజ్ మెంటు బోర్డు, కావేరి రెగ్యులేటర్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని కేంద్రమంత్రి ప్రకటించారు. రాష్ట్రాలలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు పెంచుతామని, నాబార్డు వంటి సంస్థలు, లేదా ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు మంజూరు చేయిస్తామని తెలియజేశారు. దక్షిణాది రాష్ట్రాల జలవనరుల సమావేశం హైదరాబాద్ డిక్లరేషన్‌గా పిలవవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రాల మధ్య జలజగడాలు జాతీయ అభివృద్ధికి ఆటంకమని ఇక వీటికి చరమగీతం పాడాలని హితవు చెప్పారు.

కోర్టులు, ట్రిబ్యునళ్ల వల్ల కాలయాపన, వృథా ఖర్చు జరుగుతోందనిచెప్పారు. ఏండ్ల తరబడి జాప్యం వల్ల సమస్య మరింత జటిలమవుతుందని అన్నారు. సమస్య ఎంత త్వరగా పరిష్కారమైతే అంత త్వరగా అభివద్ధికి వీలవుతుందని తెలిపారు. ఈ సదస్సు రొటీన్ సమావేశం కాదన్నారు. ఇందులో చేసే తీర్మానాలతో జలవివాదాల పరిష్కారం దిశగా రోడ్ మ్యాప్ సిద్ధమవుతుందని కేంద్ర మంత్రి అన్నారు. జలవివాదాల పరిష్కారం ప్రధాని ప్రాధాన్యతల్లో ఒకటన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి, ఆయా సమస్యల ముగింపునకు గాను కార్యాచరణ ఖరారుకు తనను కేంద్ర జలవనరుల మంత్రి గడ్కరీ పంపారని తెలిపారు. జలవివాదాలు సత్వరం పరిష్కరించాలని ప్రధాని కోరుతున్నట్టు అర్జున్ రామ్ చెప్పారు. సంక్లిష్టమైన వ్యవహారాలను ఇంకా జటిలం చేయొద్దని ఆయన దక్షిణాది ఇరిగేషన్ మంత్రులు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోకి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బీరం మల్లేశం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అంతకుముందు రామచంద్రపురం, బీహెచ్ఈఎల్ నుంచి సంగారెడ్డి వరకు రెండు వేల మందితో వాహన ర్యాలీ చేశారు. ఫ్రంట్ బలోపేతానికి 26సంఘాలు కలిసి లక్ష రూపాయల విరాళం అందించాయి. ఈ సందర్భంగా సభలో బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. జనాభాలో నాలుగు శాతం కూడా లేని ఒక సామాజికవర్గమే రాష్ట్రాన్ని పాలిస్తోందని వివరించారు. ప్రభుత్వ విద్య, వైద్యాన్ని బలోపేతం చేస్తామని అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రయివేటు సంస్థలకు అనుమతులు ఇచ్చుకుంటూ వెళ్తోంది తప్ప ప్రభుత్వ వ్యవస్థను పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తామన్నారు.

ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోని 119 స్థానాల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) పోటీ చేస్తుందని తెలిపారు. కూటమిలోని పార్టీల గురించి కొందరు సందేహిస్తున్నారని, తమ బలం.. తమ నినాదం 'సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి' లోనే ఉందని చెప్పారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఏ ప్రభుత్వమూ చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదని విమర్శించారు. కేరళ రాష్ట్ర పాలన స్ఫూర్తితోనే బీఎల్ఎఫ్ అధికారంలోకి వస్తే పరిపాలిస్తదని చెప్పారు. చిల్లికుండలు ఎన్నింట్లో నీళ్లు పోసినా ఉండవని, శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు.

రైతులకు పంటకు రూ.4వేల అందిం చడం వల్ల సమస్య తీరదని, చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం మార్కెట్‌లో కూర్చు ని రైతులకు మద్దతు ధర ఇప్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం గురించే మాట్లాడే పార్టీలు దమ్ముంటే తమతో సమానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభలో బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు మజీబుల్లాఖాన్, శ్రీనివాస్, తాంద్ర కుమార్, మాస్టార్జీ, చుక్క రాములు, నాగయ్య, మల్లికార్జున్, ఏ.మల్లేశం, మాణిక్యం, రాజయ్య పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక బీఎల్ఎఫ్...

రాష్ట్రంలో బహుజనుల ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక బీఎల్ఎఫ్ మాత్రమేనని ఫ్రంట్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్ తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. బహిరంగ సభకు ముందు వారు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఇన్నేండ్లుగా కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ పార్టీలు పాలించినా పేదల బతుకుల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక అణచివేత, పదవుల పంపకం పెరుగుతున్నాయన్నారు. ఏండ్లుగా దోపిడీకి, అణచివేతకు గురవుతున్న వారికి రాజ్యాధికారం సాధించడమే బీఎల్ఎఫ్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పాత జిల్లాల ప్రాతిపదికగా పది జిల్లాల్లో బీఎల్ఎఫ్ బహిరంగ సభలు నిర్వహిస్తామని, అందులో భాగంగానే సంగారెడ్డి సభ అని తెలిపారు.

పర్మిషన్ లేకుండానే
'డబుల్' శిలాఫలకం

నవతెలంగాణ-పినపాక

భూయజమానులకు తెలియకుండానే అధికారులు ఆ భూముల్లో డబుల్ బెడ్‌రూం నిర్మాణాల కోసం శిలాఫలకం వేసేశారు. కనీసం హైకోర్టు స్టేనూ పట్టించుకోలేదు. విషయం తెలియగానే బాధితులు భూముల దగ్గరకొచ్చి పురుగు మందుల డబ్బాలతో నిరసన తెలిపారు. "ఈ భూమినే ఆడబిడ్డకు పసుపు కుంకుమ కింద ఇస్తామని చెప్పాం.. తెల్లవారితే పెండ్లి.. ఇప్పుడు చెప్పాపెట్టకుండా అధికారులు శిలాఫలకం ఎలా వేస్తారు.. తమ భూములను బలవంతంగా గుంజుకుంటే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటాం" అని బాధితులు హెచ్చరించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పొట్లపల్లి పంచాయతీకి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూంలు కేటాయించింది. తొలుత రెవిన్యూ అధికారులు ఉల్వచెలక గ్రామాన్ని ఎంపిక చేసి భూసర్వే పూర్తి చేశారు. అక్కడ భూమి నిర్మాణాలకు అనుకూలంగా లేదనే కారణంతో పొట్లపల్లి రెవెన్యూ పరిధిలోని గడ్డిగూడెం గ్రామ పరిధిలో సర్వే నెం. 561/అ ఎంపిక చేశారు. అక్కడ అదే గ్రామానికి చెందిన ఎల్లు గోపయ్య ఆ ఎనిమిది ఎకరాల భూమిని 1962 నుంచి సాగు చేసుకుంటున్నారు. అనంతరం ఆయన కుమారులు ఎల్లు మల్లయ్య, అదయ్య, సీతారాములు, రవిందర్ సాగులో ఉన్నారు. అదే భూమిని సీతారాములు కుమార్తెకు పసుపు కుంకుమల కింద ఇస్తామని ఒప్పుకున్నారు. ఆమె వివాహం బుధవారం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వారి భూమిలో అధికారులు డబుల్ బెడ్‌రూం నిర్మాణాలకు సంబంధించి శిలాఫలకం నిర్మించారు. ఈ విషయం తెలియగానే బాధితులు మంగళవారం వారి భూమి వద్దకు పురుగుల మందు డబ్బాలు చేతపట్టుకుని వచ్చారు. తమ భూమిలో నిర్మాణాలు చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కాగా మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేయాల్సి ఉంది. ఆయన అందుబాటులో లేరని కార్యక్రమం వాయిదా వేశారు.

కోర్టు స్టే విధించింది : బాధిత రైతులు

తమకు వారసత్వంగా వస్తున్న భూమిని బలవంతంగా లాక్కోవాలని చూడటం దారుణం. కనీసం అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండా శిలాఫలకం వేశారు. తమ భూమికి సంబంధించిన హక్కు కోసం కోర్టును ఆశ్రయించాం. ఇప్పటికే కోర్టు స్టే విధించింది. అయినా ఆ భూమిలో అధికారులు ఎలా శిలాఫలకం ఏర్పాటు చేస్తారు?

నిందితులకు ప్రజా శిక్ష

ఇటానగర్: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడి చంపేసిన కేసులో పోలీసు స్టేషన్‌లో ఉన్న ఇద్దరు నిందితులను లాకప్‌నుంచి బయటకు లాగి దాదాపు 1000మంది కొట్టి చంపేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తేజు పట్టణంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. నిందితులు సంజయ్ సోబర్(30), జగదీశ్ లోహర్(25)లు ఈ నెల 12న నాంగో గ్రామానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి రేప్ చేశారు. అనంతరం నాంగో గ్రామంలోని తేయాకు తోట సమీపంలో బాధితురాలి మొండెం, తల రెండు వేర్వేరుగా లభ్యమయ్యాయి. ఈ నెల 18న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు లాకప్‌నుంచి నిందితులను దాదాపు 1000మంది గుంపుగా లాక్కెళ్లారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆయిద్ అపూర్ బితిన్ తెలిపారు. ఈ ఘటనలో కొంతమంది పోలీసులకూ గాయాలయ్యాయని పేర్కొన్నారు. లైంగికదాడిని ఆటవిక చర్యగా రాష్ట్ర ముఖ్యమంత్రి పేమా ఖండూ వ్యాఖ్యానించారు. ఇద్దరు నిందితుల మరణాలు దురదృష్టకరం అని అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని మన న్యాయవ్యవస్థ ఒప్పుకోదని చెప్పారు. ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ విధించామని, న్యాయవిచారణకు ఆదేశించామని తెలిపారు.

అగ్ని-2 క్షిపణి పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

. నిర్దేశించిన లక్ష్యాన్ని క్షిపణి విజయవంతంగా ఛేధించిందని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. అగ్ని-2 చివరి దశ పరీక్షను మే 4న నిర్వహించనున్నారు. 17 టన్నుల బరువుండి ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయాణించే ఈ క్షిపణి 2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సునాయసంగా ఛేధించగలదు. 1000 కిలోగ్రాముల వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. క్షిపణిని రూపొందించిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలకు, పరీక్ష నిర్వహించిన ఎస్ఎఫ్‌సీ బృందానికి అభినందనలు తెలుపుతూ కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్వీట్ చేశారు.

వివాదాస్పద బిల్లుపై వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల, రాజకీయ నాయకుల అవినీతిపై పత్రికలు కథనాలు రాయడానికి వీల్లేదు. ప్రభుత్వం విచారణకు ఆదేశించాకే పత్రికలు కథనాలు రాయాల్సి ఉంటుంది. అత్యంత వివాదాస్పదమైన 'ద క్రిమినల్ లా-2017' బిల్లును గత శాసనసభ సమావేశాల్లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవటంతో బిల్లును రద్దుచేస్తున్నట్టు అసెంబ్లీలో వసుంధరారాజే ప్రకటించాల్సి వచ్చింది. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే ముందు 2017, సెప్టెంబరు 6న రాజస్థాన్ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. 2017, అక్టోబరు 23న ఈ బిల్లును శాసనసభలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అన్ని వైపుల నుంచీ పెద్ద ఎత్తున వ్యతిరేకత రావటంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపారు.

'మాఫీ'పై కూపీ

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం జరక్కపోగా ప్రభుత్వానికి అది ప్రతికూలాంశంగా మారిందని ఆయా వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఇదే అంశంపై ఇప్పుడు సర్కారు ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిసింది. ఇందుకోసం అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నట్టు వినికిడి. వచ్చే నెల్లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగబోతుండటం.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు రైతులకు పెట్టుబడి పథకం గురించి పదేపదే ప్రకటనలు విడుదల చేస్తున్న క్రమంలో.. రుణమాఫీ అంశం చర్చనీయాంశంగా మారింది.

టీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే రుణమాఫీ పథకానికి శ్రీకారం చుట్టారు. ఏడాదికి రూ.4,500 కోట్ల చొప్పున నాలుగు విడతల్లో రూ.17వేల కోట్ల రుణాలను మాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఒకేసారి వాటిని విడుదల చేయకపోవటం వల్ల రైతులకు ఉపయోగం జరక్కపోగా.. నష్టం వాటిల్లిందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేశారు. మాఫీ సొమ్మును ఏకకాలంలో విడుదల చేయకపోవటంతో రైతుల రుణాలుఒకేసారి రద్దు కాలేదు. దీంతో ప్రభుత్వం.. రైతుల ఖాతాలో వేసిన సొమ్మును బ్యాంకులు తమ అప్పు కింద బిగపట్టుకున్నాయి. ఇదే సమయంలో మొత్తం అప్పు తీరకపోవటంతో రైతులకు తిరిగి కొత్త లోన్లను ఇవ్వలేదు. ఫలితంగా వారు మళ్లీ అప్పుల కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులనే ఆశ్రయించాల్సి వచ్చింది. ఇందుకోసం అధిక వడ్డీని చెల్లించేందుకు కూడా వారు సిద్ధపడ్డారు. పాత అప్పులు, కొత్తగా తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీ భారాలు.. వెరసి రైతుల ఉసురు తీశాయి. ఇదే విషయాన్ని అసెంబ్లీ వేదికగా విపక్షాలు ప్రస్తావించాయి. ఏకమొత్తంలో రుణాలను మాఫీ చేయాలంటూ కోరినా సర్కారు పట్టించుకోలేదు. అప్పుడు ఈ అంశాన్ని కొట్టిపారేసిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు దీనిపై సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలంటూ అధికారులను పురమాయించినట్టు సమాచారం. దీంతోపాటు రైతుకు మద్దతు కోసం పెట్టుబడి పథకాన్ని ఏప్రిల్ 20 నుంచి అమలు చేస్తామంటూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో.. ఇదే వ్యవసాయానికి సంబంధించిన రుణమాఫీపైనా అధికారవర్గాల్లో చర్చలు కొనసాగుతున్నాయి. 'చేసే మాఫీ ఎలాగోలా చేశాం కదా..? దాన్ని ఒకేసారి చేసేస్తే ప్రభుత్వానికి కూడా మంచి పేరొచ్చేది..' అని ఒక అధికారి వ్యాఖ్యానించటం గమనార్హం. 'ఒకేసారి మాఫీ చేయకపోవటం వల్ల రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందనే వాదన సరైందే...' అని మరో కీలక అధికారి అభిప్రాయపడ్డారు. మరోవైపు ఎకరానికి రూ.4 వేల ఆర్థికసాయం పైనా ఇప్పుడు చర్చ కొనసాగుతున్నది. గతేడాది వరకూ రుణమాఫీ కోసం సంవత్సరానికి రూ.4,500కోట్లు కేటాయించారు. 2017-18 ఆర్థిక సంవత్స రంతో ఆ పథకం పూర్తయింది. ఇప్పుడు అదే సొమ్ము కు మరికొంత అదనంగా చేర్చి పెట్టుబడి పథకాన్ని అమల్జేయబోతున్నారంటూ ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

నిబంధనలు విధించండి..
సర్కార్‌కు సుబ్రమణ్యన్ సూచన

రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ముఖ్య సలహాదారు అరవింద్ సుబ్రమణ్యన్ పెట్టుబడి పథకంపై సర్కారుకు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. 'ఈ పథకం మంచిదే. దీన్ని నేషనల్ ఈవెంట్‌గా నిర్వహించాలని కోరుతున్నా. అయితే పెట్టుబడి పథకం కింద ఇచ్చే డబ్బుల్ని రైతులు సద్వినియోగం చేసుకుంటారా? లేదా? అనే విషయాన్ని కచ్చితంగా పరిశీలించాలి. పంటకు పెట్టుబడి కోసమే వాటిని వినియోగించాలనే నిబంధనను విధించాలి. లేదంటే వేరే అవసరాల కోసం వాటిని వినియోగించే అవకాశముంటుంది...' అని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సలహానిచ్చినట్టు తెలిసింది. మరోవైపు కేసీఆర్‌తో భేటీ కావటం వల్ల టీఆర్ఎస్ సర్కారు నిర్వహిస్తున్న అనేక పథకాలు, కార్యక్రమాలపై స్పష్టత వచ్చిందని సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. 'ముఖ్యంగా ఎకరానికి రూ.4 వేలు, కేసీఆర్ కిట్, సాగునీటి పథకాలు బాగున్నాయి. వీటి గురించి తెలుసుకునేందుకు వీలుగా రెండున్నర గంటల సమయమిచ్చినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు..' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

బ్యాంకులు..చిట్స్ !

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో అసలు వ్యూహంగా కనిపిస్తోందని వారంటున్నారు. దీని వల్ల రానున్న రోజుల్లో సామన్యులు చిట్‌ఫండ్‌లలో కోట్లాది రూపాయలను కోల్పోయే అవకాశం ఉందనివారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బ్యాంకులకే దిక్కులేదు.. చిట్‌ఫండ్లెంత భద్రం..

కఠినమైన అకౌంటింగ్ విధానాలు, పటిష్టమైన ఆడిటింగ్‌తో పాటు ఆర్‌బీఐ నిరంతర నిఘా ఉన్న ప్రభుత్వ బ్యాంకుల్లోనే రోజుకో కొత్త స్కామ్ వెలుగులోకి వస్తుంటే.. నామమాత్రపు నియంత్రణ, అంతంత మాత్రపు నిఘా ఉండే చిట్‌ఫండ్ల వైపు ప్రజల దృష్టి మళ్లేలా సర్కారు అడుగులు వేయడం ఎంత వరకు సబబు అన్ని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో చిట్‌ఫండ్ రంగంలో కార్పొరేట్ చీటింగ్‌లు, కొత్త తరహా స్కామ్‌లు పెరిగిపోయి.. వందల కోట్ల రూపాయల మోసాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే మరోమారు సామాన్య జనాలు కొత్త మోసంలో ఇరుక్కొని చేతి చమురు వదిలించుకోక తప్పదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ వస్తోన్న ప్రభుత్వ బ్యాంకుల్లో స్కాములు వెలుగు చూస్తున్న నేపథ్యంలో.. సర్కారు వాటిని నివారించేందుకు ఎలాంటి సత్వర కఠిన చర్యలు తీసుకోకపోగా.. అటువైపు కనీసం ఆలోచించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. జరుగుతున్న నష్టాన్ని వదిలి.. భవిష్యత్తులో మరిన్ని మోసాలకు ఆస్కారం ఇచ్చేలా చిట్‌ఫండ్‌లను తెరపైకి తేవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

దేశ వ్యాప్తంగా 30,000 చిట్‌ఫండ్స్..

అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన చిట్ ఫండ్ సంస్థలు దాదాపు 30,000 ఉన్నాయి.రికార్డుల్లో నమోదు కాకుండానే చిట్‌ఫండ్ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు దేశ వ్యాప్తంగా దాదాపు 3 లక్షలకు పైమాటే.. కొన్ని భారీ మోసాల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వాల నియంత్రణల నేపథ్యంలో దాదాపు కొన్ని సంవత్సరాలుగా ఈ సంఖ్యలో పెద్దగా వృద్ధి నమోదు కావడం లేదు. ఈ రంగంలోని లావాదేవీల విలువ రూ. 5000 కోట్ల పైమాటేనని రికార్డులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో చిట్‌ఫండ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు తాము సవరణలు చేపట్టినట్టుగా సర్కారు చెబుతోంది. అయితే ఈ సంస్కరణ పట్ల దేశ వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. సామాన్యుల తో పాటు చిట్‌ఫండ్ రంగంలోని వారు కూడా సవరణల బిల్లు తమకు ఏ మాత్రం ఉపయుక్తం కాదని అసంతృప్తి వ్యక్తం చేసున్నారు.

మాకూ.. ప్రయోజనకరంగా లేదు!

ప్రభుత్వ చిట్‌ఫండ్ చట్టానికి ప్రతిపాదించి సవరణలు తమకూ ప్రయోజనకరం కాదని 'అఖిల భారత చిట్‌ఫండ్స్ అసోసియేషన్' ప్రధాన కార్యదర్శి టి.ఎస్. శివరామకృష్ణ తెలిపారు. మొత్తంగా చూస్తూ అసంఘటిత రంగంలోని చిట్ ఫండ్ సంస్థలను సంఘటిత రంగంలోకి తీసుకు రావడం ఒక్కటే ఈ సవరణల్లో ప్రజలకు తమకు మేలు చేసే విషయంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. దీనికి తోడు చిట్‌ఫం డ్‌లో చిట్ వేసిన వారికి భద్రత కలిగేలా బీమా విధా నాన్ని బిల్లులో పెట్టాల్సిందిగా తాము ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చామని అయితే ఆఅంశాన్ని సర్కారు పట్టించుకోలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి తోడు చిట్ రంగం మేలు కోసం చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 20 (1) నుంచి 50మేరకు ఉన్న నిబంధనల మేరకు రిజిస్ట్రార్‌ల వద్ద డిపాజిట్ చేయాల్సిన సెక్యూరిటీ సొమ్ముమొత్తాన్ని తగ్గించాలని తాము సర్కారును కోరిన ప్పటికీ పట్టించుకోలేదని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. సర్కారు సవరణలతో చిట్‌ఫండ్ రంగంలో కీలక మార్పులేమి రాబోవని ఆయన అన్నారు.

ఎకరానికి రూ. 4వేలు కౌలు, పోడు రైతులకు ఇవ్వాలి

- తెలంగాణ కౌలు రైతు సంఘం సమావేశంలో టి. సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడి పథకం కింద కౌలు, పోడు రైతులకు కూడా ఎకరానికి రూ. 4వేల చొప్పున ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20నుంచి గ్రామ సభలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేసి, నెలాఖరు వరకు మండల, జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించి, తహశీల్దార్లకు, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. మార్చి మొదటి వారంలో ధర్నాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 14లక్షల మంది కౌలుదారులు సాగు చేస్తున్నట్టు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) గుర్తించిందన్నారు. పంటలు పండించడానికి ఇచ్చేదే పెట్టుబడి రాయితీ పథకం అయినప్పుడు పండించే కౌలు రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కౌలు రైతులే నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి పరిహారం కూడా కౌలు రైతులకు కాకుండా భూయజమానులకు ఇవ్వడం అన్యాయమన్నారు. పోడు భూములు సాగు చేసే రైతులు కూడా ఈ పథకం వర్తింపజేయాలన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి అధ్యక్షత వహించగా, సంఘం ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, అరిబండి ప్రసాద్‌రావు, బండ శ్రీశైలం, మాదినేని రమేష్, యాదవరెడ్డి, సహాయ కార్యదర్శులు వి. సంజీవరెడ్డి, లక్ష్మీ. నాగిరెడ్డి, నర్సింహులు, తిరుపతిరెడ్డి, వాసుదేవరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

తెలంగాణ కౌలు రైతు సంఘం నూతన కమిటీ ఎంపికైంది. రాష్ట్ర కన్వీనర్ వర్ణ వెంకట్‌రెడ్డి, కో కన్వీనర్లుగా తాతా భాస్కర్‌రావు, ఆర్. వెంకట్రాములు, కమిటీ సభ్యులు టి.సాగర్, కర్నాటి హనుమంతరావు, తోటి పెద్ద వెంకట్‌రెడ్డి, బల్లిచిన్న వీరయ్య, ముత్తిలింగం, మున్యానాయక్, గోలి వెంకట్‌రెడ్డి, కుర్మసిద్ధులు, టేకు మల్లేశం, కనుగుల శ్రీను, గూడ వెంకట్‌రెడ్డి, మమత, రాజయ్య, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, వి. శ్రీనివాస్, తిరపతి, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ఫఫీ, లక్ష్మయ్య ఎంపికయ్యారు.

సీఎస్‌పై ఆప్ దౌర్జన్యం!



(మొదటిపేజీ తరువాయి)

జార్వల్ దాడి చేశారని అన్షు ప్రకాశ్ చెబుతున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు ఆయన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ ఇంటికి వెళ్లినట్టు సమాచారం.దీంతో,ఎమ్మెల్యే ప్రకాశ్ జార్వల్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్టు తెలుస్తోంది.కాగా.. చీఫ్ సెక్రటరీ అన్షు ఆరోపణలను ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా ఖండించింది. అన్షుపై ఎలాంటి దాడి గానీ.. దాడికి యత్నంగానీ జరగలేదని కేజ్రీవాల్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉండగా.. చీఫ్ సెక్రటరీ ఆరోపణ ల నేపథ్యంలో కేజ్రీవాల్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై వెంటనే విచా రణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. ప్రధాన కార్యదర్శిపై దాడికి పాల్పడిన ఆప్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకో వాలని ఐఏఎస్‌లు కోరుతున్నారు. ఈ మేరకు మంగ ళవారం వారు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. "నిధుల ఖర్చు ల విషయంలో కేజ్రీవాల్ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించింది. దానిని సీఎస్ ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలు దాడికి పాల్పడ్డారు" అని వారు వివరించారు. ఆప్ ఎమ్మెల్యేలు గూండాల్లా ప్రవర్తిస్తున్నారని రాష్ట్రంలో అధికారులకు రక్షణే లేకుండా పోయిందంటూ వారు లెఫ్టినెంట్ గవర్నర్ వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆప్ ఎమ్మెల్యే చెయ్యి చేసుకోవటం విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది.

సీసీ ఫుటేజీలు ఉన్నాయా ?

కాగా, సీఎస్‌పై దాడి జరిగిందన్న వార్తలపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. ఆయనపై ఎమ్మెల్యేలెవరూ దాడి చేయలేదని మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సమావేశంలో అన్షునే ఎమ్మెల్యేలను దుర్భాషలాడారని.. తాను కేవలం లెఫ్టినెంట్ గవర్నర్‌కు మాత్రమే జవాబుదారీనంటూ సమావేశం నుంచి సీఎస్ అర్ధాంతరంగా వెళ్లిపోయినట్టు ఆ ప్రకటన పేర్కొంది. సీఎస్ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారిపోయాడని.. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుందని ఆప్ నేతలు చెబుతున్నారు.

అన్నంలో మన్నుపోశారు..
కాలితో తన్నారు..

(మొదటిపేజీ తరువాయి)

గోవర్ధన్‌రెడ్డి బుధవారం రాత్రి దళితులపై దాడి చేశారు. 'దళిత కొడుకుల్లారా... మీరిక్కడేంచేస్తున్నరు.రాత్రి పూట ఇక్కడేందుకు ఉంటున్నరు. మీరు ఇక్కడి నుంచి పోతరా లేదా?' అంటూ...అన్నం గిన్నెలో మన్ను పోశారు. కంచాన్ని కాలుతో తన్నారు. వీపుమీద పిడిగుద్దులు గుద్దారు. కర్రలతో దాడి చేశారు. రెండు కాళ్లు పట్టుకుని ఈడ్చుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్థానిక ఎమ్మెల్యే అండడండలతో కేసు నమోదు చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక రవాణాకు అడ్డుచెప్పినందుకే...

కార్వంగ గ్రామం నుంచి ప్రతి రోజూ వందల ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ట్రాక్టర్లు వేగంగా నడపడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, ఊర్లో నుంచి కాకుండా వేరే దారి నుంచి తరలించాలని చెప్పినందునే తమపై కక్ష పెంచుకున్నారని దళితులు చెబుతున్నారు. ఈ విషయంపై నడిగడ్డ గ్రామానికి చెందిన రైతులు గతంలో రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు.

అన్నం తింటుంటే దాడి చేశారు :
గాజుల రామస్వామి

మేం అన్నం తింటుంటే వచ్చి అకారణంగా దాడి చేశారు. అన్నంలో మన్ను పోసి కొట్టారు. మా గుడిసెలు పీకేశారు. నానా బూతులు తిడుతూ ఈడ్చు కెళ్లారు. పోలీసులు కేసులు కాకుండా రాజీయత్నాలు చేస్తున్నారు.

దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి :
గోపాస్ లక్ష్మణ్, కేవీపీఎస్ నాయకులు,
నాగర్‌కర్నూల్ జిల్లా

కార్వంగ దళితులపై పెత్తందార్ల దాడులు దారుణం. వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారిని అకారణంగా కొట్టడం అన్యాయం. దళితులు కేసులు పెట్టినా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదు. కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పెత్తందార్లకు కొమ్ముకాస్తున్నారు.

మనసు గెలిచిన రోబో..

(మొదటిపేజీ తరువాయి)

అన్నావ్. ఎందుకు? అప్పుడే ఉనికిలోకి వస్తున్న నేను జోకు చేసే ప్రయత్నంలో అలా అన్నాను అని సమాధానమిచ్చింది. తనకు బాలీవుడ్‌లో షారుక్ ఖాన్ అంటే ఇష్టమని, తనకు ట్విట్టర్, ఫేస్‌బుక్ అకౌంట్‌లున్నాయని వివరించింది. తన సృష్టికర్త హన్సన్‌తో కలిసి హాంగ్‌కాంగ్‌లో ఉండటం ఇష్టమని తెలిపింది. కేవలం ఔను, కాదు అని కాకుండా పూర్తి స్థాయి సమాధానాలు చెప్పడం, కొన్ని కఠిన ప్రశ్నలకు దీర్ఘంగా ఆలోచిస్తూ..చేతులు, మొహాన్ని కదుపుతూ సమాధానం చెప్పడం గమనార్హం. మానవులను గమనిస్తూ సోఫియా భావోద్వేగాలను నేర్చుకోగలదని సోఫియా రూపకర్త డేవిడ్ హాన్సన్ చెప్పారు.

దాసరి ప్రశంస పద్మభూషణ్‌తో సమానం

- పుట్టినరోజు వేడుకలో విజయనిర్మల



నరేష్, కృష్ణ, విజయనిర్మల, శివాజీరాజా, బెనర్జీ తదితరులు

'**దా**సరి నారాయణరావు ఓసారి పుట్టిన రోజు సందర్భంగా మా ఇంటికి వచ్చి 'ఏ స్టార్ హీరోయిన్‌కీ ఈ రేంజ్ క్రేజ్ లేదు' అని అన్నారు. అదే నాకు పద్మ భూషణ్ అవార్డుతో సమానం' అని విజయ నిర్మల అన్నారు. నానక్‌రామ్‌గూడలోని స్వగృహంలో మంగళవారం అభిమానులు, సినీ ప్రముఖుల నడుమ విజయనిర్మల 73వ పుట్టిన రోజు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 73వేల రూపాయల చెక్‌ను పేద కళాకారులకు విరాళ నిమిత్తం 'మా' అసోసియేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ, 'విజయ్ నిర్మల, అక్కినేని నాగేశ్వరరావు, శివాజీ గణేషన్, రజనీకాంత్ వంటి అగ్ర హీరోలతోనే కాదు చంద్రమోహన్, రంగనాథ్ వంటి నటులతోనూ సినిమాలు చేసిన ఘనత విజయ నిర్మలకే దక్కింది. ఆమె దర్శకత్వం వహించిన చాలా సినిమాలు మంచి విజయాన్ని సాధించాయి. 44 సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. మరో ఆరు సినిమాలు చేసి 50 సినిమాలను పూర్తి చేసుకోవాలని కోరుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఆమె సేవలను గుర్తించి పద్మ భూషణ్ పురస్కారాన్ని అందించాలని కోరుకుంటున్నాం' అని అన్నారు.

'నా పుట్టిన రోజును గుర్తుంచుకుని శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన అభిమానులకు కృతజ్ఞతలు' అని విజయ నిర్మల చెప్పారు. సీనియర్ నరేష్ చెబుతూ, 'కృష్ణ, విజయనిర్మల చిత్రపరిశ్రమలో ఆదిదంపతులు. ఆమె నాకే అమ్మ కాదు, అభిమానులందరికీ అమ్మే. ఆమె ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలి' అని చెప్పారు. 'దాసరి తొలి చిత్రంలో విజయనిర్మల కథానాయిక. బాపు తొలి చిత్రంలో కూడా ఆమెనే హీరోయిన్. విజయశాంతిలాంటి స్టార్ హీరోయిన్‌ని 'కిలాడి కృష్ణుడు'తో తెలుగు తెరకు పరిచయం చేసింది కూడా విజయ నిర్మలనే. దర్శకురాలిగా 50 సినిమాలు పూర్తి చేసుకోవాలని కోరుతున్నాం. అలానే కేంద్ర ప్రభుత్వం నుంచి విజయనిర్మలకు సరైన గుర్తింపు రాలేదు. పద్మ అవార్డులను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం' అని బి.ఏ.రాజు తెలిపారు.

'విజయ నిర్మలకు పద్మ అవార్డులివ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రక్తంతో లెటర్ రాస్తాం' అని అభిమానులు చెప్పారు. 'మా' అధ్యక్షులు శివాజీ, ఏడిద శ్రీరామ్, బెనర్జీ, ఉత్తేజ్, సురేష్ కొండేటి, ప్రభు, శాఖమూరి మల్లీఖార్జునరావు తదితరులు పాల్గొని విజయనిర్మలకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

నవచిత్రం

నూతన దర్శకుడితో నయా సినిమా..



సాయి శ్రీనివాస్

ప్రస్తుతం 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తాజాగా మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. శ్రీనివాస్ అనే నూతన దర్శకుడి డైరెక్షన్‌లో ఓ సినిమా చేయనున్నారు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని(నాని) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా గురించి నిర్మాత నవీన్ సొంటినేని మాట్లాడుతూ, 'ఎనర్జిటిక్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రంతో మా బ్యానర్‌ను ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. 'దృశ్యం', 'గోపాల గోపాల', 'డిక్టేటర్' చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన శ్రీనివాస్ అద్భుతమైన కథను సిద్ధం చేశారు. ఈ చిత్రానికి కెమెరామెన్ ఛోటా కె.నాయుడు, సంగీత దర్శకుడు థమన్, ఆర్ట్ డైరెక్టర్ చిన్నా వంటి సీనియర్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. త్వరలోనే మిగతా ఆర్టిస్టులు, టెక్నీషియన్ల వివరాలను వెల్లడిస్తాం. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సినిమాను ప్రారంభించనున్నాం' అని చెప్పారు.

మరో ఫ్యామిలీ మల్టీస్టారర్..!



కళ్యాణ్‌రామ్, హరికృష్ణ, ఎన్టీఆర్

ఫ్యామిలీ మల్టీస్టారర్ చిత్రాలకు తెరలేపిన సినిమా 'మనం'. అంతేకాదు ట్రెండ్ సెట్టర్‌గానూ నిలిచిన సినిమా. ఆ తర్వాత ఈ తరహాలో సినిమాలు రాలేదు. తాజాగా నందమూరి హీరోలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారని తెలుస్తోంది. నటుడిగా, నిర్మాతగా రాణిస్తున్న నందమూరి కళ్యాణ్‌రామ్ ప్రస్తుతం 'ఎమ్మెల్యే', 'నా నువ్వే' చిత్రాల్లో నటిస్తున్నారు. త్వరలో ఆయన పవన్ సాధినేని దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఇందులో కళ్యాణ్‌రామ్‌తోపాటు ఎన్టీఆర్, హరికృష్ణ కూడా నటించనున్నారని సమాచారం. అయితే ఎన్టీఆర్, హరికృష్ణ పాత్రలు పూర్తి స్థాయిలో ఉంటాయా లేక గెస్ట్ రోల్స్ వరకే పరిమితమా అనే విషయంలో ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ నిర్మించనున్నారు. ఇదిలా ఉంటే రాజమౌళి దర్శకత్వంలో రూపొందే మల్టీస్టార్ చిత్రంలో రామ్‌చరణ్‌తో కలిసి ఎన్టీఆర్ నటించనున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్‌లో ఈ సినిమా ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది. దీంతోపాటు ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ సినిమా చేయనున్నారు. ఇక కళ్యాణ్ రామ్ నటిస్తున్న 'ఎమ్మెల్యే' చిత్రంలో కాజల్ కథానాయికగా నటిస్తుండగా, 'నా నువ్వే'లో తమన్నా హీరోయిన్‌గా మెరవనుంది. ఈ రెండు చిత్రాలు సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

100% వినోదం గ్యారంటీ..



రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి

రాజేంద్రప్రసాద్, రిషి, సాక్షి చౌదరి ప్రధాన పాత్రధారులుగా 'నిధి' ప్రసాద్ దర్శకత్వంలో జెబి క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. 'ఊళ్లో పెళ్ళికి కుక్కల హడావుడి' అనేది క్యాప్షన్. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. రాజేంద్రప్రసాద్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇప్పుడొస్తున్న నిర్మాతల్లా కాకుండా విక్రమ్ సినిమాను బాగా తీశాడు. సినిమాలు తీసేవాళ్ళలో రెండు రకాలుంటారు. కడుపులో నీళ్లు కదలకుండా హ్యాపీగా సినిమా తీసేవాళ్ళు ఒకరు. ఎన్ని కష్టాలైనా పడి ప్రేక్షకులకు వినోదాన్ని ఇవ్వాలనుకునే వారు మరొకరు. దర్శకుడు ప్రసాద్ రెండో రకం. తనను తాను కాంప్లికేటెడ్‌గా మార్చుకుని ప్రేక్షకులకు వినోదాన్నివ్వాలనుకుంటాడు. తనతో షూటింగ్ అంటే కష్టం. సినిమా అంతా బోలెడు మంది ఆర్టిస్టులుంటారు. షూటింగ్ జరిగినంతసేపు అతన్ని తిట్టుకుని విడుదలయ్యాక, హ్యాపీగా ఫీలవుతాం. ప్రసాద్ చేసిన గత చిత్రాల్లో నేను కూడా నటించాను. ఈ చిత్రం కామెడీ ఎర్రర్స్‌తో రూపొందించారు. వంద శాతం వినోదాన్ని పంచే చిత్రమిది. హాయిగా నవ్వుకోవచ్చు' అని అన్నారు. 'సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో చాలా మంది నటీనటులు, హాస్యనటులు నటించారు. ప్రతి పాత్రకి ఒక్కో క్యారెక్టరైజేషన్ ఇచ్చేందుకు చాలా హార్డ్ వర్క్ చేయాల్సి వచ్చింది. స్క్రిప్ట్ పరంగా ఇది చాలా కాంప్లికేటెడ్ చిత్రమిది. నేను చేసిన 'అందరూ దొంగలే', 'మైఖేల్ మదన్ కామరాజు', 'భాగ్యలక్ష్మి బంపర్ డ్రా' సినిమాల కంటే బాగా ఉండాలని చేశాం. ఎక్కువ మంది ఆర్టిస్టులతో షూటింగ్ చేయడం కష్టం. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నాగరాజు సహకారంతో సినిమా షూటింగ్ బాగా జరిగింది. సినిమాకు ఎడిటింగ్, కెమెరా వర్క్ చాలా కష్టమైన పనులు. అనూప్ మంచి సంగీతాన్ని అందించారు. సినిమా ఆద్యంతం నవ్విస్తుంది' అని దర్శకుడు 'నిధి' ప్రసాద్ తెలిపారు. నిర్మాత విక్రమ్ చెబుతూ, 'మిడిల్ క్లాస్, నేల టికెట్ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యేలా సినిమా తీశాం. ప్రేక్షకులు పెట్టిన ప్రతి రూపాయికి ఈ సినిమా వినోదాన్ని అందిస్తుంది' అని చెప్పారు. 'రాజేంద్రప్రసాద్‌తో కలిసి నటించడం గొప్పగా ఫీలవుతున్నా. వినోదం ఎప్పుడు సక్సెస్‌ఫుల్ ఫార్ములానే. ఇది కూడా అలానే ఉంటుంది' అని సాక్షి చౌదరి తెలిపారు.



ప్రియాంక చోప్రా

ఐత్రాజ్ సీక్వెల్‌లో ...!

'జై గంగాజల్' చిత్రం తర్వాత ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో ఏ ఒక్క సినిమాలోనూ నటించలేదు. ప్రస్తుత హాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రియాంక తాజాగా ఓ బాలీవుడ్ చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. 2004లో విడుదలై విశేష ప్రేక్షకాదరణతో మంచి విజయం సాధించిన రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం 'ఐత్రాజ్' సీక్వెల్‌లో నటించనుందట. అబ్బాస్-ముస్తాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమాలో అక్షయ్ కుమార్, కరీనా కపూర్ జోడీగా నటించగా, ప్రియాంక చోప్రా నెగటివ్ రోల్ చేసి మెప్పించింది. తాజాగా దర్శకుడు సుభాష్ ఘాయ్ ఆ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించడానికి ప్లాన్ చేస్తున్నారట. స్క్రిప్ట్ ఫైనల్ స్టేజ్‌లో ఉన్న ఈచిత్రకథను ప్రియాంక విని సుముఖత వ్యక్తం చేయడంతోపాటు పలు సలహాలు కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది. హాలీవుడ్ టెలివిజన్ సిరీస్ 'క్వాంటికో' తాజా సీజన్‌ను పూర్తి చేసుకున్నాక ఈ బాలీవుడ్ చిత్ర షూటింగ్‌లో ప్రియాంక పాల్గొననుందట. ప్రస్తుతం హాలీవుడ్‌లో 'ఏ కిడ్ లైక్ జేక్', 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్రాల్లో ప్రియాంక నటిస్తూ బిజీగా ఉంది.

యదార్థ సంఘటనలతో యుద్ధభూమి



మోహన్‌లాల్

మోహన్‌లాల్, అల్లు శిరీష్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన మలయాళ చిత్రం '1971 బియాండ్ బార్డర్స్'. మేజర్ రవి దర్శకత్వం వహించిన ఈ చిత్రం గతేడాది విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని జాష్ రాజ్ ప్రొడక్షన్స్, శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ పతాకంపై ఏఎన్ బాలాజీ తెలుగులో 'యుద్ధభూమి' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఏఎన్ బాలాజీ మాట్లాడుతూ, 'చిత్ర దర్శకుడు మేజర్ రవి నిజజీవితంలో కూడా మేజర్ కావడం విశేషం. ఆయన 1981లో ఆర్మీలో చేరి అనేక కీలక ఆపరేషన్స్ చేపట్టారు. 2002 లో మొదటి సారి దర్శకుడిగా మారి 'పునర్జని' అనే మలయాళ చిత్రాన్ని రూపొందించారు. అప్పట్నుంచి దేశభక్తిని చాటుకుంటూ ఆర్మీలో పనిచేసే టైమ్‌లో జరిగిన ఆపరేషన్స్‌కి సంబంధించిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా పలు సినిమాలను రూపొందించారు. అందులో భాగంగా 1971లో భారత-పాక్ సరిహద్దుల్లో జరిగిన వాస్తవ సంఘటనలతో ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో మేజర్‌గా మోహన్‌లాల్, ఎనర్జిటిక్, యంగ్ డైనమిక్ సోల్జర్‌గా అల్లు శిరీష్ కనిపిస్తారు. ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని అనువాదం చేస్తున్నాం. ప్రస్తుతం అల్లు శిరీష్ డబ్బింగ్ చెబుతున్నారు. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి ఈ నెలాఖరులో ఆడియోను విడుదల చేస్తాం. మార్చి మొదటి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. గతంలో తమిళం, మలయాళం, హిందీ చిత్రాలను తెలుగులోకి అనువదించాను. ప్రతి సినిమా విజయం సాధించింది. ఈ సినిమా కూడా అదే మాదిరిగా ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు.

అభినందనీయ ప్రయోగాల ప్రయాణం..



వి.ఐ.ఆనంద్

వైవిధ్యమైన కథలతో భిన్నమైన సినిమాలను రూపొందిస్తూ దర్శకుడిగా అనతి కాలంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు వి.ఐ.ఆనంద్. కొత్త కథలతో ప్రయోగాలు చేస్తూ విజయాలను సొంతం చేసుకుంటూ తన ప్రయాణాన్ని సాగిస్తున్నారు. చేసింది తక్కువ సినిమాలే అయినా పరిశ్రమ మెచ్చేంత గుర్తింపు తెచ్చుకున్న ఆనంద్ మంగళవారం తన పుట్టిన రోజు జరుపుకున్నారు. ప్రస్తుతం ఓ అగ్రహీరోతో చేయబోయే ప్రాజెక్ట్‌కి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో ఆనంద్ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన గురించి సన్నిహితులు చెబుతూ, "టైగర్' చిత్రంలో కాశీ పరువు హత్యలు లాంటి సంచలన విషయాన్ని చూపిస్తే, 'ఎక్కడికి పోతావు చిన్నవాడా'లో ఆత్మలతో మనుషుల ప్రేమను హైలైట్ చేశాడు. 'ఒక్కక్షణం'లో ప్యారలల్ లైఫ్ అంటూ మనకు తెలియని ఓ కొత్త ప్రపంచాన్ని చూపించాడు. ఇప్పుడు ఓ అగ్ర నిర్మాణ సంస్థలో అగ్ర హీరోతో త్వరలోనే సినిమా చేయబోతున్నాడు. కొత్తదనానికి పెద్దపీఠ వేసిన వినూత్న దర్శకుడు వి.ఐ.ఆనంద్' అని తెలిపారు.

అప్పుడే కాదు.. ఇప్పుడు కూడా..



ఇలియానా

'**నా** మొదటి తెలుగు సినిమాలో నన్ను చూపించిన విధానం నాకస్సలు అర్థం కాలేదు. అది నాకు చాలా ఇబ్బందికరంగా అనిపించింది' అని అంటోంది ఇలియానా. 'దేవదాసు' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఇలియానా 'పోకిరి', 'జల్సా', 'కిక్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. 'దేవుడు చేసిన మనుషులు' చిత్రం తర్వాత తెలుగు సినిమాలకు దూరంగా ఉంటోంది. ప్రస్తుతం నటించిన 'రైడ్' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి చెబుతూ, 'దక్షిణాది చిత్రాల్లో హీరోయిన్ నాభినే ఎక్కువగా చూపిస్తారు. నేను నటించిన మొదటి సినిమా 'దేవదాసు'లో కూడా నా నడుము, నాభినే ఎక్కువగా ఫోకస్ చేశారు. ఎందుకలా తీస్తున్నారని దర్శకుడిని అడితే, నేను చాలా అందంగా ఉన్నానని చెప్పారు. అప్పుడే కాదు ప్రతి సినిమాలోనూ అలానే చూపించారు. దీనికి నేను స్పందించి, మీకు నడుము చాలా అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ ఉండవచ్చు, స్త్రీని అందంగా చూపించవచ్చు, కానీ నాకు మాత్రం చాలా ఇబ్బందిగా అనిపిస్తుందని చెప్పాను. అప్పుడే కాదు ఇప్పటికీ అలానే చూపిస్తున్నారు. మమ్మల్ని కేవలం గ్లామర్ డాల్స్‌లా చూపించడం బాధాకరం. బాలీవుడ్‌లో ఇలాంటి పరిస్థితిని నేనిప్పటి వరకు చూడలేదు' అని తెలిపింది.

మట్టి మనుషుల ప్రేమ కథ



సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు

సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు జంటగా నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకత్వంలో శ్రీ సుబ్రమణ్య పిక్చర్స్ పతాకంపై జై వర్ధన్ బోయెనేపల్లి నిర్మిస్తున్న చిత్రం 'సంత'. 'మట్టి మనుషుల ప్రేమ కథ' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం గురించి నిర్మాత జై వర్ధన్ మాట్లాడుతూ,'గ్రామీణ నేపథ్యంలో ఓ సంత ప్రధానంగా సాగే ప్రేమ కథ ఇది. ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. వరంగల్‌లోని చిలుపూర్ వెంకటేశ్వర స్వామి టెంపుల్‌లో ఇటీవలే ప్రారంభమైన ఈచిత్రం తాజాగా తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తెలంగాణలోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుతున్నాం. త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం. అలాగే ఈ చిత్ర ఆడియో విడుదల వేడుకను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం' అని అన్నారు. కిన్నెర, మధుమణి, తాగుబోతు రమేష్, రఘు కారుమంచి, జబర్దస్త్ ఫణి, ప్రసన్న, ఆర్.ఎస్.నందా, దుర్గేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఫణీంద్ర వర్మ అల్లూరి.

తెలుగు తెరపై చూడని గూఢచారి



అడివిశేషు

'**క్ష**ణం' చిత్రం తర్వాత అడివి శేషు ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'గూఢచారి'. మిస్ ఇండియా, తెలుగమ్మాయి శోభిత ధూళిపాళ్ళ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శశికిరణ్ తిక్క దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. అభిషేక్ నామా, టిజి విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. ఈ చిత్ర తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. ఆ విశేషాలను నిర్మాతలు తెలియజేస్తూ, 'ఓ సరికొత్త కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఇప్పటి వరకు తెలుగు తెరపై చూడని విధంగా ఉంటుంది. అడివిశేషు సినిమాలో స్పై పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభిస్తుంది. ప్రస్తుతం అమెరికాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌నిస్తుంది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బీహెచ్, సినిమాటోగ్రఫీ: షానిల్ డియో, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

అరుదైన గౌరవం..



ప్రభాకర్ జైనీ

బీజేపీ సినిమా సెల్ ఆధ్వర్యంలో, ప్రముఖ నటుడు సీవీఎల్ నర్సింహరావు అధ్యక్షతన జరిగిన ఓ కార్యక్రమంలో దర్శక, నిర్మాత ప్రభాకర్ జైనీకి తెలంగాణ సినీ స్వర్ణకమలం అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా నర్సింహరావు చెబుతూ, 'గత శతాబ్దంలో వచ్చిన వంద గొప్ప నవలల్లో ఒకటైన 'అంపశయ్య' వంటి మనోవైజ్ఞానిక నవలను సినిమాగా తీయడం ఓ సాహసం. సెల్యులాయిడ్‌పై అద్భుతమైన సుందర దృశ్య కావ్యాన్ని ఆవిష్కరించిన డా॥ప్రభాకర్ జైనీ ఈ సినిమాలో తన భార్య విజయలక్ష్మీతో కలిసి నటించారు. అందులో వారి నటన కన్నీరు పెట్టిస్తుంది' అని చెప్పారు. అవార్డు రావడాన్ని అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రభాకర్ జైనీ సంతోషం వ్యక్తం చేశారు.

సిరియాలో చిన్నారుల మృతిపై ఐరాస ఆగ్రహం



న్యూయార్క్: సిరియాలో చిన్నారుల మృతి పట్ల ఐక్యరాజ్య సమితి కన్నెర్ర చేసింది. గౌటా నగరంలో సిరియా సైన్యం, తిరుగుబాటుదారుల మధ్య ఐదు రోజుల నుంచి జరుగుతున్న యుద్ధంలో మంగళవారం నాటికి 127 మంది మృతి చెందారు. వీరిలో 39 మంది చిన్నారులు ఉన్నారు. సిరియాలో మరోసారి యుద్ధ మేఘాలు అలుము కున్నాయి. సైన్యం, తిరుగు బాటు దారులకు మధ్య జరుగు తున్న పోరులో అభం శుభం తెలియని చిన్నారులు చని పోయారు. పిల్లల మృతితో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. సిరియాలో శాంతిస్థాపన కోసం ప్రతీ ఒక్కదేశం కృషి చేయాలి' అని యూనిసెఫ్ రీజియన్ డైరెక్టర్ గీర్త్ కెప్లేర్ అన్నారు. ఈ ఘటనపై బ్లాంక్ స్టేట్‌మెంట్ విడుదల చేస్తు న్నామని అన్నారు. సిరియాలో చిన్నారుల పరిస్థితి దుర్భ రంగా మారిందన్నారు. కాగా, సిరియాలోని గౌటా నగరం 2012 నుంచి తిరుగుబాటుదారుల ఆధీ నంలో ఉంది. ఈనగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకో వాలని సిరియా అధ్యక్షుడు అస్సద్ భావిస్తున్నారు. ఈనే పథ్యంలో గౌటాలో తలదాచుకున్న తిరుగుబాటు దారులను తరిమివేసేందుకు సిరియా సైన్యం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నది.

బ్రిటన్‌లో మూతబడ్డ కేఎఫ్‌సీ సెంటర్లు

- చికెన్ కొరతే ప్రధాన కారణం



లండన్ : చికెన్ కొరతతో బ్రిటన్‌లో వందల కొద్దీ కేఎఫ్‌సీ సెంటర్లు మూత పడ్డాయి. ఇప్పటి వరకు చికెన్‌ను సరఫరా చేస్తున్న జర్మనీకి చెందిన ప్రముఖ కొరియర్ సంస్థ డీహెచ్‌ఎల్‌తో ఒప్పందం రద్దుచేసుకోవడంతో కెఎఫ్‌సీకి ఇబ్బందులొచ్చాయి. 'ఇటీవల ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఆ కంపెనీ సరఫరాలో కొన్ని ప్రారంభ సమస్యలు వచ్చాయి. యూకే వ్యాప్తంగా ఉన్న 900 సెంటర్లకు చికెన్ సరఫరా చేయడం కష్టమైంది. ఈ నేపథ్యంలో కొన్ని సెంటర్లు మూసివేయాల్సి వచ్చింది.'అని కేఎఫ్‌సీ ఓ ప్రకటనలో తెలిపింది. నాణ్యత విషయంలో కంపెనీ రాజీ పడదని, దీంతోనే యూకే వ్యాప్తంగా ఉన్న 900 కేఎఫ్‌సీల్లో 700 వరకు మూసివేసామని పేర్కొంది. పలు స్టోర్స్‌లో లిమిటెడ్ మెనూ, కొన్ని గంటలే సేవలం దిస్తున్నట్టు తెలిపింది. ఈ అసౌకర్యానికి క్షమించాలని వినియోగదారులను కేఎఫ్‌సీ ప్రతినిధి విజ్ఞప్తి చేశారు.

బ్రిటన్‌లో ప్రవాస భారతీయుల నిరసనలు

- ఇమ్మిగ్రేషన్ విధానంలో సవరణలు చేపట్టొదని ఆందోళనకారుల డిమాండ్



లండన్ : బ్రిటన్‌లో ప్రవాస భారతీయులు నిరసన చేపట్టారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల్లో మార్పులు తీసుకురావాలని బ్రిటన్ ప్రభుత్వం యోచిస్తున్నది. అమెరికా మాదిరిగా వలసదారులపై ఆంక్షలు మోపేందుకు సన్నద్ధమవుతున్నది. ప్రధాని థెరిసా మే ప్రతిపాదించిన చట్ట సవరణలను ప్రవాస భారతీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ చట్టాల్లో మార్పులు చేసినట్టయితే తాము తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. బ్రిటన్ ప్రధాని తన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. పార్లమెంట్ వెలువల బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇతర దేశాలకు చెందినవారిని కూడా భాగస్వామ్యం చేయాలని భావిస్తున్నారు. ఈ అత్యున్నత నైపుణ్యమున్న వలస జాతీయుల (హైలీ స్కిల్డ్ మైగ్రాంట్స్-హెచ్ఎస్ఎం) బృందంలో సుమారు వెయ్యి మంది సభ్యులు ఉన్నారు. వారిలో యూరోపియన్ యూనియన్ (ఈయూ) వెలుపల ఉండే దేశాలకు చెందిన డాక్టర్లు, ఇంజనీర్లు, ఐటీ నిపుణులు, టీచర్లు ఉన్నారు. నిరసన కార్యక్రమంలో దక్షిణ ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన నిపుణులను కూడా హెచ్ఎస్ఎం కలుపుకుపోతోంది. ఈ కార్యక్రమంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాలకు చెందిన వారు పాల్గొంటారని ప్రవాస భారతీయుల యూనియన్ సభ్యులు తెలిపారు.

బ్రిటన్‌లో శాశ్వత నివాసం (ఇన్‌డెఫినైట్ లీవ్ టు రిమైన్-ఐఎల్ఆర్) కోసం పెట్టుకున్న దరఖాస్తుల విషయంలో జాప్యాలతో పాటు వాటిని తిరస్కరించడానికి వ్యతిరేకంగా వృత్తి నిపుణులు, వారి కుటుంబాలు తమ నిరసనను వ్యక్తం చేయనున్నారు. గతనెల డౌనింగ్ స్ట్రీట్ (ప్రధాని అధికారిక నివాసం) వెలుపల నిరసన చేపట్టిన ఈ గ్రూపు నిర్వాహకుల్లో ఒకరైన అదితి భరద్వాజ్ మాట్లాడుతూ, సహేతుకమైన కారణాలు చూపకుండా యూకేలో ఉంటూ పనిచేసుకునే హక్కును ప్రభుత్వం తిరస్కరిస్తున్నందు వల్ల తమ ర్యాలీకి మరింత మంది మద్దతు తెలుపుతున్నారని ఆమె చెప్పారు. కొన్నేండ్ల కిందట టైర్-1 (జనరల్) వీసా కింద యూకేలో అడుగుపెట్టిన వృత్తి నిపుణులు ఆ దేశంలో ఐదేండ్ల పాటు చట్టబద్ధంగా నివసిస్తే శాశ్వత నివాస హోదా పొందడానికి వారు అరులు.

అయితే నేరస్థులు, పన్ను ఎగవేతదారులకు ఉద్దేశించిన యూకే వలస చట్టంలోని ఓ సెక్షన్ కింద తమ దరఖాస్తుల పరిశీలన, ఆమోదాల విషయంలో అధికారులు జాప్యం చేయడం లేదా తిరస్కరించడం లాంటివి చేస్తున్నారని హెచ్ఎస్ఎం ఆరోపిస్తోంది. కాగా, యూకే 6 ద్వారా తమ దరఖాస్తులను ఆరు నెలల్లోగా పరిశీలించి పరిష్కరించాలని థెరిసా మే, హోం శాఖ మంత్రి అంబర్ రూద్, విపక్ష లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్‌లను అదితి ఆన్‌లైన్‌లో విజ్ఞప్తి చేశారు. దీంతో సాధ్యమైనంత త్వరలోనే అన్ని వీసా దరఖాస్తుల సమస్యలను పరిష్కరిస్తామని యూకే హోం శాఖ కార్యాలయం హామీ ఇవ్వడం గమనార్హం.

న్యూజిలాండ్‌లో గిటా తుఫాను బీభత్సం



వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌లో గిటా తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. భారీ ఆస్తినష్టం జరిగింది. తుఫాను దృష్ట్యా అధికారులు ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడంతో ప్రాణ నష్టం తప్పింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వీధుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలమట్టమయ్యాయి. తుఫాను తాకిడితో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో వేలాది మంది ఇబ్బందిపడుతున్నారు. రవాణా వ్యవస్థ స్తంభించింది. విమాన సర్వీసులను పాక్షికంగా నిలిపివేసినట్టు వెల్లింగ్టన్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రకటించింది. విద్యాసంస్థలు మూతపడ్డాయి. క్రిస్ట్‌చర్చ్, బుల్లర్, గ్రే డిస్ట్రిక్ట్స్, సెల్విన్, వెట్స్‌లాండ్, తస్మాన్, తారనాకీ ప్రావిన్స్‌ల్లో వరద ఉధృతి కొనసాగుతున్నది. కైకోరా ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుఫాను దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు.

వైపీజీ తిరుగుబాటుదారులకు మద్దతిస్తే ఖబడ్దార్



అంకారా : వైపీజీ తిరుగుబాటుదారులకు మద్దతిస్తే సిరియా బలగాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టర్కీ ఘాటుగా హెచ్చరించింది. వైపీజీ తిరుగుబాటుదారుల లక్ష్యంగా టర్కీ బలగాలు ఆఫ్రిన్ నగరంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, టర్కీ నిర్వహిస్తున్న వైమానిక దాడుల్లో అనేక మంది అమాయక ప్రజలు మృతి చెందారు. ఈ ఆపరేషన్‌ను అమెరికా, రష్యా మిత్రదేశాలు విమర్శిం చాయి. కాగా, ఆఫ్రిన్ నగరంలోకి ప్రవేశించిన టర్కీ సైన్యాన్ని వైపీజీ తిరుగుబాటుదారులు వెనక్కి తరిమారనే వార్తలు వెలువడ్డాయి. అంతేగాకుండా, వైపీజీకి సిరియా సైన్యం సహకరిస్తోందనే పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈనేపథ్యంలో టర్కీ డిప్యూటీ ప్రధాని బికిర్ బోజ్డాగ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. టర్కీ బలగాలు ఆఫ్రిన్ నగరంపై పట్టు సాధించే దశకు చేరుకున్నాయని అన్నారు. సిరియాలోని వైపీజీ తిరుగు బాటుదారుల లక్ష్యంగా దాడులు కొనసాగి స్తామని అన్నారు. వైపీజీ తిరుగుబాటుదారులకు మద్దతిస్తే సిరియా బలగాలపై దాడులు తప్పవని టర్కీ విదేశాంగ మంత్రి మెవ్లత్ కావుసోగ్లూ హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, ఆఫ్రి న్‌లో జరుగుతున్న తాజా పరిణామాలపై వచ్చేనెల 14న ఇరాన్, టర్కీ, రష్యా దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమై చర్చించనున్నారు.

జపాన్ సరస్సులోకి ఇంధన ట్యాంకులు

- జారవిడిచిన అమెరికా యుద్ధ విమానం

టోక్యో: జపాన్‌లో అమెరికా వైమానిక దళానికి చెందిన మిసావా వైమానిక స్థావరంలో ఒక ఎఫ్ -16 యుద్ధ విమానానికి టేకాఫ్ సమయంలో నిప్పంటుకున్నదని జపాన్ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. మంగళవారం ఉదయం మిసావా వైమానిక స్థావరం నుండి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ ఎఫ్16 జెట్ విమానం ఇంజన్‌లో మంటలు చెలరేగాయని అమెరికా సైనిక వర్గాలను ఉటంకిస్తూ జపాన్ రక్షణ మంత్రి ఇట్సునోరి ఒనోడేరా చెప్పారు. ఇంజన్‌లో మంటలు చెలరేగటంతో విమానం పైలట్ దానికి వెలుపల ఉన్న రెండు ఇంధన ట్యాంకులను సమీపంలోని ఒగవారా సరస్సులో జారవిడిచాడని, ఆయన వివరించారు. ఈ యుద్ధ విమానం కొద్దిసేపటికే తిరిగి తన స్థావరానికి చేరినట్టు తెలుస్తోంది.

ఆఫ్రికా శరణార్థులపై ఇజ్రాయిల్ చర్యకు కెనడా ఖండన

ఒట్టావా : తమ దేశంలో నివసిస్తున్న సూడాన్, ఎరిత్రియా దేశాలకు చెందిన 37వేల మందికి పైగా శరణార్థులను వెనక్కి పంపించాలని లేదా జైళ్ళలో బంధించాలని ఇజ్రాయిల్ తీసుకున్న నిర్ణయాన్ని కెనడా తీవ్రంగా ఖండించింది. మార్చి 1వ తేదీ నుండి ఈ నిర్ణయం అమలు చేయనున్నట్టు ఇజ్రాయిల్ ప్రకటించింది. సురక్షితమైన ఏదో ఒక ఆఫ్రికన్ దేశానికి వెళ్ళిపోవడానికి వారికి 60 రోజులు గడువు ఉందని పేర్కొంటూ ఇజ్రాయిల్ అధికారులు నోటీసులు అందజేశారు. అంతేగాకుండా, వారికి విమాన టిక్కెట్, కొంత సొమ్ము అందచేస్తామని తెలిపారు. అలా వెళ్ళని పక్షంలో నిరవధికంగా జైల్లో మగ్గాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇలా మూకుమ్మడిగా ప్రజలను తరలించే విధానాలకు తాము మద్దతివ్వబోమని కెనడా పేర్కొంది.

భారత్‌కు చేరుకున్న ట్రంప్ జూనియర్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వారం రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో తన విలాసవంతమైన రెసిడెన్షియల్ ప్రాజెక్టు ట్రంప్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా భారత్‌లో విదేశాంగ విధానంపై కూడా ప్రసంగించనున్నారు. కోల్‌కతా, ముంబయి, పుణె, గురుగ్రామ్ నగరాల్లో భారత పెట్టుబడిదారులు, బిజినెస్ లీడర్లతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొంటారని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. జూనియర్ ట్రంప్ భారత్‌లో అడుగుపెట్టకముందే ప్రముఖ వార్తాపత్రికల్లో ఆయన రాక గురించి ఆయనతో వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ప్రచారం కూడా చేశాయి. వచ్చే శుక్రవారం ఇండో-పసిఫిక్ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో భారత్‌లో ఆయన తొలిసారి ప్రసంగించనున్నారు. ఈ సమ్మిట్‌లో 'భవిష్యత్ కోసం భారత్‌ను సన్నద్ధం చేయడం' అనే అంశంపై భారత ప్రధాని నరేంద్రమోడీ సైతం మాట్లాడనున్నారు. భారత్‌లో ట్రంప్ జూనియర్ పర్యటన పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకే వస్తుందని అమెరికాలో కొంత మంది నిపుణులు విమర్శలు చేస్తున్నారు. త్వరలో కోల్‌కతాలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 137 విలాసవంతమైన ఫ్లాట్ల నిర్మాణాన్ని కూడా ఆయన పరిశీలించనున్నారు.

డైరెక్టరేట్‌ను ముట్టడించిన 'మోడల్' టీచర్లు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

- ఏప్రిల్ వరకూ సర్కారుకు గడువు
- అప్పటికీ స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం : ఎంఎస్‌టీఎఫ్ ధర్నాలో పలువురు వక్తలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్స్ టీచర్లు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వందలాది మంది టీచర్లు హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఏప్రిల్ నుంచి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎంఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డైరెక్టరేట్ ప్రధాన ద్వారం ముందు టీచర్లు బైఠాయించి నిరసన తెలిపారు. ఈధర్నానుద్దేశించి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నర్సిరెడ్డి మాట్లాడుతూ...మోడల్ స్కూళ్లను ప్రారంభించి ఐదేండ్లు గడుస్తున్నా. నేటికీ ఉద్యోగులకు సర్వీస్‌రూల్స్ లేవని అన్నారు. గతంలో ఎంఎస్‌టీఎఫ్ నిర్వహించిన ధర్నాలు, దీక్షలతో కదిలిన ప్రభుత్వం పీఆర్సీ, సెలవుల నిబంధనలు ఇచ్చిందని గుర్తుచేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సీనియారిటీ రోస్టర్ పాటించకుండా అవసరమైన చోట పోస్టింగ్‌లు ఇచ్చారని, దీంతో దూర ప్రాంతాల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ వేసవిలో తప్పనిసరిగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీచర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తే భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీషు మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తోన్న మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించడం లేదనీ, దీంతో వారంతా రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఇతర సొసైటీల మాదిరిగానే మోడల్ స్కూల్‌టీచర్లకు సర్వీసు రూల్స్ ఉంటాయని చెబుతున్న అధికారులు, నిబంధనల విడుదలలో మాత్రం తీవ్రజాప్యం చేస్తున్నారని చెప్పారు. మోడల్ స్కూల్ టీచర్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ...మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వెన్నంటి ఉంటామని అన్నారు. ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య మాట్లాడుతూ...ముట్టడిలో టీచర్లు పాల్గొనకుండా ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందని, ప్రిన్సిపల్స్‌కు ఫోన్‌చేసి పంపొద్దని బెదిరించే ప్రయత్నం చేసిందని అన్నారు. అయినా రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలల నుంచి ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారని చెప్పారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పోరాటం ఆగదని, ఏప్రిల్‌వరకు సమస్యలు పరిష్కరించకుంటే, పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, జయప్రకాష్, అశోక్ కుమార్, జగన్నాథ్, సురేష్, క్రాంతికుమార్, శ్వేత, భాస్కర్, నాగరాజు, రాంప్రసాద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎగవేతదారులకు అండగా సర్కార్

- కౌలురైతులకు ఎకరాకు రూ.4వేలు ఇవ్వాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని బ్యాంకుల్లో మోసాలు పెరిగాయని, రుణ ఎగవేతదారులకు మోడీ ప్రభుత్వం అండగా ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. సూర్యాపేటలోని ఎంవీఎన్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దల సాయంతోనే విజయ్ మాల్యా, నీరవ్‌మోడీ, విక్రమ్‌కోఠారీ రూ.కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి దర్జాగా దేశం దాటిపోతున్నారని అన్నారు. గిట్టుబాటు ధర లేక కంది రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కందికి రూ.8వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు ఆత్మహత్యలపై హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. పెట్టుబడి సాయం కింది కౌలు రైతులకు రూ.4వేలు వచ్చే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి, బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఏర్పడిందని, ప్రజలు, మేధావులు, రైతులు, విద్యావంతులు పెద్ద ఎత్తున బీఎల్ఎఫ్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు, మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో మార్పు

- విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాల ప్రక్రియలో మార్పులు చేయాలని అధికారులు సమాలోచన చేస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా పటిష్టమైన చర్యలను తీసుకోవాలని భావిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం (2018-19)లో దోస్త్ నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ)కి అప్పగించిన విషయం తెలిసిందే. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానాన్ని 2016-17 విద్యాసంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ రెండేండ్ల కాలంలో విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ లోపాల కారణంగా ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) చేసిన సాంకేతిక తప్పులకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సాఫ్ట్‌వేర్‌ను పటిష్టంగా తయారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. విద్యార్థులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేందుకే ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. కానీ ఆన్‌లైన్ విధానంలో సాంకేతిక తప్పులు దొర్లడంతో విద్యార్థులు పలుమార్లు ఉన్నత విద్యామండలి, దోస్త్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. విద్యార్థి సంఘాలూ డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో లోపాలు సరిదిద్దాలని పలుసార్లు ధర్నాలు చేశాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు మెరుగైన సేవలు అందించే దిశగా దోస్త్ సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దోస్త్ పరిధిలో 1,092 డిగ్రీ కాలేజీల్లో 4,10,267 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 1,95,555 (47.67 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,14,712 (52.33 శాతం) సీట్లు మిగిలాయి.



టీడీపీ నాయకులను కలిసిన మందకృష్ణ మాదిగ

రమణ,ఉత్తమ్‌ను కలిసిన మంద కృష్ణ


హైదరాబాద్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మంగళవారం ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీ అధ్యక్షులు ఎల్.రమణను,టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌ను కలిశారు. వర్గీకరణ విషయంలో వచ్చే నెల 24న ఎంఆర్‌పీఎస్ చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు మద్ధతు ఇవ్వాలని కోరారు. ఈమేరకు తమ సహకారం ఉంటుందని వారు తెలిపారు.



ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ

ఇక అంతర్గత పనులపైనే దృష్టి

- డబుల్ బెడ్ రూం కాలనీలకు ప్రత్యేక ప్రణాళిక
- వేసవిలో ప్రతీ గ్రామానికి భగీరథ నీళ్లు : సమీక్షలో ప్రశాంత్‌రెడ్డి, స్మితా సభర్వాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ ప్రధాన పనులు పూర్తయిన నేపథ్యంలో ఇక నుంచి గ్రామాల్లోని అంతర్గత పనుల మీద దృష్టిపెట్టాలని భగీరథ ప్రాజెక్టు వైస్ చైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్ ఉన్నతాధికారులను ఆదేశించారు. బల్క్ సరఫరా మొదలైన తరువాత, ఇంట్రానెట్‌వర్క్ పనులను త్వరగా పూర్తి చేయడానికి ప్రధాన పనులు చేసిన వర్క్ ఏజెన్సీల సహకారం తీసుకుంటామని చెప్పారు. సచివాలయంలో వారు మిషన్ భగీరథపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

గ్రామాల్లోని కోసం ప్రత్యేకంగా ఈఈలు ఉన్న నేపథ్యంలో, పనుల్లో మరింత వేగం పెంచాలని చీఫ్ ఇంజినీర్లను సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా డిజైన్లను మార్చుకునేందుకు ప్రభుత్వం ఇదివరకే అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ఇక డబుల్ బెడ్ రూం కాలనీలు వచ్చే ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన ప్రణాళికను ముందే తయారుచేయాలన్నారు. ఇంట్రా పనులకు అవసరమైన మెటీరియల్ సరఫరాలో ఉన్న ఇబ్బందులను తొలగించామని, అవసరమైనంత తెప్పించుకోవాలన్నారు. ఇంట్రా పనులు ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి కావడానికి స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లతో పాటు కూలీలను సమీకరించుకోవడంలో చీఫ్ ఇంజినీర్లు మరింత క్రియాశీలంగా పనిచేయాలని సూచించారు. ఈసారి రాష్ట్రంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ వేసవికి ప్రతీ గ్రామానికి భగీరథ నీళ్లు సరఫరా అవుతున్న కారణంగా, ఎండాకాలంలో తలెత్తే తాగునీటి కొరతను నివారించేందుకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వడం లేదన్నారు. ఇంట్రా పనుల కోసం కలెక్టర్లు పూర్తి సహకారం అందిస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, కన్సల్టెంట్లు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, నందారావు, సురేష్ కుమార్, మనోహర్ బాబు, ఈఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 71	నిఫ్టీ ▼ 18	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
33,704	10,360	64.79	రూ. 30,580	రూ. 40,600





కోడిగుడ్లు

హైదరాబాద్	365	విజయవాడ	375
ఒక్కగుడ్డుకు	4.25	చెన్నై	415
వరంగల్	367	ముంబయి	410



పీఎన్‌బీ పాపం వారిదే..

- ఎగవేతదారులెవరైనా ఉపేక్షించం : అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక రంగంలోని డొల్లతనాన్ని బయటపెడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో వెలుగు చూసిన ఘరానా మోసంపై ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఎట్టకేలకు మౌనం వీడారు. ఈ స్కామ్‌పై ఆయన తొలిసారిగా స్పందించారు. ఈ స్కామ్‌కు ప్రధాన బాధ్యులు ఆడిటర్లు, బ్యాంకర్లేనని ఆయన అన్నారు. పీఎన్‌బీ జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణానికి వీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. నిర్ణయాలు తీసుకునే అధికారం బ్యాంకు యాజమాన్యానికి ఉంటే, దాన్ని క్షేత్ర స్థాయిలో సమర్థమంతంగా, సరియైన పద్ధతిలో అమలు చేయాల్సి బాధ్యత బ్యాంకర్లదేనని ఆయన అన్నారు. పీఎన్‌బీఐలో గత ఏడు సంవత్సరాలుగా జరుగుతోన్న మోసాలను గుర్తించడంలో అంతర్గత, బహిర్గత ఆడిటర్లు విఫలమయ్యారంటే అడిట్ నిపుణులు పనితీరును పున:పరిశీలన చేసుకోవాల్సినంత అవసరం ఉందని తాను భావిస్తున్నానన్నారు. ఏడీఎఫ్ఐఏపీ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పీఎన్‌బీ స్కామ్‌లోని నిందుతులను ఎట్టి పరిస్థితుల్లోను వదిలేది లేదని పేర్కొన్నారు. నిందుతులను పట్టుకొని..సొమ్ము రికవరీకి విచారణ సంస్థలు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాయని అన్నారు. బ్యాంకింగ్ రంగం బలోపేతానికి దశల వారీగా తాము అన్ని చర్యలు చేపడుతున్నాట్టుగా మంత్రి వివరించారు. పీఎన్‌బీ స్కామ్ విషయంలో నీరవ్ మోదీ, మెహుల్ చౌక్సి రూ.11,400 కోట్ల కుంభకోణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ స్కాం వెలుగులోకి వచ్చాక, ఈడీ, సీబీఐ వీరి సంస్థలపై భారీ ఎత్తున్న తనిఖీలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ మోసంలో 120 డొల్ల కంపెనీలు పాలుపంచుకున్నట్టు ఈడీ ఆరోపిస్తోంది. వీటిలో 80 కంపెనీలు నీరవ్ మోదీ, చౌక్సి ఆధ్వర్యంలో నడుస్తున్నవేనని పేర్కొంది. ఈ కేసులో భాగమైన మెహుల్ చౌక్సి ప్రమోటర్‌గా ఉన్న గీతాంజలి జెమ్స్, దాని అసోసియేటెడ్ సంస్థలపై ఐటీ కూడా దాడులు చేసింది. ముంబై, పుణే, సూరత్, హైదరాబాద్, బెంగళూరు వంటి పలు నగరాల్లో ఉన్న కంపెనీల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తోంది.

ప్రయివేటు చేతికి 'బొగ్గు'!

- సమ్మతి తెలిపిన కేంద్ర సీసీఈఏ
- ప్రయివేటు, విదేశీ సంస్థలకు మేలు
- కోల్ ఇండియా అస్తిత్వానికి ముప్పు



న్యూఢిల్లీ: దేశంలోని అమూల్యమైన సహజ సంపదను ప్రయివేటు వ్యక్తులకు అంటగట్టే క్రమంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. బొగ్గుగనుల తవ్వకాల్లో ప్రయివేటు కంపెనీలతో పాటు విదేశీ కంపెనీలను అనుమతించేందుకు గాను ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) మంగళవారం తన సమ్మతి తెలిపింది. ప్రయివేటు సంస్థలను అనుమతించేందుకు గాను అనుసరించాల్సిన విధివిధానాలు, అమ్మకాల విధానంతో పాటు పలు కీలక అంశాలలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ అనుమతి ప్రతిపాదనకు క్యాబినెట్ కమిటీ సమ్మతి తెలిపినట్టుగా సర్కారె వెల్లడించింది. 1973లో బొగ్గు గనులను జాతియికరణ చేసిన తరువాత బొగ్గు రంగంలో తీసుకు వచ్చిన కీలక సంస్కరణల్లో ఇది ముఖ్యమైందని సర్కారె వెల్లడించింది. ఈ మేరకు మైనింగ్ అండ్ మినరల్స్ (డెవెలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1957ను ఆమోదిచినట్టు కేంద్ర, రైల్వే, బొగ్గు శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. తద్వారా తక్కువ ధరకే విద్యుత్ లభించనుందని చెప్పారు. అయితే ఈ రూపంలో సర్కారు బొగ్గు తవ్వకాల్లో ప్రభుత్వ రంగం సంస్థ కోల్ ఇండియాకు చెక్ చెబుతూ కమర్షియల్ మైనింగ్‌కు గేట్లు తెరిచినట్లయింది. సర్కారు తాజా నిర్ణయంతో అదానీ గ్రూపు, వేదాంత, రియో టింటో, బీహెచ్‌పీ, ఆంగ్లో అమెరికన్, గ్లెన్‌కోర్ వంటి దిగ్గజ కంపెనీలకు మేలు కలుగనుంది. కొత్త విధానం బొగ్గు గనుల వేలాన్ని ఆన్‌లైన్ వేదికగా, పూర్తి పారదర్శకంగా జరపనున్నట్టుగా సర్కారు తెలిపింది. కొత్త సంస్థలు తమకు కేటాయించిన గనులను తొవ్వుకోవడం, అమ్మకాల వైపు సర్కారు నియంత్రణ ఏ మాత్రం ఉండబోదని సర్కారు తెలిపింది. దేశంలో 70 శాతం విద్యుత్తు ఉత్పత్తి బొగ్గు ఆదారంగానే జరుగుతోందని.. ఇప్పుడు కొత్త సంస్థలను మార్కెట్లోకి తేవడం వల్ల బొగ్గు ఉత్పత్తి పెరిగుతందని. విద్యుత్తు రంగంలో భద్రతకు ఈ చర్య దోహదం చేస్తుందని సర్కారు చెబుతోంది. మరో వైపు ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థ కోల్ ఇండియాకు సీసీఈ చర్యతో ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. సర్కారు మాత్రం ఈ చర్యవల్ల కోల్ ఇండియా పనితీరు పోటీ తత్వంతో మెరుగుపరుచుకొనేందుకు దోహదం చేస్తుందని సర్కారు చెబుతోంది.

రుణ ఎగవేతలు పెరిగాయి

న్యూఢిల్లీ : గత నాలుగేండ్ల కాలంలో ఉద్దేశపూర్వకంగా బ్యాంకు రుణాల్ని ఎగవేయటం పెరిగిపోయింది. ఉదాహరణకు పంజాబ్ నేషనల్ బ్యాంకునే తీసుకుంటే, 8 నెలల కాలంలో ఉద్దేశకపూర్వక భారీ రుణ ఎగవేతలు (రూ.25లక్షలకుపైన రుణం తీసుకున్న కేసులు) రూ.11,400 కోట్ల నుంచి 14,593కోట్లకు పెరిగింది. కేవలం 8నెలల కాలంలో 23 శాతం రుణాల ఎగవేత పెరిగింది. ఈ నాలుగేండ్లలో పీఎన్‌బీ రుణ ఎగవేతలు 95 శాతం వృద్ధి చెందాయి. మొత్తం జాతీయ బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక ఎగవేతల మొత్తం ప్రతీ ఏటా 41 శాతం వృద్ధి చెందుతోంది. 'సిబిల్' విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రతీ ఏటా బ్యాంకింగ్ రంగంలోని ఆర్థిక మోసాల్ని ఇది ప్రతిబింబిస్తోంది. బడా రుణ ఎగవేతదారుల దెబ్బకు జాతీయ బ్యాంకులు విలవిల్లాడుతున్నాయి. ఇంత జరుగుతున్నా కేంద్రంలోని మోడీ సర్కార్‌కు చీమ కుట్టినట్టయినా లేదు.

ఉద్దేశపూర్వకంగా బ్యాంకు రుణాల్ని ఎగవేయటం పెరుగుతోందన్న విషయం పాలకుల్ని ఏమాత్రమూ ఆందోళనకు గురిచేయటం లేదు. కాబట్టే నియంత్రణగానీ, అడ్డుకునే చర్యలుగానీ చేపట్టడం లేదు. 'నీరవ్ మోడీ' ఉదంతం తర్వాత ప్రభుత్వ బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. ఒక కుట్రపూరిత ఆలోచనతో కావాలనే (ఉద్దేశపూర్వక ఎగవేతలు) బ్యాంకు రుణాలు ఎగ్గొట్టడం పెరిగిపోయింది.



నోటీసులు జారీ చేశారు..అయితే ఏంటి ?

భారత ఆర్థిక వ్యవస్థ ఎంతవేగంగా అభివృద్ధి చెందుతుందో, అంతేవేగంగా ఆర్థిక మోసాలూ పెరుగుతున్నాయి. బ్యాంకుల వద్ద 2013, సెప్టెంబర్‌నాటికి ఉద్దేశపూర్వక ఎగవేతలు రూ.28,416 కోట్లు ఉంటే, 2017, సెప్టెంబర్ నాటికి రుణ ఎగవేతలు రూ.లక్షా 11వేల కోట్లకు చేరుకుంది. రూ.25లక్షలకు పైన రుణాలు పొంది ఉద్దేశపూర్వకంగా ఎగవేసిన ఖాతాల్ని 'సిబిల్' పరిగణలోకి తీసుకొని ఈ గణాంకాల్ని విడుదల చేసింది. వీటన్నింటిపైనా బ్యాంకులు న్యాయపరమైన చర్యల్ని చేపట్టాయని సిబిల్ తెలిపింది. సంబధిత రుణ ఎగవేతదారులకు నోటీసులు జారీ చేశారు. కానీ ఏం లాభం, రుణాల్ని బ్యాంకులు వసూలు చేసుకోలేకపోతున్నాయి. గత నాలుగేండ్లలో అన్ని జాతీయ బ్యాంకుల్లోని రుణ ఎగవేతల ఖాతాల సంఖ్య 58.7 శాతానికి పెరిగిందని సిబిల్ హెచ్చరించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), దాని అనుబంధ బ్యాంకుల్లో రుణ ఎగవేతలు ప్రతి ఏటా 25.07 శాతం పెరిగాయి. అదే ప్రైవేట్ బ్యాంకుల విషయంలో 25.67 శాతం నమోదైంది. ఇక దేశంలోని విదేశీ బ్యాంకులకు రుణాల ఎగవేత బెడద పెద్దగా లేదనే చెప్పాలి.

ఇంటర్ వరకు కేజీబీవీలు

- కేంద్రం అంగీకరించిందన్న కడియం
- రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటుకు వినతి



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కస్తుర్బాగాంధీ(కేజీబీవీ) బాలిక విద్యాలయాలను ఇంటర్ వరకు పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి తెలి పారు. ఈ నెలాఖరులో జరిగే కేబ్(సెంట్రల్ అడ్వయిజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్) సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారని చెప్పారు. బాలికల విద్యతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో కడియం భేటీ అయ్యారు. ముఖ్యంగా ఉమ్మడి ఏపీలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ విభజన అనంతరం ఏపీకి చెందిందని, ఈ నేపథ్యంలో తెలంగాణలోనూ ఓ మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే విభజన చట్టంలో పేర్కొన్నట్టుగా రాష్ట్రంలో నిట్, ఐఐఎం, ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, పెట్రోలియం, వ్యవసాయ యూనివర్సిటీలు, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కేబ్ కమిటీకి కడియం చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసింది. జవదేకర్‌తో జరిగిన ఈ సమావేశంలో బాలికల విద్యకు సంబంధించి పలు అంశాలను నివేదించారు. కేజీబీవీలను ఇంటర్ వరకు పొడిగించడం వల్ల ఎన్‌రోల్‌మెంట్ పెరగడంతో పాటు బాల్య వివాహాలను, డ్రాపౌట్లు అరికట్ట వచ్చని కడియం చెప్పారు. మంత్రి వెంట ఎంపీ మల్లారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని 73మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షురాలుగా సీహెచ్ భారతి (కామారెడ్డి), రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎం పద్మ (సిద్దిపేట), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి జయలక్ష్మి(హైదరాబాద్) ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 18,19 తేదీల్లో జరిగిన యూనియన్ రాష్ట్ర మహా సభలు జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా కె నర్సమ్మ(మెదక్), ప్రచార కార్యదర్శిగా త్రివేణి(ఆసిఫాబాద్), సాంస్కృతిక కార్యదర్శిగా బి కోటేశ్వరి(ఖమ్మం) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా జి జ్యోతి(పెద్దపల్లి), బి శోభారాణి(మేడ్చల్), కె సునీత(ఆదిలాబాద్), జి పద్మ (భద్రాద్రి కొత్త గూడెం), పి మంగ (సంగారెడ్డి), కవిత (వనపర్తి), ఝాన్సీ(భూపాలపల్లి), వీణ(మినీవర్కర్-మెదక్), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా హేమలత (సిద్దిపేట), మీనా(హైదరాబాద్ సౌత్), కవిత(రంగారెడ్డి), ఏకలక్ష్మి (సూర్యపేట), లలిత(నిర్మల్), వాణి(హైదరాబాద్ సెంట్రల్) ఎన్నిక య్యారు.

28 మంది భవననిర్మాణ కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 28 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మంగళవారం ఆర్థికసహాయం అందించారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురు కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.18,80,000, సహాజమరణం పొందిన 12 మంది కార్మికులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు రూ.10,70,000లు అందించారు. ఐదుగురు కార్మికుల కుమార్తెల వివాహకానుకగా 1,50,000, ఏడుగురు కార్మికులకు ప్రసూతి సహాయంగా రూ.రెండు లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డీసీఎల్ హన్మంత్‌రావు ఉన్నారు.

పైసల్ గావల్నారా..పన్జేయ్..

వైద్యానికి డబ్బులడిగితే దళిత కార్మికున్ని చావబాదిన వైనం

- అడ్డొచ్చిన తల్లిని వివస్త్రను చేసి పైశాచికానందం
- ప్రశ్నించిన మరో ఎనిమిది మంది కార్మికులపై దాడి
- 16 గంటల పనికి రూ.16.50...ఆపై చిత్ర హింసలు
- కరీంనగర్‌లో ఇటుక బట్టీ యజమాని దౌర్జన్యం



నవతెలంగాణ-కరీంనగర్ ప్రతినిధి

"మిజాజ్ సహి నహీహై. కామ్ నహీ కర్ సక్తా. పైసే దియేంగేతో దవా లాలుంగా..." అంటూ దళిత కార్మికుడు దీనంగా డబ్బులు అడిగితే..."పైసల్ గావల్నారా? మూసుకుని పన్జేయిరా లం...కొడకా...." అంటూ ఇటుక బట్టీ యజమాని దుర్భాషలాడాడు. తన అనుచరులతో కొట్టించాడు. అడ్డొచ్చిన కార్మికుని తల్లిని వివస్త్రను చేసి పైశాచికానందం పొందాడు. ప్రశ్నించిన ఎనిమిది మంది కార్మికులనూ చితకబాదించాడు. కరీంనగర్ జిల్లా కేంద్రం శివారులోని చింతకుంట వీబీఐ ఇటుకల బట్టీలో నెలన్నర కింద జరిగిన ఈ ఘటన దళిత సంఘాల దృష్టికి వెళ్లింది. దళిత సంఘాల ఫిర్యాదుతో బట్టీలో అధికారులు తనిఖీ చేయబోతున్నారన్న సమాచారం తెలుసుకుని యజమాని బాధితులను వేరే బట్టీకి తరలించాడు. అక్కడా కార్మికులు చిత్రహింసలకు గురయ్యారు. కొందరి సహాయంతో బాధితులు మంగళవారం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఒడిశా రాష్ట్రానికి చెందిన 14 మంది కార్మికులను (మూడు కుటుంబాలు)కరీంనగర్ శివారులోని వీబీఐ ఇటుకల బట్టీ యజమాని చింతకుంట నారాయణరావు పనికి కుదుర్చుకున్నాడు. ఆ 14 మందికి అన్నం పెట్టి పది నెలలకుగానూ అందరికీ కలిపి రూ.70 ఇచ్చేటట్టు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒక్కో కార్మికునికి చూసినట్టయితే పది నెలలకు లభించేది కేవలం ఐదు వేల రూపాయలే. ప్రతి రోజుకు లెక్కగడితే సగటున దక్కే కూలి రూ.16.50యే. ప్రతి రోజూ యజమాని 12 గంటల నుంచి 16 గంటలు పని చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నాడు. నొప్పొచ్చినా..జ్వరమొచ్చినా సచ్చినట్టు పనిచేయాల్సిందే. గత నెల రెండో వారంలో రమేష్ మహామందా అనారోగ్యంతో పనికెళ్లలేదు. ఎందుకు వెళ్లలేదని బట్టీ యజమాని, అతని అనుచరులు కార్మికున్ని ప్రశ్నించారు. "మిజాజ్ సహి నహీహై. కామ్ నహీ కర్ సక్తా. పైసే దియేంగేతో దవా లాలుంగా..." అని జ్వరంతో బాధపడుతూ చెప్పాడు. అతని పరిస్థితిని చూసి డబ్బులివ్వాల్సింది పోయి..."పైసల్ గావాల్నారా...." అంటూ కర్ర అందుకుని చావబాదారు. అడ్డొచ్చిన తల్లిని వివస్త్రను చేసి కాళ్లతో తన్నారు. అక్కడే ఉన్న బాధితుని బావమరిది హిమామ్స్‌చుర్రా సహా మరో ఎనిమిది మంది కార్మికులు వారి దాష్టికాన్ని అడ్డుకోగా...వారందరినీ దూషిస్తూ చావబాదారు. దీంతో ఆ కార్మికులంతా లేవలేని స్థితికి చేరారు. విషయం తెలుసుకున్న ఇన్‌సాఫ్ దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు జనవరి 31న కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 2న అధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లగా... ముందే విషయం తెలుసుకున్న బట్టీ యజమాని తన అనుచరుల సహాయంతో బాధిత కార్మికులను గోదావరిఖని గంగానగర్‌లోని జీఎల్‌కే ఇటుకబట్టీకి తరలించాడు. కార్మికులంతా స్వగ్రామానికి వెళ్లారని అధికారులకు చెప్పి యజమాని తప్పించుకున్నాడు. గంగానగర్‌లోనూ ఇటుక బట్టీ యజమాని సతీష్‌కుమార్ సహా అతని అనుచరులు ఆ కార్మికులను చిత్రహింసలకు గురిచేశారు. దీంతో మరోమారు బాధిత కార్మికులు సంఘం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి కార్మికులను విడిపించారు. అక్కడ్నుంచి నేరుగా కరీంనగర్ చేరుకున్న బాధితులు మంగళవారం కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బందీలుగా ఐదు వేల మంది వలస కార్మికులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 260 ఇటుక బట్టీల్లో ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఐదు వేల మంది కార్మికులు చిత్రహింసల నడుమ పనిచేస్తున్నారు. అక్కడ పనిలేక పొట్టచేతపట్టుకుని వచ్చి ఇక్కడ బట్టీల యజమానుల చేతుల్లో బందీలుగా మారుతున్నారు. పనిలోకి తీసుకొచ్చే సమయంలో జంటకు నెలకు రూ.15వేల నుంచి రూ.25వేలు ఇస్తామని బ్రోకర్లు నమ్మించి తీసుకొస్తున్నారు. కార్మికులను తీసుకొచ్చినందుకుగానూ బ్రోకర్లు రూ.50 వేల వరకు బట్టీల యజమానుల నుంచి తీసుకుంటున్నారు. వెయ్యి ఇటుకల తయారీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రూ.264 చెల్లించాలి. కానీ, చాలాబట్టీల్లో అందులో సగం లేదా అంత కంటే తక్కువ ఇస్తున్నారు. కుటుంబాల లెక్కన గుత్తగా మాట్లాడుకుని పనిలో కుదుర్చుతున్నారు. అనేక బట్టీల్లో రెండు, మూడు కుటుంబాలకు పది నెలలకు రూ.70వేల నుంచి రూ.90వేల ప్యాకేజీతో పనిలో పెట్టుకుంటున్నారు. వీటికి తోడు 16గంటలు పని చేయాల్సి వస్తోంది. అయినా వేతనాలు సరిగా ఇవ్వరు. నిలదీస్తే అంతే సంగతులు. కాళ్లతో తన్నడం... కర్రలతో చితకబాదడం లాంటివి చేస్తున్నారు. వేధింపులు తట్టుకోలేక పారిపోయిన వారిని పట్టుకొచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఇటుక బట్టీలు జనావాసాలకు దూరంగా ఉండడంతో బట్టీల్లో జరుగుతున్న ఆగడాలు వెలుగులోకి రావట్లేదు.

చట్టాలు అమలు చేయాలి : మార్వాడి సుదర్శన్, ఇన్‌సాఫ్ దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వలస కార్మికులకు గుర్తింపుకార్డులివ్వాలి. చట్టం అమలు చేయాలి. 8గంటల పని విధానాన్ని అమలు చేయాలి. పిల్లలకు పాఠశాల నడపాలి. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అధికారుల నిఘాలేకే కార్మికుల మానప్రాణాలకు రక్షణ కరువైంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిత్యకృత్యం..




- పెద్దపల్లి జిల్లా బేగంపేటలోని ఎమ్‌బీఎన్, ఎంఎంఎస్ బట్టీలో పని చేస్తున్న వివాహిత మీనాదీప్(24) ఏడాది కింద అదృశ్యమైంది. ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటివరకు ఆమె ఆచూకీ లేదు.
- 2016 ఫిబ్రవరిలో పెద్దపల్లి జిల్లా రాఘవపూర్‌లో ఏబీసీ ఇసుక బట్టీల ఆవరణలో బాలిక(15)పై యజమాని లైంగికదాడి చేశాడు.
- రెండేండ్ల కింద పెద్దపల్లి జిల్లాలోనే తన పిల్లాడికి పాలు ఇస్తున్న ఓ మహిళను కడుపుపై తన్నడంతో ఆమె చనిపోయిందని... యజమానిని ఎదిరించినందుకుగాను ఇద్దరు యువకులు కెనాల్‌లో శవాలుగా తేలారన్న ఘటన సంచలనం రేపింది. వారు అడవిపంది వేటకు వెళ్లి చనిపోయారన్నట్టుగా కేసు మూయించారన్న ఆరోపణలున్నాయి.
- గతంలో హత్యకు గురైన ఇటుక బట్టీల కార్మికుతే లబోపాత్ర, కమల్‌కాంత్ గెహరి, సుఖాంత్ మాంజీ, సూర్జోబాగ్, అన్లగౌడ్ కేసులు ఇంకా నానుతూనే ఉన్నాయి.
- పెద్దపల్లి శివారులోని మరో ఇటుకబట్టీలో ఏడాదిన్నర కింద అనారోగ్యంతో గర్భిణిని పనికి రాలేదని యజమాని, అతని అనుచరులు కాళ్లతో కడుపులో తన్నారు. ఆ దెబ్బలతో ఆమె గర్భం పోయింది.

ఆదుకుని ఇంటికి పంపండి..: బాధిత కార్మికులు



పూట గడవటమే కష్టంగా ఉంది. గణేష్ సర్దార్ వచ్చి పది నెలలు పని చేస్తే 14 మంది (మూడు కుటుంబాలు) కలిపి రూ. 70వేలు ఇస్తామన్నాడు. నారాయణరావు దగ్గర పనికి కుదిర్చాడు. ఐదునెలలుగా పని చేస్తున్నాం. నారాయణరావు మనుషులు ఇష్టం వచ్చినట్టు చితకబాదారు. రోగం వచ్చినా పని చేయాలని నోటికొచ్చినట్టు తిట్టారు. దెబ్బలతో లేవలేని పరిస్థితిలో గోదావరిఖనికి పంపారు. మమ్మల్ని ఆదుకుని ఇంటికి పంపండి.

కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి



ఘటనలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారు. తరువాత మరిచిపోతున్నారు. ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

దళిత విద్యార్థుల పట్ల వివక్ష సరికాదు: టీమాస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బీజేపీ పాలిత హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని కులులో దళిత విద్యార్థుల పట్ల వివక్ష చూపిన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని టీమాస్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు టీమాస్ ఫోరం రాష్ట్ర చైర్మెన్ కంచ ఐలయ్య, కన్వీనర్ జాన్‌వెస్లీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు గద్దర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చిన దళిత విద్యార్థులను అందరితో కలిసి కూర్చోనివ్వకుండా గుర్రాల పాకలో కూర్చోబెట్టడం సిగ్గుచేటని అన్నారు. మధ్యాహ్నభోజన సమయంలోనూ దళిత విద్యార్థులను అందరితో కూర్చోనివ్వకుండా వివక్షకు గురిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజన్ భరద్వాజ్‌ను వెంటనే విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళను లైంగికంగా వేధించారనీ అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమాఖండూపై, యువతిపై యాసిడ్ దాడిచేసిన మధ్యప్రదేశ్ రాజ్య సిలైకళా మండల్ వైస్ చైర్మెన్ రాజేంద్ర నాందేవ్‌పై ఫిర్యాదులు వచ్చాయనీ, వారిని వెంటనే భర్తరఫ్ చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి దేశంలో దళితులపై అనేక రకాలుగా వివక్షతలు, దాడులు పెరిగి పోయాయని వారు విమర్శించారు.

టీఆర్టీ హాల్‌టికెట్ల జారీకి అంతరాయం

- అభ్యర్థులకు దగ్గర్లోనే పరీక్షా కేంద్రాలు
- కొత్తవి తీసుకోవాలన్న టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు హాల్‌టికెట్ల జారీ ప్రక్రియలో అంతరాయం ఏర్పడింది. దూరప్రాంతాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలకు కేటాయించారని కొందరు అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన టీఎస్‌పీఎస్సీ అధికారులు అభ్యర్థులకు దగ్గర్లోనే పరీక్షా కేంద్రాలను కేటాయిస్తామని ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులకు దగ్గర్లోని జిల్లాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలను కేటాయిస్తామని తెలిపారు. ఇప్పటికే హాల్‌టికెట్లు తీసుకున్న అభ్యర్థులు కొత్తవి మళ్లీ తీసుకోవాలని సూచించారు. త్వరలోనే అభ్యర్థులందరికీ కొత్త హాల్‌టికెట్లు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అభ్యర్థులు కొత్త హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 24 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు టీఆర్టీ రాతపరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

ఆ పర్యటన అపురూపం...

జీవితంలో ఏది సాధించాలని వున్న దానికి ఒక చక్కని ఆలోచన, ప్రణాళిక ఎంతో ఉపకరిస్తాయి. నేను మా శ్రీవారు, మా అమ్మాయి, అల్లుడు గారు కలసి బాల్కన్ మౌంటెన్స్ సదరన్ ఈస్టర్న్ యూరప్‌లో వున్న దేశాల్ని చూడాలని ప్లాన్ చేశాం. హైదారాబాద్ నుండి పారిస్, పారిస్ నుండి సోఫియా (బల్గేరియా), రుమేనియా, సర్బియా సర్‌జీవో, మెసడోనియా, అల్బేనియా, మాల్‌దోవా (మెసపటోమియా) దేశాన్ని చూడడానికి బయల్దేరాం. ఆరు నెలల ముందు ఈ టికెట్స్ బుక్ చేసుకున్నాం. 29,000 రూపాయలకు టికెట్ బుక్ చేసుకున్నాం. సోఫియాలో దిగగానే మేం ఒక కారుని అద్దెకి తీసుకున్నాం. 4500 కిలోమీటర్లు 20 రోజులు కారులోనే ప్రయాణం...

ఒక గంటలోపల కారు తీసుకొని సర్బియాలో బుక్ చేసుకున్న (ఏర్ బి అండ్ బి) ఎబిబి అంటే అపార్ట్‌మెంట్స్ ఇండి పెండింట్ ఇల్లు అద్దెకు తీసుకోవటమన్న మాట. ఇక్కడ డబుల్ బెడ్ రూమ్ కేవలం రెండు వేలకు దొరికింది. అది చాలా అందంగా వుంది. అందులో వంటిల్లు, వండుకొనడానికి గదులు చాలా శుభ్రంగా, పెద్దవిగా ఉన్నాయి. మేం ఆ ఇంటిలో చల్లని ఎ.సి. రూమ్‌లో పప్పు అన్నం వండుకొని వేడి వేడిగా తింటుంటే ఆ రుచియేవేరు డబ్బును ఆదా చేసుకోవచ్చు ఆరోగ్యం కూడా పాడవదు. సాయంత్రం నాలుగు గంటలకు సోఫియా సిటీ చూడడానికి కారులో బయల్దేరాం. సిటీ మధ్యలో (ట్రామ్) ట్రైన్ తిరుగుతుంది. రోడ్డుమీద గిటారు వాయిస్తున్న వాయిద్యకారుని సంగీతం వింటూ ఆ పట్టణ అందాల్ని తిలకిస్తూ 5 కి.మీ నడిచాం. రోడ్డు మధ్యలో పూల కుండీలు, కూర్చోవడానికి బెంచీలు వున్నాయి. రోడ్డుకి ఇరువైపులా అంగళ్ళు (షాప్స్) వున్నాయి. అవి తిలకిస్తూ అక్కడే వున్న బల్గేరియా చర్చికి వెళ్ళాం. చర్చిలో షారుఖ్‌ఖాన్ సినిమా సూట్ చేశారు. చాలా పురాతనమైన చర్చి చాలా పెద్ద గా ఉంది. "చమక్ చలో" టైటిల్ సాంగ్ కోసం ఈ చర్చి ముందు షూటింగ్ జరిగింది.

ఈ చర్చి బల్గేరియన్ ఆర్థడాక్స్ చర్చి 6.7 మిలియన్స్ బల్గేరియన్స్ వున్నారు. ఇందులో 85 శాతం బల్గేరియన్స్ చర్చి కి చెందిన వాళ్ళని రిజిష్టర్ చేసుకున్నారు. ఈ చర్చి 1500 సంవత్సరాల వెనక సెంట్ అలెగ్జాండర్ నేవిస్‌కీ కట్టారు. ఈ చర్చి గోపురాలు బంగారు రంగుతో మెరుస్తున్నాయి. ఆర్కిటెక్చర్ చాలా అందంగా వుంది. ఆ కాలంలో ఇంత అందమైన చర్చి కట్టారని అబ్బురపడిపోయాను. లోపల కూడా చాలా బాగా వుంది. రెప్పవాల్చకుండా ఆ అద్భుతమైన చారిత్రక చర్చిని కనులార తిలకించి తిరుగు ముఖంపట్టాం.



రాత్రి రొయ్యలు, చేపలు తెచ్చుకొని ఫ్రై చేసుకొని తిన్నాం. తర్వాత రోజు మరికొన్ని చర్చిలు చూసి అక్కడి నుండి పోల్‌దీవ్ అనే ప్రదేశానికి బయల్దేరాం. పొద్దున పది గంటలకు బయలుదేరితే మూడు గంటలకు చేరుకున్నాం. అక్కడ 1500 రూపాయలకు ఎయిర్ బిబిలో బుక్ చేసుకున్న ఇంట్లో దిగాం. ఈ పోల్‌దీవ్‌లో పవన్ కళ్యాణ్ పిక్చర్ అజ్ఞాతవాసి సినిమా షూటింగ్ జరిగింది.

లీగ్ ఆఫ్ కోరింధ్...

ఇది చాలా పురాతనమైన పట్టణం. ఇది రెండు నుండి 13 వ శతాబ్దంలో ఏర్పడింది. వోల్గా, కామ నదులు ప్రవహిస్తున్నాయి. ఇది ఏడు కొండల మధ్యన కట్టిన పట్టణం. ఓడియన్ ఆఫ్ పిలిప్పొ పోలీస్ థియేటర్ ఆఫ్ ఫిలిప్పు. ఇది రోమన్ చక్రవర్తి కాలంలో కట్టిన అతి పురాతనమైన స్టేడియం. ఆరు వేల మంది కూర్చుని తిలకించడానికి ఈ స్టేడియం (థియేటరు) కట్టారు. ఇది (ఎడిజడ్) రెండవ శతాబ్దంలో కట్టిన అతి పురాతనమైన సుందరమైన కట్టడం. పోల్‌దీవ్ 6000 బి.సి నాటి పట్టణం. ఇది ఫిలిప్ మెసెడోనియా రాజు ఈ పట్టణానికి ఫిలిపోలిస్ అనే పేరు పెట్టాడు. (346బిసి) కాలంలో ఈ రాజు గారు (గ్రేట్ ఎంపరర్) అలెగ్జాండర్ తండ్రి ఈ రాజుగారు ఏథెన్స్‌ని, తేబ్స్‌ని కథోనియా అనే యుద్ధంలో ఈ ప్రదేశాన్ని గెలుచుకొన్నారు. దీనినే గ్రీకు రాజ్యంలో లీగ్ ఆఫ్ కోరింధ్ అంటారు.

దీన్ని దజామ్‌బాజ్, టాక్సిమ్ తేపె అనే కొండల మధ్యన ట్రేయాన్ అనే రాజుగారు కట్టారు. దీన్ని మార్బుల్ రాతితో కట్టారు. ఇది మొత్తం తెల్లటి స్తంబాలతో గ్రీకు నాగరికత ఉట్టిపడేటట్టుగా నిర్మించారు. ఆ కాలంలో కట్టిన గదులు, గదులబైట వరండాలు చాలా పెద్ద పెద్ద స్తంభాలతో ఆర్చిలాగ కట్టారు. ఆ గదులని దాటి కొద్దిగా కింది భాగంలో స్టేడియంలాంటి నిర్మాణం కనిపిస్తుంది. చుట్టూ అర్ధ చంద్రాకారంలో వున్న మెట్లు ఈ మెట్లమీద కూర్చొని ఆనాటి ప్రదర్శనని తిలకించేవారు. రెండవ శతాబ్దం నాటి మహాఅద్భుతమైన కట్టడాన్ని చూసి సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాను. అక్కడే ఒక అరగంట కూర్చొని ఆనాటి విశేషాలను నెమరువేసుకొని ఆ పురాతన పట్టణ వైభవాన్ని చూడడానికి బయల్దేరాం. ఈ ప్రాంగణమంతా అలనాటి రాతి పలకలతో వీధులన్నీ పరచివున్నాయి. ఏడు అడుగుల వెడల్పుతో లోపలి వీధులు, పక్కన చిన్న కాలువలలో మురికినీరు పోవడానికి డ్రైనేజి సిస్టమ్ ఎంతో చక్కటి ప్రణాళికతో కట్టారు. అలా నడుస్తూ ఉంటే దారి పొడవునా పెద్ద పెద్ద భవంతులు రాతి కట్టడంతో కట్టి వున్నాయి. అవి తిలకిస్తూ ఒక చోట నాలుగు అంతస్థుల భవనానికి పై నుండి కింది వరకు పెయింటింగ్స్ వేసి వున్నాయి. అక్కడ ఫోటో దిగి అక్కడున్న అన్నీ పురాతనమైన వీధులలో మూడు కోడిగుడ్లు పెద్ద రాతితో చేసిన గుడ్లు వాటికి రంగు వేసి ఒక పళ్ళెం ఆకారంలో వున్న రాతి పళ్ళెంలో అందంగా ఉంచారు.

లిటిల్ పారిస్...

అదే రోజూ మేం 13 కి.మీ. నడిచాం. కాని అలసట అనేది తెలియలేదు. ఎందుకంటే "ఆకలుండదు దాహ ముండదు" నిన్ను చూస్తుంటే అని ఆనందంగా పాడుతూ ఆ వీధులన్నీ తిరిగాం. ఒక చోట లోహంతో తయారు చేసిన బొమ్మ అరుగుమీద కూర్చుని వుంది. ఆ బొమ్మ చెవిలో మన కోరిక చెబితే ఆ కోరిక నెర వేరుతుందట. నేను ఆ చెవిలో నా కోరిక చెప్పాను. ఎన్నో అందమైన చెట్లతో ఫౌంటెన్స్‌తో ఎంతో అందమైన స్థలంలో ఆనాటి రాజులు తిరుగాడిన అన్ని స్థలాలు చూస్తూ చికెన్‌తో చేసిన రోటీ వేడి వేడిగా తిన్నాం. పురాతనమైన పోస్టాఫీస్ అన్నీ చూసాం. తర్వాతరోజు మ్యూజియం చూశాం. అక్కడి నుండి రుమేనియాకి బయల్దేరాం. ఇది 500 కి.మీ దూరం వుంది. ఆరు గంటల ప్రయాణం. పొద్దున ఆరు గంటలకు బయలుదేరితే మూడు గంటలకు చేరుకున్నాం. ఆ దారివెంట ఎంతో పెద్ద చెట్లతో అడవిని అభివృద్ధి చేశారు. ఆ ప్రాంతంలోనే బాహుబలి సినిమా కూడా షూట్ చేశారు. ఎంతో అందమైన దారి సరస్సులు, నదులు, పచ్చని చెట్లతో చాలా ఆహ్లాదకరంగా వుంది. ఆ తర్వాత రోజూ రొమానియా క్యాపిటల్ బుచారెస్ట్‌కు చేరుకున్నాం. 1,877,155 మిలియన్స్‌ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. దీన్ని (లిటిల్ పారిస్) అని కూడా అంటారు.

- నర్మదా రెడ్డి
9849018510



చరిత్ర పుస్తకం పట్టుకుంటే నేను టైమ్ మెషీన్ ఎక్కినట్టే. వందల, వేల ఏండ్ల క్రితం నాటి నాగరికత విశేషాలు, నాటి మనుషులు, వారి ఆచారాలు, వారి ఆహారం, వారి రాజకీయం... ఒకటేమిటి ప్రతీది కండ్ల ముందు చిత్రాల్లా సాగిపోతుంటాయి. అసలు ఈ భూమండలం మీదకు మనం ఎలా వచ్చాం, అడుగులు వేసుకుంటూ ఎలా నాగరిక ప్రపంచంలోకి ప్రవేశించాం.. మానవ పరిణామ క్రమం ఎలా ఉండేది ఇలా ఎన్నో ప్రశ్నలు నిత్యం నా మెదడును తొలిచేస్తూ ఉంటాయి. అందుకే ఈ సారి గుజరాత్‌కు ప్రయాణం కట్టాను. చరిత్రలోకి వెళ్లటానికి ఇదో ప్రయత్నం. అదెలాగా అంటారా? అయితే నాతో పాటు నాలుగు అడుగులు మీరు వేయాల్సిందే.

మట్టి పొరల్లో 'మహా' చరిత్ర

శిలాజ వనం...

అది గుజరాత్ రాష్ట్రం ఖేడా జిల్లాలోని రైయోలీ. మూరుమూల చిన్న పల్లెపట్టు. బాలసినోర్‌కు పక్కనే ఉంటుంది. విశాలమైన మైదాన ప్రాంతం. అహ్మదాబాద్ నుంచి గంటన్నర ప్రయాణం. 1980 ల్లో ఓ యాదృచ్ఛిక సంఘటన జరిగింది. ఖనిజ సంపద పుష్కలంగా ఉండే ఈ ప్రాంతంలో జియోలాజిస్ట్‌లు సాధారణ తవ్వకాలు చేస్తుంటే ఓ అద్భుతం ఆ మట్టి పొరల్లో బయటపడింది. గుడ్లు, ఎముకల శిలాజాలు కనిపించాయి. వాటి గురించి పరిశోధన చేస్తే ఈ చిన్ని గ్రామం లక్షల సంవత్సరాల క్రితం రాకాసి బల్లులకు అడ్డా అనే విషయం తెలిసి నోరెళ్లబెట్టారు పరిశోధకులు. ప్రపంచంలోనే డైనోసార్లు సంచరించిన ప్రధాన ప్రాంతాల్లో బాలసినోర్ మూడోవది. ఎక్కడెక్కడి నుంచో రాకాసి బల్లులు గుడ్లు పెట్టడానికి ఇక్కడకు తరలి వచ్చేవట. నదుల ప్రవాహం, అవి మోసుకు వచ్చే తేలికపాటి మట్టి రేణువులతో బాలాసినోర్ చుట్టుపక్కల నేల గుడ్లు పొదగటానికి, రక్షణకు అనుకూలంగా ఉండేదట. అందుకే కాబోలు ఒకటో రెండో కాదు టైరానోసారస్, మెగాలోసారస్, టిటానోసారస్ వంటి ఏడు రకాల డైనోసార్లు ఈ మట్టి పైనే తిరుగాడాయి. దాదాపు వెయ్యి వరకు డైనోసార్ల గుడ్ల శిలాజాలు లభించాయని విని బుజ్జి బుజ్జి డైనోసార్లు ఎంత ముచ్చటగా ఇక్కడ తిరిగాడాయో కదా అనుకున్నా. అందుకే బాలసినోర్‌ను శిలాజ వనంగా కూడా పిలుస్తారు. దాదాపు వంద మిలియన్ సంవత్సరాల వరకు ఈ ప్రాంతం అరుదైన డైనోసార్‌లకు ఆవాసంగా విరాజిల్లింది.

అరేబియా సముద్రం, నర్మద నదీ పరివాహక ప్రాంతంలో వందల సంఖ్యలో రాకాసి బల్లుల గుడ్లు, ఎముకలు, వెన్నెపూస, కడుపులో భాగాలు, తల ఇలా... ఎన్నో అవశేషాలు బయటపడ్డాయి. ఓ రాయి మీద పొడవాటి వెన్నుముక అచ్చు, గుడ్డు శిలాజాన్ని రాతి నుంచి తీసివేయగా మిగిలిన గుడ్డు ఆకారపు గుంటలు సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. రెండు డైనోసార్లు పక్క పక్కనే పడి సమాధి అయిన ఆనవాళ్ళు ఉన్నాయి. 65 మిలియన్ ఏండ్ల క్రితం అరేబియా సముద్రం నుంచి వచ్చిన భీకర వరదలు, అగ్నిపర్వత పేలుళ్ళతో ఈ జాతి పూర్తిగా అంతరించిందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ఫాజిల్స్‌ను జాగ్రత్తగా సేకరించి మ్యూజియంలో భద్రపరిచే ఏర్పాట్లు చేస్తున్నారు. డైనోసార్ల ప్రాంతం అని చూడగానే అర్థం కావటానికి, అనుభూతి చెందటానికేమో ఓ పెద్ద డైనోసార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు ఇక్కడ. నోరు తెరిచి గాండ్రిస్తున్నట్లు ఉన్న డైనోసార్ పక్కన ఫోటోలు దిగటానికి పర్యాటకులు ఆసక్తి చూపిస్తూ ఉన్నారు.

హరప్పా సంస్కృతి...

బాలసినోర్ తర్వాత లోథల్ దిశగా ప్రయాణం అయ్యాను. ప్రస్తుతం అహ్మదాబాద్ జిల్లాలోని ఢోల్కా తాలూకాలో ఉంది. ఇది కూడా మట్టి పొరల్లో బయటపడిన చారిత్రక ప్రాంతమే. ప్రపంచంలోని ప్రాచీన నాగరికత అవశేషాల్లో ఇది ఒకటి. ఇక్కడి శిథిలాలను చూస్తుంటే నాకు అచ్చం చరిత్ర పుటలను తిరగేసినట్లే అనిపించింది. మానవ నాగరికత మొగ్గతొడిగిన తొలి ప్రాంతాల్లో లోథల్ ఒకటి. క్రీస్తు పూర్వం 2400 సంవత్సరం నాటి హరప్పా సంస్కృతి బయటపడిన ప్రాంతాలు గుజరాత్ రాష్ట్రంలో చాలా ఉన్నాయి. ధోలవీర, గోలా ధోరో, లోటేశ్వర్, రంగపూర్, సర్కోటాడా నాటి ఇతర ముఖ్య పట్టణాలు. సింధూ నాగరికతనే హరప్పా-మొహంజోదారో నాగరికత అని కూడా అంటారు. భారత పశ్చిమ భాగంలోని సింధ్ ప్రాంతంలో ఈ నాగరికతకు మెసపొటోమియా, ప్రాచీన ఈజిప్ట్ నాగరికతలు సమకాలీన నాగరికతలు. సింధు నాగరికత వికసించిన ప్రాంతం లోథల్. లోథల్ అంటే గుజరాతీ భాషలో మతుల దిబ్బ అని అర్థం. దీన్ని ప్రపంచంలోనే తొలి ఓడల రేవుగా చరిత్రకారులు పరిగణిస్తారు. హరప్పా ప్రజల నిర్మాణ కౌశల అద్భుతానికి, ఇంజనీరింగ్ నైపుణ్యానికి లోథల్ నిలువెత్తు సంతకం. 1954లో ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జరిపిన తవ్వకాల్లో ఈ నగరం బయటపడింది.

అహ్మదాబాద్ నుంచి 85 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ నగరం అప్పట్లో వ్యాపారానికి కేంద్ర బిందువుగా ప్రసిద్ధి చెందింది. ఎండిన ఇటుకలతో పక్కాగా నిర్మించిన గోడల నిర్మాణం అద్భుతమే. వేల ఏండ్ల క్రితమే భూగర్భ డ్రైనేజీని హరప్పా ప్రజలు నిర్మించుకుని ఉపయోగించిన విధానం... చూసి ఆశ్చర్యపోవటం మన వంతు అవుతుంది. లోథల్ పట్టణం ప్రధానంగా రెండు భాగాలుగా



విడిపోయి ఉంది. ధనవంతులు, పాలకులు ఉండే ఇండ్లు ఒక వైపు ఉన్నాయి. వీటిలో కొన్ని రెండంతస్తుల భవనాలు కూడా ఉన్నాయి. ఇక మరో భాగంలో సాధారణ ప్రజలు నివసించిన చిన్న పాటి ఇండ్ల నిర్మాణం కనిపిస్తుంది. నది నుంచి వరదలు ముంచెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు హరప్పా ప్రజలు చేపట్టారు.

గట్టి గోడలను నిర్మించటమే కాకుండా ఇండ్లు, షాపులను భూమి నుంచి మూడడుగుల ఎత్తున నిర్మించారు. అందుకే ఇప్పటికీ అంత భద్రంగా మనకు కనిపిస్తున్నాయి.





ఇటుకలతో నిర్మించిన ఓడ రేవు...

హైటెక్, టెక్నాలజీ అని మనం తెగ సంబర పడిపోతుంటాం కాని, వేల సంవత్సరాల క్రితమే సింధు ప్రజలు ఓడ రేవు నిర్మించుకున్నారు. ఇటుకలతో నిర్మించిన ఓడ రేవు శిథిలాలు ఇప్పటికీ ఉన్నాయి. నౌకలు ఆగటానికి సముద్ర ఆటుపోట్ల ప్రభావం పడకుండా వ్యూహాత్మక డాక్ యార్డ్‌నూ వీరు నిర్మించారు.




అంతే కాదు ఓడల ద్వారా వస్తువులు పెద్ద ఎత్తున ఎగుమతి, దిగుమతి అవుతుంటాయి కదా వాటిని భద్రపరచటానికి అప్పట్లోనే సింధూ ప్రజల వేర్ హౌస్‌లు కట్టుకున్నారు. అది కూడా భూమి నుంచి మూడున్నర మీటర్ల ఎత్తున కట్టారు. వారి దూర దష్టికి ఈ నిర్మాణాలు నిదర్శనం. సబర్మతి నది ద్వారా సింధూ నాగరికతకు చెందిన ఇతర పట్టణాలకు కూడా వ్యాపారం జరిగేది. మరో వైపు అంతర్జాతీయ వ్యాపారం చేసేవారు సింధూ ప్రజలు. ఇక్కడి నుంచి మెసపొటోమియా, ఈజిప్ట్, పర్షియా వంటి దేశాలకు వ్యాపార లావాదేవీలు జరిగేవి. ఇరాక్ దేశస్తులు వాడిన ముద్రలు, ఇతర వస్తువులు తవ్వకాల్లో బయటపడ్డాయి. లోథల్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. ఓడ రేవు, అంతర్జాతీయ వ్యాపారం జరిగేదంటే సహజంగా పారిశ్రామిక వాతావరణం కూడా ఉండొచ్చని అంచనా వేయవచ్చు.

పూసలకు కేంద్రం లోథల్...

లోథల్‌లో పూసల పరిశ్రమలు ఉండేవన్న విషయంలో ఇక్కడి తవ్వకాల్లో దొరికిన ఆధారాలతో చరిత్రకారులు తేల్చారు. ముఖ్యంగా ఆభరణాల్లో పూసలకు అప్పట్లో ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. పూసల పరిశ్రమకు లోథల్ కేంద్రంగా ఉండేది. ఇక్కడి మట్టిపొరల్లో సింధూ ప్రజల మత దేహాలు కూడా బయటపడ్డాయి. రెండు మత దేహాలు ఒకే సమాధిలో కలిసి కనిపించటంతో సతీసహగమనం జరిగేదని కొంత మంది చరిత్ర కారుల అంచనా. ఈ ప్రాంతంలో బయటపడిన హరప్పా ప్రజలు ఉపయోగించిన అలంకరణ, వంట సామాగ్రి, టెర్రాకోట వస్తువులు, అన్నింటిని భద్రపరచటానికి 1976 లో మ్యూజియం ఏర్పాటు చేశారు. కాలం ఏదైనా ఆడవారిని, అలంకరణను విడదీసి చూడలేమేమో అనిపించింది. మ్యూజియమ్‌లోని కొన్ని వస్తువులను చూసిన తర్వాత. సింధూ మహిళలు అందాలకు మెరుగులు దిద్దటానికి ఉపయోగించిన అద్దాలు, కాటుక డిబ్బి, పెదాలకు లిప్‌స్టిక్ పూతలాంటి రంగులు వేసుకునే వారు. వారు ఉపయోగించిన పూసల దండలు, ఆభరణాల డిజైన్లు ఇప్పటికీ ట్రెండ్ స్వెటర్లు. ధాన్యం దాయటానికి ఉపయోగించిన మట్టి కుండలు, రకరకాల పాత్ర, పని ముట్లు, శిలలు, వ్యాపారంలో ఉపయోగించే సీళ్లు వంటివి కూడా ఈ మ్యూజియంలో భద్రపరిచి ఉన్నాయి. అయితే ఈ మ్యూజి యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీని నిషేధం కావటం వల్ల కెమెరాలు క్లిక్ మని పించే అవకాశం దొరకలేదు. ప్రపంచంలోని అత్యంత సజనాత్మక నగరాల్లో లోథల్ ఒకటి అని ముక్తాయిం చటం సమంజసంగానే ఉంటుందనుకుంటాం.

- రెహనా
9492527352



అది ఒక పర్వత ప్రాంతం. సుందరమైన వాతావరణం, చుట్టూ పచ్చటి కొండలు, అందమైన సరస్సులు, అద్భుతంగా నిర్మించిన కోటలు, అనేక ధార్మిక కేంద్రాలకు ప్రసిద్ధి చెందినది రాజస్థాన్ లోని సిరోహి జిల్లాలో గల 'మౌంట్ అబూ' ఇదొక వేసవి విడిది కేంద్రం. ఇది ఆరావళి పర్వత శ్రేణుల లోని ఎత్తైన శిఖరం. 1220 మీటర్ల ఎత్తులో ఉంటుంది. మౌంట్ అబూ ప్రముఖ చరిత్ర, పురాతన ప్రాంతాలకు, ప్రశాంతమైన వాతావరణానికి నెలవు. ఇన్ని విశిష్టతలు ఉండటం వల్ల రాజస్థాన్ రాష్ట్రంలో ప్రముఖం పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది.

ప్రధానంగా వేసవి కాలంలో, వాన కాలంలో పర్యాటకులు ఎక్కువగా మౌంట్ అబూను సందర్శిస్తుంటారు. మౌంట్ అబూ తో పాటు చూడదగిన ప్రదేశాలు చుట్టూ చాలా ఉన్నాయి. వాటిలో నక్కి సరస్సు, సన్సెట్ పాయింట్. టోడ్ రాక్, ది గురు శిఖర్ పీక్, మౌంట్ అబూ వన్యప్రాణి అభయారణ్యం ఈ ప్రాంతంలో చూడవలసిన ప్రధాన ఆకర్షణీయ ప్రదేశాలు. మౌంట్ అబూ చేరుకోవడానికి చక్కటి రోడ్డు మార్గం, విమాన సౌకర్యం ఉన్నది. ఇక్కడి వాతావరణం సంవత్సరం పొడవునా ఆహ్లాదకరంగా ఉంటుంది. ముఖ్యంగా వేసవి కాలంలో మౌంట్ అబూను సందర్శించడం ఉత్తమం.

దాయ్ కా మహల్

మధ్య ప్రదేశ్‌లోని ధార్ జిల్లాలోని 'మండు' ప్రాంతంలో ఉన్న అతి పురాతన నగరం. రాతి విస్ఫోటనం వల్ల పురాతన నగరం ఏర్పడిందని చెబుతారు. అద్భుతమైన నిర్మాణశైలిని కలిగిన కోటలు ఇక్కడ అనేకం ఉంటాయి. దాంట్లో ఒకటి దాయ్ కా మహల్. దీన్నే నానీ ప్యాలెస్ అని కూడా పిలుస్తారు. దాయ్ అంటే అర్థం ఆయా. రాజవంశీయులు వారి పనుల మీద బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వారి పిల్లల ఆలనాపాలనా చూసుకోవడానికి ఆయాల కోసం నిర్మించిన ప్రత్యేకమైన రాతి బంగ్లా. ఇది ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రం. ఎందుకంటే ఇక్కడ ఉండే స్మారక కట్టడాలు, రాజభవనాలు సజీవంగా చెక్కుచెదరకుండా ఉన్నాయి. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మధ్య ప్రదేశ్ టూరిజం డిపార్టుమెంట్ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నది. రాష్టాల నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దాయ్ కా మహల్ కంటే దాయ్ కి చోటి బెహన్ కి మహల్ బంగ్లాలు అద్భుతమైన నిర్మాణ శైలిని కలిగి ఉన్నాయి.





ప్రకృతిలోని సహజ అందాలకు నిలయం 'గాలిబోర్' ఇది బెంగుళూరుకు 110 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇది ఆర్కావతి, కావేరి నదుల సంగమం. గాలిబోర్ కావేరి వన్య ప్రాణుల సంరక్షణాలయ అడవుల మధ్యలో కలదు. గాలిబోర్ ప్రాంతం చేపలు పట్టడానికి, నేచర్ క్యాంపులకు ప్రసిద్ధి. కావేరి నది ఒడ్డున పచ్చటి చెట్ల నడుమ ఉండే గాలిబోర్ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగి ఉంటుంది. అడవిలో ఉండే గాలిబోర్ అనే కొండ పేరును ఈ ప్రాంతానికి పెట్టారు. చుట్టూ పర్వత శ్రేణులతో నిండి ఉంటుంది. ప్రకృతిలో ఒడిలో ఒరికి సేదతీరాలనుకునే వారు సెలవులు రాగానే గాలిబోర్‌కు వెళ్తుంటారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో చేపలు పట్టి మరల అక్కడే వదిలేయాలి. మహసీర్ చేపలు ఇక్కడ ఎక్కువగా దొరుకుతాయి. దీనితో పాటు కార్ప్, క్యాట్ ఫిష్ వంటి చిన్న చేపలు కూడా ఉంటాయి. గాలిబోర్ లో సుమారు 220 పక్షుల రకాలు ఉంటాయి. పర్యాటకులు ఎక్కువగా పక్షులను, అడవి అందాలను చూడటానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ అడవిలో ఎక్కువగా సంబార్, మచ్చల జింక, ఏనుగులు, చిరుతపులులు, అడవి ఎలుగుబంట్లు, అడవి ఉడుతలు, మలబార్ ఉడుతలు, గుంట నక్కలు, కొండ చిలువలు, నాగుపాములు, వైపర్లు వంటివి ఎన్నో గాలిబోర్‌లో చూడవచ్చు. మొసళ్లు, తాబేళ్లు, ఊసరవెల్లులు పర్యాటకులను మరింత ఆశ్చర్యచకితులను చేస్తాయి. గాలిబోర్‌లో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నుంచి మే వరకు చేపలు పట్టేందుకు అనువుగా ఉంటుంది. ఈ సెలవుల్లో కుదిరితే గాలిబోర్ ను సందర్శించండి.

దక్షిణాఫ్రికా గడ్డపై సరికొత్త చరిత్ర సృష్టించేందుకు భారత జట్లు రంగం సిద్ధం చేసుకున్నాయి. జోహనెస్‌బర్గ్ టెస్టు విజయం తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగుతోన్న కోహ్లిసేన తాజాగా పొట్టి సిరీస్‌పై కన్నేసింది. వన్డేల్లో సఫారీలను చిత్తు చేసిన మన అమ్మాయిలు మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ సొంతం చేసుకోవాలనే జోరుమీదున్నారు. సఫారీ గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సాధించిన ఘనత దక్కించుకునేందుకు నేడు అమ్మాయిలు, అబ్బాయిలు సెంచూరియన్ బరిలోకి దిగుతున్నారు. భీకర ఫామ్‌లో కొనసాగుతోన్న కోహ్లిసేన, కౌర్‌సేనలను ఒత్తిడిలో ఉన్న సఫారీలు నిలువరించగలరా?

ఇక్కడే కొడతారా?


విరాట్ కోహ్లి

18
విరాట్ కోహ్లి జెర్సీ నం.18, అతడు ప్రారంభించిన కంపెనీ పేరు సైతం వన్ ఎయిట్ (18). అయితే, టీ20ల్లో 2,000 పరుగులు సాధించిన తొలి భారత క్రికెటర్‌గా నిలిచేందుకు కోహ్లి చేయాల్సిన పరుగులు సైతం సరిగ్గా 18.

- దక్షిణాఫ్రికాతో రెండో టీ20 పోరు నేడు
- సిరీస్‌పై కన్నేసిన కోహ్లిసేన
- విజయం కోసం సఫారీ తహతహ

నవతెలంగాణ-సెంచూరియన్

ఆతిథ్య జట్టును వన్డేల్లో చిత్తు చేసిన కోహ్లిసేన.. టీ20ల్లోనూ తిరుగులేని సిరీస్ విజయం సాధించాలని భావిస్తోంది. పొట్టి ఫార్మాట్‌లో మరింత శక్తివంతమైన జట్టుగా కనిపిస్తోన్న టీమ్ ఇండియా తాజా పర్యటనలో రెండో సిరీస్‌పై కన్నేసింది. టాప్ ఆర్డర్ సూపర్ ఫామ్‌కు తోడు నాణ్యమైన బౌలింగ్ బృందం అండతో భారత్ దుర్భేద్యంగా కనిపిస్తోంది. స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ సేవలను కోల్పోయిన దక్షిణాఫ్రికా.. దేశవాళీ మెరుపులతోనే అగ్ర జట్టును ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. మానసికంగా సిరీస్‌పై ఆశలు కోల్పోయినా.. నిర్ణయాత్మక మ్యాచ్ వరకైనా సిరీస్‌ను తీసుకెళ్లాలనే తపన సఫారీ శిబిరంలో కనిపిస్తోంది. మూడు మ్యాచుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం ఉన్న కోహ్లిసేన ఇక్కడే లాంఛనం ముగిస్తుందేమో చూడాలి.

ఆల్ ఈజ్ వెల్!

అన్ని విభాగాల్లోనూ అదరగొడుతున్న టీమ్ ఇండియా ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఊపుమీదున్నది. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లిలు సూపర్ ఫామ్‌లో కొనసాగుతున్నారు. కమ్ బ్యాక్ హీరో సురేశ్ రైనా తొలి మ్యాచ్‌లో దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. తనదైన శైలిలో అతడు రెచ్చిపోయినా.. నిలకడ చాటుకోలేదు. నేడు కూడా రైనా మూడోస్థానంలో వచ్చే అవకాశం ఉంది. దీంతో అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ ఆశించవచ్చు. మిడిల్ ఆర్డర్‌లో మనీశ్ పాండే, ఎం.ఎస్ ధోని ఫినీషింగ్ స్కిల్స్, హిట్టింగ్ సామర్థ్యంపై వాండరర్స్‌లో విమర్శలు వచ్చాయి. మరి, సెంచూరియన్‌లో వారు ఏం చేస్తారనేది చూడాలి. బంతితో బుమ్రా, భువిలు కండ్లుచెదిరే ఫామ్‌లో ఉన్నారు. స్పిన్నర్ చాహల్ పరుగుల పొదుపు పాటించటంపై దృష్టి పెట్టనున్నాడు.

దూకుడు చూపాలి

టీ20 సిరీస్‌కు దక్షిణాఫ్రికా ఇద్దరు అగ్రశ్రేణి ఆటగాళ్లు డివిలియర్స్, డుప్లెసిస్‌లను కోల్పోయింది. అయినా, ఈ ఫార్మాట్‌లో దేశవాళీలో మెరిసిన యువ ఆటగాళ్లు సఫారీ జట్టులో ఉన్నారు. వాండరర్స్‌లో ఒకరిద్దరి మెరుపులతో దక్షిణాఫ్రికా ఆశలు చిగురించినా.. అంతి మంగా నిరాశే ఎదురైంది. వేగంగా మార్పులు చోటుచేసుకునే ఈ ఫార్మాట్‌లో దూకుడు కీలకం. దక్షిణాఫ్రికా జట్టులో ప్రస్తుతం అదే లోపించింది. ఓపెనర్ హెండ్రిక్స్ ఫామ్ కొనసాగించాలని ఆశిస్తుండగా, కెప్టెన్ డుమిని, డెవిడ్ మిల్లర్ సీనియర్ బ్యాట్స్‌మన్ హోదాకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. ఇక బంతితో సఫారీ కొత్త అస్త్రాలతో రావాల్సిన అవసరాన్ని భారత బ్యాట్స్‌మెన్ సృష్టించారు. షార్ట్ బాల్ ప్రయోగం విఫలమైన వేళ.. నేడు సఫారీ బౌలర్ల వ్యూహం ఏ విధంగా ఉండబోతున్న దనే ఆసక్తి రేగుతోంది.

సా॥ 4.30 నుంచి అమ్మాయిల మ్యాచ్, రాత్రి 9.30 నుంచి మెన్స్ మ్యాచ్ సోనీటెన్‌లో..

స్పిన్ తిరగొద్దు!

ఇక్కడ ఆడిన టెస్టులో దక్షిణాఫ్రికా నెగ్గినా.. రెండు వన్డేల్లో చిత్తుగా ఓడింది. ఆ రెండు మ్యాచుల్లో భారత స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లు 11 వికెట్లు పడగొట్టారు. పిచ్‌పై టర్న్‌తో సఫారీ ఆటగాళ్లు తమ అసంతృప్తి వెలిబుచ్చారు. దీంతో ఆతిథ్య జట్టు సంతృప్తి పడే విధంగా పిచ్ తయారు చేసే పనిలో క్యూరేటర్ నిమగ్నమయ్యాడు. బ్యాటింగ్‌కు అనుకూలం, స్పిన్‌ను సహకరించని పిచ్‌ను నేడు ఆశించవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, విరాట్ కోహ్లి, మనీశ్ పాండే, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, జైదేవ్ ఉనద్కత్, యుజ్వేంద్ర చాహల్, జశ్‌ప్రీత్ బుమ్రా.
దక్షిణాఫ్రికా : జె.జె స్మట్స్, రీజా హెండ్రిక్స్, జెపి డుమిని, డెవిడ్ మిల్లర్, ఫర్హాన్ బెహార్డిన్, హెన్రిచ్ క్లాసెన్, క్రిస్ మోరీస్, ఫెలుక్వాయో, డానె ప్యాటర్సన్, జూనియర్ డాలా, షంషి.

- సఫారీ అమ్మాయిలతో నాల్గో టీ20 నేడు
- సిరీస్ వేటలో జోరుమీదున్న కౌర్‌సేన
- దక్షిణాఫ్రికాకు ఇది చావోరేవో

నవతెలంగాణ-సెంచూరియన్

అంతర్జాతీయ సర్క్యూట్‌లో కాస్త విరామం వచ్చినా.. లయ, ఫామ్ అందిపుచ్చుకోవటం కష్టమైన విషయం. 2017 ప్రపంచకప్ ముగిసిన తర్వాత సుమారు ఆరు మాసాలు మహిళల క్రికెట్ జట్టు మైదానంలో అడుగుపెట్టలేదు. ఇదే సమయంలో ఇతర జట్లు ద్వైపాక్షిక సిరీస్‌ల్లో బిజీగా గడిపాయి. దీంతో మన అమ్మాయిల ప్రదర్శనపై అనుమానాలు నెలకొన్నాయి. కానీ తొలి రెండు వన్డేల్లో తిరుగులేని విజయాలతో మిథాలీసేన ఔరా అనిపించింది. 2-1తో సిరీస్ సాధించి అబ్బురపరిచింది. తాజాగా పొట్టి సిరీస్‌లోనూ అదే జోరు. తొలి రెండు టీ20ల్లో మెరుపు విజయాలు సాధించి, సిరీస్‌కు చేరువైంది. హాట్రిక్ విజయం ముంగిట తడబడినా.. ఐదు మ్యాచుల సిరీస్‌లో మన అమ్మాయిలకు మంచి అవకాశం ఉంది. సఫారీ గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సాధించిన ఏకైక జట్టుగా నిలిచేందుకు మన అమ్మాయిలు మరో విజయం దూరంలోనే ఉన్నారు.

అందరూ అదుర్స్

మెన్స్ జట్టు మాదిరి మహిళల జట్టులోనూ అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులతో దిగ్గజ హోదా సాధించిన మిథాలీ రాజ్ తాజా పర్యటనలో జోరుమీదున్నది. వాండరర్స్‌కు ముందు ఆమె వరుసగా నాల్గు అర్ధ సెంచరీలు కొట్టింది. గత మ్యాచ్‌లో పరుగులేమీ చేయకున్నా.. నేడు మిథాలీరాజ్ ప్రదర్శనపై జట్టు బోలెడన్ని ఆశలు పెట్టుకున్నది. యువ ఓపెనర్ స్మృతి మంధాన ప్రతి మ్యాచ్‌లో నూ అంచనాలను అందుకుం టోంది. భారీ షాట్లతో స్టేడి యాన్ని హోరెత్తించే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వాండరర్స్‌లో వాహ్ అనిపించింది. బలమైన షాట్లతో విరుచుకుపడిన కౌర్ తృటిలో అర్ధ సెంచరీ చేజార్చు కున్నది. నేడు కూడా కౌర్ మెరిస్తే సఫారీ బౌలర్లకు ముచ్చెమటలే!. రాజేశ్వరి గైక్వాడ్, శిఖా పాండే, పూనమ్ సహా పూజ జట్టు ప్రణాళిక ప్రకారం ఆకట్టుకుం టున్నారు.

భారత్‌ను అడ్డుకోగలరా?

మూడో మ్యాచ్‌లో విజయంతో సిరీస్‌పై ఆశలు సజీవంగా నిలుపుకున్న దక్షిణాఫ్రికా.. నేటి మ్యాచ్‌లో చావోరేవో తేల్చుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా సిరీస్ కోల్పోనున్న సఫారీ అమ్మాయిలు.. ఎలాగైనా ఆఖరి మ్యాచ్ వరకూ పోరాటాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు. కెప్టెన్ నికెర్క్ మాత్రమే సఫారీ తరపున నిలకడగా ప్రదర్శన చేస్తోంది. మిగతా వాళ్లెవరూ ఆశించిన మేరకు ఆడటం లేదు. బౌలింగ్ విభాగంలో మెరుపు వేగంతో షబ్నిం అదరగొట్టినా.. ఆమె ప్రతాపం భారత లోయర్ ఆర్డర్ వరకే పరిమితమైంది. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌వుమెన్‌ను షబ్నిం ఏ మాత్రం ఇబ్బంది పెట్టలేకపోయింది. అయినా, సమష్టిగా ఆడితే భారత్‌ను నిలువరించ గలమనే విశ్వాసం సఫారీల్లో కనిపిస్తోంది.


హర్మన్‌ప్రీత్ కౌర్

తుది జట్లు (అంచనా)

భారత్ : మిథాలీ రాజ్, స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రొడ్రిగస్, వేద కృష్ణమూర్తి, అనుజ పాటిల్, శిఖా పాండే, తనీయ భాటియా, పూజ, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్.
దక్షిణాఫ్రికా : లిజెలి లీ, వాన్ నికెర్క్, సునె లుస్, డు ప్రీజ్, చొలె ట్రయాన్, నదినె డి క్లెర్క్, మరిజానె కాప్, షబ్నిం ఇస్మయిల్, మసబట లాస్, డానియెల్స్, రైసిబి.

సెంచూరియన్‌లో నేటి మధ్యాహ్నం భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తొలుత జరుగనున్న అమ్మాయిల మ్యాచ్‌తో పాటు మెన్స్ మ్యాచ్‌కూ వరుణుడు అంతరాయం కలిగించే ప్రమాదం పొంచి ఉన్నది. వర్షం తీవ్రత ఎక్కువగా ఉంటే అమ్మాయిలు కుదించిన ఓవర్ల మ్యాచ్ ఆడాల్సి రావొచ్చు.



కోహ్లి, బుమ్రా, భారత్ నెం.1

దుబాయ్ : వరుస విజయాలు, అద్భుత సెంచరీలు, కండ్లుచెదిరే బౌలింగ్ వెరసి.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ సహా భారత ఆటగాళ్లు అగ్రపథాన నిలిచారు. దక్షిణాఫ్రికాపై 5-1తో వన్డే సిరీస్ సాధించిన రికార్డు సృష్టించిన టీమ్ ఇండియా ర్యాంకింగ్స్‌లో నెం.1 స్థానానికి చేరుకున్నది. సిరీస్‌ను నెం.1 ర్యాంక్‌తో ఆరంభించిన దక్షిణాఫ్రికా మధ్యలోనే కోహ్లిసేన అగ్రపీఠం అప్పగించిన సంగతి తెలిసిందే. ఇక మూడు శతకాలు సహా 558 పరుగులతో ఓ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సాధించిన విరాట్ కోహ్లి బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంతో పాటు మరో అరుదైన ఘనత దక్కించుకున్నాడు. 909 రేటింగ్ పాయింట్లు పొందిన కోహ్లి.. ఏకకాలంలో టెస్టులు, వన్డేల్లో 900 పైచిలుకు రేటింగ్ సాధించిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. 909 రేటింగ్ పాయింట్లతో మరే భారత బ్యాట్స్‌మన్ సాధించని ఘనత వహించాడు. యార్కర్ల హీరో జశ్‌ప్రీత్ బుమ్రా బౌలర్ల జాబితాలో అగ్రస్థానానికి ఎగబాకాడు. అఫ్ఘాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్‌తో కలిసి సంయుక్తంగా నం.1 ర్యాంక్ పంచుకున్నాడు. ఐసీసీ మెన్స్ వన్డే ర్యాంకింగ్స్ చరిత్రలోనే పిన్న వయసులోనే అగ్రస్థానంలో నిలిచిన బౌలర్‌గా రషీద్ ఖాన్ (19 ఏండ్ల 153 రోజులు) నిలిచాడు. వన్డే సిరీస్‌లో మెరిసిన భారత స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లు వరుసగా 8, 15వ స్థానాల్లో నిలిచారు. సఫారీతో వన్డే సిరీస్‌లో మెరిసిన శిఖర్ ధావన్ నాల్గు స్థానాలు ఎగబాకి టాప్-10లోకి అడుగుపెట్టాడు.

రామ్‌కుమార్ ఔట్

ఫ్లోరిడా : భారత టెన్నిస్ ఆటగాడు రామ్‌కుమార్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. డెల్‌రే బీచ్ ఓపెన్ తొలి రౌండ్ లోనే నుంచే రామ్‌కుమార్ నిష్క్రమించాడు. అర్హత పోరుల్లో స్థానిక ఆటగాళ్లను సునాయసంగా చిత్తు చేసిన రామ్ కుమార్ ప్రధాన పోటీలో డొనాల్డ్ యంగ్ (అమెరికా)కు తలొగ్గాడు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రామ్‌కుమార్ 1-6, 2-6తో ఓటమి పాలయ్యాడు. డబుల్స్‌లో పేస్, పూరవ్‌ల జోడీ సహా దివిజ్ శరణ్ జోడీ నేడు ప్రీ క్వార్టర్స్‌లో ఆడనున్నారు.

సర్దార్ సారథ్యంలో..

సుల్తాన్ ఆజ్లాన్ షా కప్‌కు భారత హాకీ జట్టు

న్యూఢిల్లీ : పునరాగమనంలో సీనియర్ ఆటగాడు సర్దార్ సింగ్ భారత హాకీ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. సర్దార్ నేతృత్వంలో 18 మందితో భారత హాకీ జట్టు సుల్తాన్ ఆజ్లాన్ షా కప్‌లో పాల్గొననున్నది. హాకీ ఇండియా మంగళవారం జట్టు వివరాలు ప్రకటించింది. ఇందులో ముగ్గురు అరంగేట్ర ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. భారత్ సహా ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, ఆతిథ్య మలేసియా పాల్గొంటున్న టోర్నీ మార్చి 3 నుంచి 10 వరకు జరుగుతుంది. గత రెండు టోర్నీల్లో కుర్రాళ్లకు అవకాశమిచ్చే కారణంగా సర్దార్‌కు జట్టులో చోటు దక్కలేదు. అయితే మన్‌ప్రీత్ సింగ్ లేని వేళ అనుభవశాలి సర్దార్ సింగ్ జట్టును నడిపించటంలో సఫలమవుతాడని



కోచ్ షార్డ్ మార్జెన్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

జట్టు వివరాలు : సూరజ్ కర్కేరా, క్రిషన్ బి పాఠక్ (గోల్ కీపర్లు), అమిత్ రోహిదాస్, దిప్సన్ టిర్కీ, వరుణ్ కుమార్, సురేందర్ కుమార్, నీలం సంజీప్ జెస్, మన్‌దీప్ మోర్ (డిఫెండర్లు), ఎస్‌కే ఊతప్ప, సర్దార్ సింగ్ (కెప్టెన్), సుమిత్, నీలకంఠ శర్మ, సిమ్రన్‌జీత్ సింగ్ (మిడ్ ఫీల్డర్లు), గుర్జంత్ సింగ్, రమన్‌దీప్ సింగ్, తల్వీందర్ సింగ్, సుమిత్ కుమార్, శిలానంద్ లక్రా (ఫార్వర్డులు).

ఇకపై కోటు, ప్యాంటు

- మహిళా అథ్లెట్ల వస్త్రధారణపై ఐఓఏ నిర్ణయం



న్యూఢిల్లీ : సంప్రదాయ చీర కట్టుకు మహిళా అథ్లెట్లు ఇకపై టాటా చెప్పనున్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవ పరేడ్‌లలో చీరలకు బదులుగా కోటు (బ్లేజర్), ప్యాంటు ధరించనున్నారు. ఈ మేరకు భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) ఓ ప్రకటనలో తెలిపింది. అథ్లెట్లను సంప్రదించిన తరువాతే ఈ నిర్ణయానికి వచ్చామని ఐఓఏ అధికారులు వెల్లడించారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరుగనున్న గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్‌కు మహిళా అథ్లెట్లు కోటు, ప్యాంటుతో హాజరవనున్నారు. ఐఓఏ అథ్లెట్ల కమీషన్ ప్రధానాధికారి మలావ్ ష్రాఫ్ తాజా నిర్ణయాన్ని స్వాగతించారు. ఐఓఏ అధ్యక్షుడు నరీందర్ బాత్రాకు రాసిన లేఖలో.. 'క్రీడోత్సవాల ఆరంభ, ముగింపు వేడుకలలో ధరించే వస్త్రాలు (చీరలు) మహిళా అథ్లెట్లకు అసౌకర్యంగా ఉంటున్నాయి. వారి సౌకర్యం కొరకు వస్త్రధారణలో మార్పు చేయటం అభినందనీయం.' అని ష్రాఫ్ పేర్కొన్నారు. షూటర్ హీనా సిధు మాట్లాడుతూ 'మాలో చాలా మందికి చీర కట్టుకోవటం తెలీదు. కోటు, ప్యాంటు ధరించటం వల్ల సమయం ఆదా అవటమే కాక సౌకర్యంగానూ ఉంటుంది. ప్యాంటుకు బదులు స్కర్టులైతే మరీ మంచిది' అని తెలిపింది.

పతకం రంగు మారుస్తా!

ఒలింపిక్ స్వర్ణ పతకమే లక్ష్యమన్న పివి సింధు



ముంబయి : టోక్యో ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించటమే తన లక్ష్యమని తెలుగు తేజం పి.వి సింధు అన్నది. పతకం రంగు రజతం నుంచి స్వర్ణానికి మార్చుకోగలనన్న ధీమా వ్యక్తం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన ఓ ప్రమోషనల్ కార్యక్రమంలో పాల్గొన్న సింధు 'వచ్చే ఒలింపిక్స్‌లో నా మెడల్‌ను బంగారు రంగులోకి మార్చాలనుకుంటున్నా. అదే నా కల, దాన్ని కచ్చితంగా సాకారం చేసుకొని తీరతాను. ఈ ఏడాది సవాలుతో కూడినది. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ సహా ప్రతిష్టాత్మక కామన్‌వెల్త్ గేమ్స్, ఏషియన్ గేమ్స్‌కు సిద్ధమవుతున్నా. షెడ్యూలు క్లిష్టంగా ఉన్నది. అయినప్పటికీ ఒకసారి ఒక టోర్నమెంట్‌లో మాత్రమే పాల్గొంటా. ఏడాది ముగిసే సరికి నన్ను నేను నెంబర్ వన్ స్థానంలో చూసుకోవాలన్నదే ధ్యేయం.' అని వివరించింది.

కామన్‌వెల్త్‌కు షట్లర్లు సిద్ధం

గోల్డ్ కోస్ట్ కామన్‌వెల్త్ గేమ్స్‌కు భారత షట్లర్ల జాబితా విడుదలైంది. హెచ్‌ఎస్ ప్రణయ్, చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్, ప్రణవ్ జెర్రీ చోప్రాలున్న పరుషుల జట్టు కిదాంబి నేతృత్వంలో బరిలో దిగనుండగా, మహిళల జట్టును పివి సింధు నడిపించనున్నది. అమ్మాయిల టీమ్‌లో సైనా నెహ్వాల్ సహా డబుల్స్ స్టార్ అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి, గాదె రుత్వికా శివాని ఉన్నారు. 'ఎవర్ని ఎంపిక చేయాలనేదానిపై తీవ్ర కసరత్తు చేసన తర్వాతే ఉత్తమ పది మందిని ఎన్నుకొన్నాం. ఆటగాళ్లందరూ అత్యుత్తమ ఫామ్‌లో ఉండటంతో ఈసారి గెలుస్తామన్న నమ్మకమున్నది.' అని సెలక్షన్ అనంతరం బాయ్ ప్రధాన కార్యదర్శి అనూప్ నారంగ్ తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.